అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 28-4-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 9 సంచిక: 117 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

దిగొచ్చిన మహాసర్కారు

రైతన్న పాదయాత్రతో ప్రభుత్వంలో చలనం

- అన్నదాతలతో ప్రభుత్వ ప్రతినిధి బృందం చర్చలు
- తాత్కాలికంగా మార్చ్ నిలిపివేత



వివరాలు 2లో..



ట్రెండ్ సెట్ చేద్దాం..

దేశానికి బీఆర్ఎస్ వెలుగుదివ్వె...

- పార్లమెంటరీ పంథాలో దేన్నైనా సాధించొచ్చని నిరూపించాం
- స్వరాష్ట్రాన్ని సాధించాం.. పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచాం...: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సీఎం కేసీఆర్
- ప్రతినిధుల సభను ప్రారంభించిన సెక్రటరీ జనరల్ కేకే
- తీర్మానాలను ప్రతిపాదించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో గుణాత్మక రాజకీయాలతో ఒక నూతన ట్రెండ్‌ను సృష్టించేందుకే పరిణామ క్రమంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ముందుకొచ్చిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. భారత దేశానికి అదో వెలుగుదివ్వె అని ఆయన తెలిపారు. అదే స్ఫూర్తితో పాలనలోనూ ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యావత్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నిజం చేసేందుకోసం ఆవిర్భవించిన బీఆర్ఎస్ ...2లో

గతం కన్నా ఎక్కువ సీట్లు సాధించాలి...

బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావటమనేది పెద్ద టాస్క్ కాదని కేసీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కానీ గతం కన్నా ఎక్కువ సీట్లను సాధించాలనీ, ఈసారి వంద సీట్లు సాధించాలంటూ బీఆర్ఎస్ నేతలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. దాహం వేసినప్పుడే బావి తవ్వుదామనే పద్ధతిలో కాకుండా అనునిత్యం ప్రజల్లో ఉండటం ద్వారా పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. దళిత బంధు పథకానికి సంబంధించి కొంతమంది ప్రజా ప్రతినిధులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. అలాంటి వారందరి చిట్టా తన దగ్గరుందంటూ హెచ్చరించారు. ఇకముందు వసూళ్లకు పాల్పడితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు.

కుక్కలు మొరిగినట్టుగా కేంద్రం తీరు...

రైతులను ఆదుకునే విషయంలో కేంద్రం తీరు దొంగలు పడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టుగా ఉందని కేసీఆర్ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్లే తెలంగాణ రైతులు కేంద్రంపై ఏనాడూ ఆశలు పెట్టుకోవటం లేదన్నారు. అవసరానికి అక్కరకొచ్చే పరిస్థితి కేంద్రానికి లేదంటూ విమర్శించారు. అందువల్లే రాష్ట్ర ప్రభుత్వమే అన్నింటికీ సిద్ధపడి రైతులను ఆదుకుంటోందని వివరించారు. ఈ క్రమంలో దేశంలోనే మొదటిసారిగా ఎకరాకు రూ.10 వేల పునరావాస సాయాన్ని ప్రకటించామని గుర్తు చేశారు. ఒక్క గింజనూ వదలకుండా మొత్తం ధాన్యాన్ని కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణాయేనని తెలిపారు.

ఇండ్లు, ఇండ్లస్థలాలివ్వడంలో

ప్రభుత్వాల నిర్లక్ష్యం

జూన్ ఒకటి నుంచి పోరాటం తీవ్రతరం : తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేదలకు ఇండ్లు, ఇండ్లస్థలాలివ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందాయని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య వివరించారు. ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జూన్ ఒకటి నుంచి పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్టు ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా జక్కలొద్దీలో ప్రారంభమైన ఇండ్లు, ఇండ్ల స్థలాల పోరాటం రాష్ట్రవ్యాప్తంగా 67 కేంద్రాలకు విస్తరించి ఏడాది కాలంగా కొనసాగుతున్నదని తెలిపారు. 37 వేల మంది పేదలు ఆయా కేంద్రాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని చెప్పారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండగా, మరో వైపు కొన్ని కేంద్రాల్లో పోలీసులు, మరి కొన్ని కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు గుండాలతో దౌర్జన్యాలు చేస్తున్నారని విమర్శించారు.

పేదల పోరాట ఫలితంగా రాష్ట్ర సర్కారు అనివార్యంగా జీవో నెంబర్ 58, 59 విడుదల చేసిందని వీరయ్య ఈ సందర్భంగా చెప్పారు. కానీ, జీవో 58ని పక్కన పెట్టి జీవో 59తో తమకు కావాల్సిన వారికి భూమిని ధారాదత్తం చేసేందుకు పేదలకు షరతులు విధించటం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆచరణలో అమలు చేయకూడదనే ఉద్దేశంతోనే విద్యుత్ బిల్లు, నీటి బిల్లు, పొజిషన్ లో ఉన్నట్టు రుజువులు చూపాలంటూ షరతులు పెడుతున్నారని ఆరోపించారు. అవసరమనుకుంటే భౌతికంగా తనిఖీ చేసుకోవాలనీ, కానీ అందరికి పట్టాలివ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి 120 గజాల స్థలం ఇవ్వాలనీ, సరిపోకపోతే అందుబాటులో ఉన్న ...5లో

గడువు పొడిగించాలి


58,59 జీవోల ప్రకారం ఇండ్లస్థలాలపై తమ్మినేని

- దరఖాస్తు చేసుకున్నవారందరికీ పట్టాలు ఇవ్వాలి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవో నెంబర్ 58, 59ల ప్రకారం ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చే గడువును పొడిగించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్నవారందరికీ పట్టాలను ...5లో



ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాల నుంచి తొలగించిన సైన్స్, చరిత్ర పాఠాలను తాము పునరుద్ధరిస్తామని ప్రకటించిన కేరళ సీఎం విజయన్

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకే

గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం తగదు

మే నుంచి జూన్ వరకు దశలవారీగా ఆందోళనలు

- జూన్ 5న పంచాయతీరాజ్ కమిషనర్‌కు సమ్మె నోటీసు
- 12న కలెక్టరేట్ల ఎదుట నిరసనలు : తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్
- మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్, కారోబార్, బిల్‌కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, ఎస్‌కే.డే ఇన్సూరెన్స్ స్కీం అమలు, తదితర సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ అల్టిమేటం జారీచేశారు. జీపీ కార్మికులు, ఉద్యోగుల వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం రూ.20 లక్షలు ఇవ్వాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. దానికి అధ్యక్ష వర్గంగా జెఏసీ సభ్యులు ఎన్. యజ్ఞనారాయణ(టీజీపీకేబీయూ), పి. అరుణ్‌కుమార్ (ఐఎఫ్‌టీయూ), ఎన్. దాసు (ఐఎఫ్‌టీయూ), చాగంటి వెంకటయ్య (సీఐటీయూ), జె. వెంకన్న (ఐఎఫ్‌టీయూ), నర్సింహారెడ్డి ...5లో



దుర్భరంగా

రజకుల బతుకులు

యంత్రాల రాకతో వృత్తిదారుల ఉపాధికి దెబ్బ

- నగరాలకు పెరిగిన వలసలు
- ప్రత్యేక రక్షణ చట్టం కోసం ఉద్యమం

ఉత్సవ విగ్రహాల్లా కార్పొరేషన్లు

కుటుంబాలు చిన్నాభిన్నం

నవతెలంగాణతో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య

ముఖాముఖీ

కాలం మారింది. యాంత్రిక జీవనం పరుగులు పెడుతోంది. కులవృత్తులు, చేతివృత్తులూ రోజురోజుకు అంతరిస్తున్నాయి. యంత్ర పరికరాలే పనులన్నింటినీ చేస్తున్నాయి. నిద్ర లేచిన దగ్గర్నుంచి.. పడుకునే వరకూ అన్ని పనులకూ స్విచ్ ఆన్.. స్విచ్ఛాఫ్.. 'అమ్మా చాకలిదాన్నొచ్చినా.. బట్టలెయ్యండ్రి.. పొద్దుపోయింది' అనే మాటలు చెవుల నుంచి దూరం కాకముందే.. ఇంట్లోకి వాషింగ్ మిషన్ వచ్చి చేరింది. దీంతో రజక వృత్తి బజారున పడింది. బతుకుదెరువు కోసం పిల్లాపాపలతో పట్నం బయలెల్లింది. అయితే పాశ్చాత్య సంస్కృతి ఎగబాకి రజకులను నట్టేట ముంచింది. దానికి పాలకుల పాపం మరికొంత తోడైంది. ఫలితం.. చాకిరేవుల కనుమరుగయ్యాయి. ఉన్న కాస్త వృత్తిదారులపై గ్రామ పెత్తందార్లు దాష్టికానికి ఒడిగడుతున్నారు. వివక్షకు గురిచేస్తున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. వెరసి.. వృత్తిదారుల బతుకు దుర్భరంగా మారిందని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఆ సంఘం రాష్ట్ర మూడో మహాసభలు జనగాంలో జరగనున్న నేపథ్యంలో నవతెలంగాణ ప్రతినిధి ఎస్ వెంకన్నకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు..



రజక వృత్తిదారుల పరిస్థితి ఎలా ఉంది?

వారి పరిస్థితి దయనీయంగానే ఉంది. చేతివత్తిదారుల్లో ఒక్కో వత్తిదీ ఒక్కో దీనగాథ అయితే... రజకులది చెబితే ఒడవని వ్యథ...ఇది చాలా ప్రధానమైన వత్తి. సేవా వృత్తి. అందరికీ అవసరమైందైనప్పటికీ వీరి పట్ల వివక్ష కొనసాగుతున్నది. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రజకుల జనాభా 10లక్షలుగా ఉంది. వీరిలో 80శాతం మంది వృత్తిపై ఆధార పడి బతుకుతున్నారు. బట్టలు ఉతకటం, ఇస్త్రీ చేయటం ఒక్క మాటలో చెప్పాలంటే.. వీరు లేనిదే పల్లెల్లో సంప్రదాయమైన పనులు చాలా వరకు జరగవు. పెండ్లిండ్లు, చావుల వరకు వీరుండాల్సిందే. ఇప్పుడు ఈ కుల వృత్తి ...2లో

రెజ్లర్లకు మద్దతుగా దేశవ్యాప్త ఆందోళన

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి : ప్రజా సంఘాల డిమాండ్

- ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద మహిళ సంఘాల నిరసన
- ఐద్వా నేతలను బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు 2లో..

బీజేపీని ఓడించాలి

- కర్నాటకలో ఇంటింటికీ ప్రచారం : ఎస్కేఎం కిసాన్ 5లో.. పంచాయత్ నిర్ణయం



మోకాళ్లపై నిలబడి వీఓఏల నిరసన

మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని.. వేతనాలు పెంచాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. గురువారం రంగారెడ్డి జిల్లాలో మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కందుకూర్, తలకొండపల్లి, కడ్తాల్, మహేశ్వరంలో వీఓఏల దీక్షలకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కందుకూర్, కడ్తాల్, తలకొండపల్లిలో మోకాళ్లపై కూర్చుని వీఓఏలు నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కందుకూరు జడ్పీటీసీ జంగారెడ్డి ఆధ్వర్యంలో వీఓఏలు మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ.. వీఓఏల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని వనపర్తి జిల్లా పరిధిలోని కొత్తకోట మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు నిరవధిక దీక్ష చేపట్టారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ సంఘీభావం తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి, వంగూరు మండలాల్లో ఐకేపీ-వీవోఏలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. మేనేజర్ పవన్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్లు లక్ష్మీ, నరేష్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.విజయ్‌గౌడ్ వివోఏలకు మద్దతు తెలిపారు.

నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో ఐకేపీ వీఓఏలు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం వంట వార్పు కార్యక్రమం చేపట్టారు. కేతెపల్లిలో కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి దైద రవీందర్ వీఓఏల సమ్మెకు మద్దతు తెలిపారు. మిర్యాలగూడలో తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తాకు వివోఏలు వినతిపత్రం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో వీవోఏల దీక్షలకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సంఘీభావం తెలిపారు. వీవోఏల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. వారికి తాము ...5లో

రెజ్లర్లకు మద్దతుగా దేశవ్యాప్త ఆందోళన

- రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి: ప్రజా సంఘాలు
- ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద మహిళా సంఘాల నిరసన
- ఐద్వా నేతలను అరెస్టు చేసిన పోలీసులు
- ఐదో రోజు కొనసాగిన రెజ్లర్ల ఆందోళన



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

దేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి క్రీడాకారులను లైంగిక వేధింపులకు పాల్పడి చిత్రహింసలు చేసిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడుతున్న బీజేపీ, మోడీ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. బ్రిజ్ భూషణ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఏఐకేఎస్, ఏఐఎడబ్ల్యూయూ, సీఐటీయూ, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన జరిగింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తీవ్ర ఆరోపణ ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఎంపీ, రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ (డబ్ల్యూఎఫ్ఐ)పై తక్షణమే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐదు ప్రజా సంఘాలు ఉమ్మడిగా పిలుపు మేరకు గురువారం దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. దేశంలోని వివిధ ప్రాంతాల విస్తృత ప్రదర్శనలు, ధర్నాలు, మానహారాలు, దిష్టిబొమ్మ దహనం, స్థానిక అధికారులతో రాష్ట్రపతికి మెమోరాండం సమర్పించారు. ఈ ఆందోళనల్లో వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. పంజాబ్, హర్యానా, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా, అసోం, మణిపూర్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్‌లలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఏడుగురు మహిళా రెజ్లర్లు (ఇందులో ఒక మైనర్ కూడా ఉన్నారు) ఫిర్యాదులు చేసినప్పటికీ ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దిగ్భ్రాంతికరమని, రాజధాని నగరంలో శాంతిభద్రతల వ్యవస్థ పూర్తిగా పతనమైందని పేర్కొన్నారు. నిందితుడు అధికార పార్టీ బీజేపీకి చెందిన పార్లమెంటు సభ్యుడని, నిందితులను రక్షించడానికి ప్రధానమంత్రి, ఆయన ప్రభుత్వం నానాయాతన పడుతుందని వాస్తవాన్ని ఇది నొక్కి చెబుతుందని అన్నారు. బాధిత మహిళలు న్యాయం కోసం వీధిలో పడుకోవాల్సిన ఈ అరాచక పరిస్థితికి మోడీ ప్రభుత్వామే కారణమని పేర్కొన్నారు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోండి

బ్రిజ్ భూషణ్ పైఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, నిందితులను అరెస్టు చేసి బాధిత మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగేలా ఢిల్లీ పోలీసులను, ప్రధానిని ఆదేశించేలా తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతిని కోరారు. దేశ అత్యున్నత పరిపాలనా స్థానంలో ఉన్న మహిళగా మీ కనీస బాధ్యతని రాష్ట్రపతిగా మీ నుంచి ఆశిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ తక్షణమే రాజీనామా చేయాలని, అన్ని ఆరోపణలపై విచారణ జరిపి దోషులందరిపై కేసులు నమోదు చేయాలని రాష్ట్రపతిని కోరారు. క్రిమినల్ మాఫియాతో బాధితులను బెదిరించిన నేరానికి పాల్పడిన వారిని, ఫిర్యాదులను పట్టించుకోని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లోని పోలీసు అధికారులపై కూడా చట్ట ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేయాలని కోరారు. తపన్ సేన్ (సీఐటీయూ), విజ్జూ కృష్ణన్ (ఏఐకేఎస్), బి. వెంకట్ (ఏఐఎడబ్ల్యూయూ), మరియం ధావలే (ఐద్వా), హిమఘ్నరాజ్ భట్టాచార్య (డివైఎఫ్ఐ), మయూక్ బిస్వాస్ (ఎస్ఎఫ్ఐ) ప్రకటన విడుదల చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఐదో రోజు కొనసాగిన రెజ్లర్ల ఆందోళన

రెజ్లర్ల ఆందోళన ఐదో రోజు కూడా కొనసాగింది. ఢిల్లీలో జంతర్ మంతర్‌లో ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న రెజ్లర్ల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పికె శ్రీమతి టీచర్, మరియం దావలే, నేతలు శైలజా టీచర్, సిఎస్ సుజాత, డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్, జెఎన్ యు ఎస్ యు అధ్యక్షురాలు ఐషీఘోష్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఆర్ఎల్డి నేత, రాజ్యసభ ఎంపి జయంతి చౌదరి, ఆర్ఎల్పి నేత, ఎంపి హనుమాన్ బెనివాల్ ఒలింపిక్ విజేత గీతా ఫోగట్ సంఘీభావం తెలిపారు. సత్యాన్ని ఇబ్బంది పెట్టవచ్చు కానీ ఓడిపోకూడదని రెజ్లర్ గీతా ఫోగట్ అన్నారు.

ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన

క్రీడాకారుల ఫిర్యాదు మేరకు బ్రిజ్ భూషణ్‌పై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ మహిళా సంఘాలు ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద నిరసనకు దిగింది. ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యుఎ, ఎఐఎంఎస్ఎస్, పిఎంఎస్, సిఎస్‌డబ్ల్యూ సంఘాల నేతలు ఆందోళన చేశారు. ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పికె శ్రీమతి టీచర్, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, ఐద్వా ఢిల్లీ అధ్యక్షురాలు మైమూనా మొల్లా తదితర నేతలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. నేతలను ఈడ్చుకెళ్లి బస్సులోకి ఎక్కించారు. ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు నేతలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాదాపు యాభై మంది మహిళ నేతలు పాల్గొన్నారు.

దుర్భరంగా రజకుల బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

అంతరించిపోతున్నది. ప్రపంచీకరణ పల్లె జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తున్నది. ఇస్తరాకుల తయారీ నుంచి బట్టలు ఉతికే వరకు యంత్రాలు ప్రవేశించి వృత్తుల చేతుల్ని విరిచేస్తున్నాయి. పల్లెచల్లగా ఉండాలంటే అక్కడ శ్రమించే వృత్తిదారుడు చేతినిండా పనితో సంతోషంగా ఉండాలి. ఇందులో చాకలి (రజక) వృత్తి ఒకటి. వీరు రోజంతా శ్రమిస్తున్నా కుటుంబాన్ని పోషించుకోవడంలో అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. వెట్టిచాకిరి తప్పడం లేదు. గ్రామకమిటీ నిర్ణయించిన ధర 'మాకు గిట్టదు' అన్న వారికి సాంఘిక భహిష్కరణ బహుమతిగా అందుతోంది. మహిళలపై లైంగిక దాడులతో పాటు రాష్ట్రంలో ఏదో ఒక మూల పెత్తందార్ల దాష్టీకానికి గురవుతూనే ఉన్నారు.

వలసలు పెరిగటానికి కారణాలేంటి?

వారి పని స్వభావం వల్లనో ఏమోగానీ..ఇప్పటికీ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతికంగా జరగాల్సినంత అభివృద్ధి, చైతన్యం రజకుల్లో పెరగని మాట వాస్తవం. చదువుపై ప్రాముఖ్యత పెరగాల్సినంతగా పెరగలేదు. వృత్తికి ప్రాధాన్యత ఇవ్వటం మూలంగా డ్రాఫౌట్స్ నేటికీ పెరుగుతూనే ఉన్నాయి. ఉన్న కాస్త భూమితో తగిన పైకం రాక..ఉపాధి హామీ పనులకు పోతున్నారు. ఇదిలా ఉంటే..ఈ మధ్యకాలంలో నగరాల్లో అపార్ట్‌మెంట్ కల్చర్ విపరీతంగా పెరిగింది. వృత్తిదారుల అవసరం కూడా ఆ మేరకు పెరిగింది. పల్లె నుంచే కాదు..పక్క రాష్ట్రాల నుంచి కూడా నగరాలకు వలసలొస్తున్నారు. అయినా వీరి ఆదాయం దారిద్ర్యరేఖకు దిగువనే ఉంటున్నది.

వివక్ష ఇప్పటికీ కొనసాగుతున్నదా?

గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ రజక వృత్తిదారులను కుల వివక్ష వెంటాడుతూనే ఉన్నది. దళితుల తర్వాత ఆ స్థాయిలో వివక్షను ఎదుర్కునేది వీరే. రూపాల్లో తేడాలున్నాయి అంతే.. అరే.. ఓరే.. సాకలోడా..అని పిలుస్తూ ఆత్మన్యూనతకు గురిచేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. దేశం, రాష్ట్రం ఎంతో ముందుకు పోతున్నదని చెప్పుకుంటున్నప్పటికీ..పాత కాలం (ఫ్యూడల్) అవశేషాలను ఒడిసి పట్టుకుని, అదే తరహా వివక్షత పెత్తదాంర్ల నుంచి ఎదురవుతున్నది.ఏనిమిదేండ్ల కాలంలో రాష్ట్రంలో 17మంది హత్యకు గురయ్యారు. 70మందిపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరిగాయి. ఎస్సీ, ఎస్టీలకు కొన్ని ప్రత్యేక రక్షణ చట్టాలున్నాయి. ఆ తరహా చట్టాలు రజకులకు లేకపోవటంతో పెత్తందార్లు ఎలాంటి జంకు లేకుండా వ్యవహరిస్తున్నారు. అందుకే అందుకే ప్రత్యేక సామాజిక భద్రత రక్షణ చట్టం కావాలని డిమాండ్ చేస్తున్నాం.

వృత్తి ఆధునీకరణ కుదరదా?

ఆదునిక సమాజంలో వృత్తిని కూడా ఆదునీకరించాల్సిన అవసరం ఉంది. తద్వారా ఉపాధి మెరుగవుతుంది. పాలకులు ఆ వైపుగా తగిన నిర్ణయాలు తీసుకోవాలనే విషయాన్ని పలు మార్లు సంబంధిత అధికార్ల దృష్టికి రజక వృత్తిదారుల సంఘం తీసుకొచ్చింది. ఉద్యమాలు నిర్వహించింది. చేస్తాం..చూస్తామంటూ..ప్రభుత్వాలు తాత్సారం చేశాయి. ఈ మధ్యన్నే కాస్త కదిలిక వచ్చింది. మెకనైజ్డ్ దోబీఘాట్ల స్కీం వచ్చింది. తొమ్మిది పైలెట్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కార్యాచరణను ప్రభుత్వం రూపొందించింది. 141 మున్సిపాల్టీల్లో రూ.282 కోట్లతో ఆధునిక దోబీ ఘాట్లను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ శాఖ ద్వారా కృషి జరుగుతున్నది. 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 73వేల మంది వృత్తిదారులు వినియోగించుకుంటున్నారు.మరిన్ని మెరుగైన సౌకర్యాలు సాధించుకోవాల్సింది ఉంది.

కుల గణన చేస్తే..రజక వృత్తికి జరిగే ప్రయోజనం ఏంటి?

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వెనకబాటు తో కొట్టుమిట్టాడుతున్న రజక వృత్తిదారుల పట్ల పాలకులు నిర్లక్ష్యం ఉన్న మాట వాస్తవం. కుల గణన చేపడితే..జనాభా ప్రాతిపదికన చట్టబద్ధంగా వారికి రావాల్సిన నిధులతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వాటా ఎంతో తేలిపోతుంది. ఇది అందరికీ వర్తించే అంశమే. అందుకే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కుల గణనను తొక్కి పెడుతున్నది. ఓబీసీ వర్గీకరణ కోసం 2017లోనే కేంద్ర ప్రభుత్వం రోహిణీ కమిషన్‌ను వేసింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఆమోదించటం లేదు. బీసీలు, ఎంబీసీల పట్ల బీజేపీ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో దీన్ని బట్టే అర్థమవుతున్నది.

రాష్ట్రంలో రజక ఫెడరేషన్ పనిచేస్తున్నదా?

రజక ఫెడరేషన్ రాష్ట్రంలో నిర్వీర్యంగా ఉంది. 1982 లోనే ఇది ఏర్పడింది. కానీ..దీనికి ఎప్పుడూ నిధులు కేటాయించలేదు. పేరుకే ఫెడరేషన్ తప్ప..వాస్తవానికి ఉత్సవ విగ్రహంగా మారింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కూడా దాని స్థితిలో ఎలాంటి పురోగతి లేకపోవడం వృత్తిదారులను మరింత బాధకు గురిచేస్తున్నది.పాలక వర్గాన్ని నియమించలేదు. జీవో నెం 11 ప్రకారం రజక సంక్షేమ కమిటీలు వేయాలి. వాటిని నిరంతర ఫంక్ష నింగ్‌లో ఉంచాలి. కానీ.. ఆ ప్రక్రియ కొనసాగటం లేదు. మరో పక్క ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవోలను ఇప్పటి వరకు రివైజ్ చేయలేదు. దీంతో వృత్తిదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పాత జీవోలను జిల్లా అధికారులు పట్టించుకోవటం లేదు.కొత్త జీవోలను ప్రభుత్వం ఇవ్వటం లేదు.

మహాసభలో చర్చించనున్న ప్రధాన అంశాలేంటి?

మహాసభలో వృత్తిదారులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన అంశాలను చర్చిస్తాం. అందులో ముఖ్యంగా 'రజక వృత్తి దారులకు రూ.10లక్షల రుణం ఇవ్వాలి. 50సంవత్సరాలు నిండిన ప్రతి రజకునికి పెన్షన్ ఇవ్వాలి. రజకులపై జరిగే దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలి. ఉచిత విద్యుత్ లబ్దిదారులం దరికీ రూ. 5లక్షలు బీమా సౌకర్యం కల్పించాలి. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి. ప్రభుత్వ ఆస్పత్రులు, పోలీసు శాఖలు, విద్యాసంస్థల్లో రజక వృత్తిపనిని స్థానిక రజక వృత్తి దారులకు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీగణన చేపట్టాలి, జస్టిస్ రోహిణీ కమీషన్ సిఫారసులు అమలు చేయాలి.'తదితర అంశాలపై చర్చించి.. పలు తీర్మానాలు ఆమోదిస్తాం. చాకలి ఐలమ్మ ప్రాంగణంలో జరుగబోయే ఈ మహాసభలకు ప్రత్యేకత ఉంది. నాలుగేండ్ల కాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలపై సమీక్ష నిర్వహించి... తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలకు శ్రీకారం చుట్టబోతున్నాం.

దిగొచ్చిన 'మహా'సర్కారు

ముంబయి: రైతన్నకు ఇచ్చిన హామీలు, డిమాండ్లను నెరవేర్చే విషయంలో మహారాష్ట్ర సర్కారు మాట తప్పుతున్నది. కొన్ని రోజుల కిందే ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర చేపట్టిన అన్నదాతలు మళ్లీ అలాంటి పోరాటానికే సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా రైతులు చేపట్టిన పాదయాత్ర రెండో రోజు వాయిదా పడింది. యాత్రలో భాగంగా దందర్‌ఫాల్‌లోని రామేశ్వరం ఆలయంలో అన్నదాతలు విడిది చేశారు. అయితే, పాదయాత్రకు వచ్చిన స్పందన మహారాష్ట్ర సర్కారును ఆందోళనకు గురి చేసింది. దిగొచ్చిన షిండే సర్కారు చర్చలకు సిద్ధపడింది. దీంతో ప్రభుత్వ ప్రతినిధి బందం రైతులతో సమావేశమై మాట్లాడనుంది.

అయితే, పోలీసు నోటీసులతో ప్రభుత్వం నుంచి బెదిరింపులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు రైతుల ఆత్మధైర్యాన్ని అరికట్టలేకపోయింది. బుధవారం మొదటి రోజు వేలాది మంది రైతులతో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. అకోల్ మార్కెట్ నుంచి రామేశ్వరం దేవాలయం (ధండర్ ఫాల్, తహసీల్ సంగమ్‌నేర్) వరకు సుమారు 12 కిలో మీటర్ల దూరాన్ని కవర్ చేసింది. రైతులు ఆ రోజు రాత్రి ఆరుబయటే గడిపారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు రామేశ్వరం ఆలయం నుంచి ఖాటోడ్ లాన్ వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర కాలినడకన బయలుదేరారు. యాత్రలో పాల్గొంటున్న వేలాది మంది రైతులు, యాత్రకు వస్తున్న మద్దతును చూసిన ప్రభుత్వం, రైతులు ముందుకు సాగొద్దని చెప్పింది. రైతు ప్రతినిధులతో చర్చలు ప్రారంభించింది. దీంతో రైతు నేతలు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పాదయాత్రను రైతులు నిలిపివేశారు.

తొలిరోజు ఈ సుదీర్ఘ ప్రయాణం తర్వాత కూడా రైతుల ఉత్సాహంలో ఎలాంటి తేడా కనిపించలేదు. రాత్రి 10 గంటల తర్వాత కూడా రైతులంతా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల్లో కూర్చుని మాట్లాడుకున్నారు. రెండో రోజు ఉదయం 10 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం మొదలైంది. కొందరు రైతులు గుడి, ఆడిటోరియంలో ఎక్కడో చెట్లకింద ఆశ్రయం పొందగా.. చాలామంది తమ వాహనాల వైపు పరుగులు తీశారు. వర్షం ఎక్కువసేపు కురవకపోవడంతో తీవ్రమైన ఎండలకు వాతా వరణం మళ్లీ వేడెక్కింది. జర్నలిస్టులు మండుతున్న ఎండను తట్టుకోలేక తమ వాహనాల ఎయిర్ కండిషనర్‌లలో సేద తీరగా.. రైతులు మాత్రం దాదాపు 10 కిలో మీటర్ల దూరం పాదయాత్రను చేశారు. తమ నాయకులు తమకు దిశానిర్దేశం చేస్తే మిగిలిన 40 కిలోమీటర్ల యాత్రను ఒక్కరోజులో పూర్తి చేస్తామని చెప్పారు.అకోల్ నుండి బయలుదేరే ముందు సుదీర్ఘయాత్ర కోసం అనేక ఏర్పాట్లను చేసుకున్నారు. మహారాష్ట్రలోని ఈ గిరిజన రైతులకు ఈ యాత్ర మొదటిది కాదు. వారు ఇప్పటికే అలాంటి మూడు మార్చ్‌లను నిర్వహించారు. గత పాదయాత్రల అనంతరం ప్రభుత్వం వారి డిమాండ్లను ఆమోదించింది. అయితే తమ డిమాండ్ల అమలులో ప్రభుత్వం మోసం చేస్తున్నదని రైతులు వాపోతున్నారు.

అహ్మద్‌నగర్ జిల్లాలోని అకోల్ నుంచి లోనీ వరకు జరిగిన ఈ లాంగ్ మార్చ్‌కు సంబంధించి పోలీసులు సెక్షన్ 149 కింద నోటీసు జారీ చేసి నిరసనకారులకు అనుమతి నిరాకరించారు. అయితే దీని వల్ల రైతులపై ఎలాంటి ప్రభావం పడలేదు. దీనిపై ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజిత్ నావాలే మాట్లాడుతూ.. పోలీసులు రైతులకు శత్రువు కాదన్నారు. వారి పని వారు చేసుకుపోతున్నారనీ, నేడు ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి ఆందోళనా లేదని చెప్పారు. ఎండలో పనిచేస్తూ జీవితాలు గడుపుతున్న రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కావడం లేదనీ, వేసవిలో రైతుల చెమటకు విలువ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మేం పగలు, రాత్రి మా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అధికారులు, మంత్రుల సమావేశాల్లో సీరియస్‌నెస్ లేదనీ, అందుకే ఈ పాదయాత్రను ఏకగ్రీవంగా చేపడుతున్నామని చెప్పారు.

రైతులు ఎందుకు ఉద్యమిస్తున్నారు?

తాము రైతులు, వ్యవసాయ కార్మికులకు అటవీ భూమిని అప్పగించడం, యాజమాన్యం గురించి మాట్లాడుతున్నామని నవాలే తెలిపారు. అలాగే, పత్తి, పాలు, సోయాబీన్, అర్హార్, పెసర, ఇతర ఉత్పత్తు లకు లాభదాయకమైన ధరలను కూడా డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. విదర్భకు చెందిన పలువురు రైతులు తమ ప్రధాన పంటలలో ఒకటైన పత్తి ధరలు గతేడాదితో పోలిస్తే సగానికి పడిపోయాయని తెలి పారు. ఈ మార్చ్‌లో పాల్గొన్న ఐద్వా ప్రధాన కార్య దర్శి మరియం ధావలే మాట్లాడుతూ.. రైతుల ఈ మార్చ్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొంటున్నా రని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు వారి ఇండ్లలోకి బలవంతంగా ప్రవేశించి వారితో అనుచితంగా ప్రవర్తించారని చెప్పారు. దేశ పార్లమెంటు వారికి హక్కులను కల్పించే చట్టాన్ని ఆమోదించినా.. ప్రభుత్వం మాత్రం అమలు చేయడం లేదని తెలిపారు.

డిమాండ్లు నెరవేరకపోతే నిరవధిక సమ్మె: రైతులు

ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయ్ నరకర్ మాట్లాడుతూ..గత నెల లాంగ్ మార్చ్ తర్వాత ప్రభుత్వం మా డిమాండ్‌లను అంగీకరించి, వాటిని అమలు చేసేందుకు కమిటీని కూడా వేసింది. అయితే ఆ కమిటీ చైర్మెన్, రెవెన్యూ మంత్రి రాధాకష్ణ పాటిల్ వాటిని అమలు చేయలేదన్నారు. అందుకే తాము మరోసారి పోరాట బాట పట్టాల్సి వచ్చిందని చెప్పారు. రైతుల డిమాండ్లను నెరవేర్చకుంటే మహా రాష్ట్రలోని మంత్రి పాటిల్ కార్యాలయం దగ్గర నిర వధిక దీక్షకు దిగుతామని రైతు నాయకులు హెచ్చరించారు. రైతుల సమస్యలపై గత నెలలో ఏఐకేఎస్ నాసిక్ జిల్లా నుంచి ముంబయి వైపు లాంగ్ మార్చ్ చేపట్టింది. ఇందులో ఉల్లి రైతులకు సబ్సిడీలు, గిరిజన ప్రాబల్యం ఉన్న జిల్లాల్లో భూ యాజమాన్యం, రుణమాఫీ సహా 14 డిమాండ్లు లేవనెత్తిన విషయం తెలిసిందే.

ట్రెండ్ సెట్ చేద్దాం..

(మొదటిపేజీ తరువాయి)

(టీఆర్ఎస్)... 22 ఏండ్ల అనతికాలంలోనే స్వరాష్ట్ర సాధన లక్ష్యాన్ని సాధించటం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచిందని వివరించారు. ఆ క్రమంలో ఒక గుణాత్మక మార్పు చెంది చారిత్రక దశలోకి ప్రవేశించిన సందర్భంలో 23వ ఆవిర్భావ వేడుకలు జరుపుకోవటం అందరకీ గర్వకారణమని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ వేడుకలను, గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆ పార్టీ సర్వసభ్య సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు అక్కడికి చేరుకున్న కేసీఆర్... తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభకు చేరుకున్నారు. ఆ తర్వాత పార్టీ సెక్రటరీ జనరల్, ఎంపీ కే.కేశవరావు ప్రసంగంతో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఆయన ప్రసంగం పూర్తయిన తర్వాత ప్రతినిధుల నుద్దేశించి కేసీఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలు తీర్మానాలను ప్రతిపాదించారు. ప్రతినిధుల సభలో కేసీఆర్ మాట్లాడుతూ... రాజకీయ పంథాలో తక్కువ నష్టంతో తెలంగాణను సాధించుకున్నామని అన్నారు. తద్వారా పార్లమెంటరీ పంథాలో దేన్నైనా సాధించవచ్చనే విషయాన్ని రుజువు చేశామని తెలిపారు. 75 ఏండ్ల స్వతంత్ర భారత పార్లమెంటరీ పంథాలో తెలంగాణ బిడ్డలు... గులాబీ జెండానెత్తుకుని అనుసరించిన ప్రజాస్వామిక ఉద్యమ కార్యాచరణ అత్యంత క్లిష్టమైన తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యాన్ని సాధించిందని వివరించారు. అదే పంథాలో 'అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్...' అనే నినాదంతో దేశాన్ని ప్రగతి పథంలో నిలబెట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్ని కష్టాలొచ్చినా వ్యవసాయ రంగాన్ని ఆదుకుని తీరతామని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పునరావాస సాయాన్ని అందిస్తామని వెల్లడించారు. తద్వారా వారిలో ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా చూస్తామని హామీనిచ్చారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళుతున్నదని తెలిపారు. ఇటీవల అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో తక్షణమే కలెక్టర్లతో నివేదికలు తెప్పించుకుని వారిని ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులను ఆయన ఆదేశించారు. అకాల వర్షాలు రాకముందే పంట కోతలు పూర్తయ్యేలా రైతులను చైతన్యపరచాలని సూచించారు. మొక్క జొన్నలు, జొన్నలతోపాటు ఇతర అన్ని పంటలనూ గతంలో మాదిరిగానే కొంటామని హామీనిచ్చారు. మార్క్‌ఫెడ్‌కు ఆ మేరకు ఆదేశాలిస్తామని వెల్లడించారు.

బండ మీద నూకలు పుట్టించొచ్చు...

తెలివుంటే బండ మీద సైతం నూకలు పుట్టించొచ్చని కేసీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అదే రీతిన ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయటం, ప్రజలతో నిత్యం సంబంధాలను నెరపటం, ప్రచార వ్యవస్థలను మెరుగుపరుచుకోవటం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే సమయంలో పార్టీ శ్రేణులతో మమేకమవ్వటం ద్వారా వారి కష్ట సుఖాలను తెలుసుకుని కలుపుకుని పోవాలని దిశా నిర్దేశం చేశారు. పార్టీ, ప్రభుత్వం సాధించిన ప్రగతి గురించి సానుకూలంగా, పాజిటివ్‌గా ఆలోచించే మీడియాను, పత్రికలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. అక్కడో, ఇక్కడో క్యాడర్‌లో అసంతృప్తి ఉంటే దాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలంటూ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆదేశించారు.

బీసీ జనగణన ఎందుకు చేపట్టటం లేదు ?

బీసీ జనగణనను చేపట్టేందుకు కేంద్రం ఎందుకు వెనకడుగేస్తున్నదని సీఎం ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రపంచ యుద్ధాల సమయంలో కూడా జనగణనను ఆపలేదని గుర్తు చేశారు. కానీ కేంద్రంలోని బీజేపీ దాన్ని ఎందుకు ఆపుతున్నదో అర్థం కావటం లేదన్నారు. మత విద్వేషాలతో కాలయాపన చేస్తూ ఆ ప్రక్రియను పక్కకు పెడుతున్నారని విమర్శించారు.

పార్టీ ఫండ్ రూ.1,250 కోట్లు...

బీఆర్ఎస్ పార్టీ ఫండ్ ఇప్పటికి రూ.1,250 కోట్లుగా నమోదైందని కేసీఆర్ తెలిపారు. ఇందులో రూ.767 కోట్లను డిపాజిట్ చేశామన్నారు. తద్వారా నెలకు రూ.7 కోట్ల వడ్డీ వస్తున్నదని తెలిపారు. దీంతో పార్టీని నడపటం, జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలు, ప్రచారం, మౌలిక వసతుల కల్పన తదితర పనులను చేపడుతున్నామని వివరించారు.

మే 4న ఢిల్లీ కార్యాలయం ప్రారంభం...

ఢిల్లీలో నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని మే 4న ప్రారంభిస్తామని కేసీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. జూన్ ఒకటిన అమరుల స్మారకాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. రెండో తేదీన తెలంగాణ ఆవిర్భావ వేడుకలుంటాయని గుర్తు చేశారు.

అదానీపై ఎందుకు జీఎస్టీ వేయటం లేదు...? : కేటీఆర్

పసి పిల్లలు తాగే పాలపై జీఎస్టీ వేస్తున్న కేంద్రం... దేశాన్ని అప్పనంగా దోచుకుంటున్న అదానీ కంపెనీలపై ఎందుకు ఆ పన్ను వేయటం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశంలో తీర్మానాలను ప్రతిపాదించిన ఆయన మాట్లాడుతూ... దేశ యువతను రాజకీయాల వైపు మరల్చే విధంగా వారిని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. మన జీవితంలోని ప్రతీ అంశాన్ని రాజకీయాలు ప్రభావితం చేస్తాయని తెలిపారు. ఆ క్రమంలో రేపటి తరం రాజకీయాలపట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని అన్నారు.

యాసంగి మొక్కజొన్న కొనుగోలుకు సర్కారు నిర్ణయం

- మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

యాసంగి మొక్కజొన్న కొనుగోలుకు సర్కారు నిర్ణయించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. యాసంగిలో దాదాపు 6.50 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైందనీ, 17.37 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో సాగు చేశారని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.1962 ఉందనీ, అందుకనుగుణంగా కేంద్రాల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.


'పది' పేపర్ లీక్ కేసులో బండి సంజయ్..

- బెయిల్ రద్దు పిటిషన్ కొట్టేసిన కోర్టు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయప్రతినిధి

పదో తరగతి ప్రశ్నపత్రాల లీక్ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు ఊరట లభించింది. ఆయన నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని.. బెయిల్ రద్దు చేయాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను హన్మకొండ కోర్టు కొట్టివేసింది. బండి సంజయ్‌కు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు ఈనెల 17న హన్మకొండ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై గురువారం కోర్టు విచారణ చేపట్టింది. బెయిల్ మంజూరు చేసిన సమయంలో సూచించిన నియమాలు, నిబంధనలు బండి సంజయ్ ఉల్లంఘించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. విచారణకు సహకరించడం లేదని, ఫోన్ కూడా ఇవ్వలేదని కోర్టుకు నివేదించారు. అయితే ప్రాసిక్యూషన్ వాదనలతో మెజిస్ట్రేట్ విబేధిస్తూ.. బెయిల్ రద్దు చేయడానికి సరైన కారణాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు తీర్పునిచ్చింది.



ప్రమాద పరిణామంలో దేశం

ఎస్వీకే వెబినార్‌లో దేవరాజు మహారాజు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

'ఆనాటి డార్విన్ జీవ పరిణామం నుంచి పక్కకుపోయిన దేశం నేడు ప్రమాదకర పరిణామంలో ఉంది. ప్రభుత్వాలు తాత్కాలికమైనవి..సైన్స్ శాశ్వతమైనది. సైన్స్‌తో ఆటలా డొద్దు. భవిష్యత్ అంతా దానిదే. యువత సైన్స్ వైపు వెళ్తున్నారు. పాఠ్యపుస్తకాల్లో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తీసేసినంత మాత్రాన యువత మెదళ్ల నుంచి శాస్త్రీయ భావనలను తీసేయలేరు. సైన్స్ వల్లనే మానవ జీవితం సుఖమయం అయింది. ఎన్నో సౌలభ్యాలు పొందుతున్నాం' అని ప్రొఫెసర్ దేవరాజు మహరాజు అన్నారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్యవిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'మనువాదులకు చెంపపెట్టు జీవ పరిణామం' అంశంపై ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. లౌకిక, ప్రజాస్వామ్య దేశంలో ఒక మతానికి సంబంధించిన గ్రంథాన్ని విద్యార్థులపై రుద్దమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి కేంద్ర పాలకులు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. డార్విన్ జీవ పరిణామక్రమ సిద్ధాంతాన్ని ఎస్‌సీఈఆర్‌టీ తీసేస్తే తమ రాష్ట్రంలో పాఠ్యపుస్తకాల్లో బోధిస్తామంటూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పిందని, మోడీకి ఆ రోజే సీఎం పినరయి విజయన్ లేఖ రాశారని గుర్తుచేశారు. ఇదే రకంగా కేంద్రప్రభుత్వ నిర్ణయంపై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యంగా పోరాడాలని సూచించారు. మత రాజ్యం కోసం బీజేపీ పాకులాడుతోందని, మత రాజ్యమైన పాకిస్తాన్ బాగుపడిందా? అని ప్రశ్నించారు. 18వ శతాబ్ద ప్రారంభంలో దేశదేశాలు తిరుగుతూ జీవ పరిణామ సిద్ధాంతాన్ని రూపొందించారని తెలిపారు. స్వార్థం, డబ్బు కోసం పనిచేసేవారు శాస్త్రవేత్తలు కారని, సమాజం పట్ల బాధ్యత గలవారు, త్యాగనిరతి, మనుషుల పట్ల ప్రేమ ఉన్నవారే నిజమైన శాస్త్రవేత్తలని చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో మొఘల్ పాలకుల చరిత్ర తొలగింపు, గాంధీని హత్య చేసిన వ్యక్తిని గొప్పగా చిత్రీకరించడంతోపాటు 'విజ్ఞాన్ ప్రసార్‌'ను బీజేపీ మూసేసిందని తెలిపారు. దేశంలో వైజ్ఞాన స్పృహను పెంచడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏహెచ్ విజ్ఞాన ప్రసార్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అది నడుస్తున్నదని, ఇది విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యా యులకు విజ్ఞానాన్ని పెంచడానికి 300లకుపైగా మ్యాగజైన్లను అన్ని భాషల్లో ప్రచురించిందని తెలిపారు. షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించి అవగాహన కల్పించే ఇండియా సైన్స్ టీవీ ఓటీటీని సైతం పక్కనపెట్టారని తెలిపారు. సైంటిఫిక్ టెంపర్‌ను పెంచిన ఘనత దేశ మొదటి ప్రధాని నెహ్రూకే దక్కుతుందని వివరించారు. 95శాతం పరిశోధన కేంద్రాలను ఆయనే ప్రారంభించారని తెలిపారు. మోడీ ప్రభుత్వం మాత్రం పరిశోధన సంస్థలకు నిధులు కేటాయించకుండా దివాళతీయిస్తున్నదని, పైగా కార్పొరేట్ సంస్థలతో నిధులు తీసుకుని పరిశోధనలు చేయాలని సూచించడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీహరి కోట నుంచి ఎన్నో రాకెట్‌లు పోతున్నాయని, శాటిలైట్ వల్లనే ఇంటర్నెట్‌నెట్, గూగుల్ మ్యాప్ చూడగల్గుతున్నామని దేవరాజు ఈ సందర్భంగా వివరించారు.

ప్రపంచ గమనం

ప్రతి దాడి విఫలమైతే... ఉక్రెయిన్ పాశ్చాత్య దేశాల మద్దతును కోల్పోతుంది..!

న్యూయార్క్ : ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాలు ఎంతగా ఆయుధ సరఫరా చేసినప్పటికీ, ఆ దేశ సైన్యానికి ఎంతగా శిక్షణ ఇచ్చినప్పటికీ, ఇంటెల్లిజెన్స్ మద్దతు ఎంతగా ఇచ్చినప్పటికీ రష్యాపైన విజయం సాధిస్తుందన్న గ్యారంటీ లేదని న్యూయార్క్ టైమ్స్ అభిప్రాయపడింది. ఉక్రెయిన్ చేయనున్న ప్రతిదాడి(కౌంటర్ అఫెన్సివ్) ఏమాత్రం విఫలమైనా మద్దతు ఇస్తున్న దేశాలు శాంతి కోసం రష్యాతో చర్చించమని ఉక్రెయిన్‌పై వత్తిడి తెచ్చే అవకాశం ఉందని పేర్కొంది. రష్యాపై తాను చేయనున్న ప్రతిదాడి నిర్ణయాత్మకంగా ఉంటుందని ఉక్రెయిన్ తరచూ పేర్కొంటున్నది. ఈ ప్రతి దాడి జూన్–జులైదాకా మొదలవదని ఉక్రెయిన్ ప్రధాని డెనిస్ స్మిగల్ పేర్కొన్నప్పటికీ ఇది మే నెలలోనే ప్రారంభం కావచ్చని న్యూయార్క్ టైమ్స్ భావిస్తోంది. ఈ మధ్య కాలంలో పెంటగాన్ పేపర్ల పేరుతో లీకైన డాక్యుమెంట్ల ప్రకారం ఉక్రెయిన్ 12 బ్రిగేడ్ల సైన్యాన్ని ఉపయోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బ్రిగేడ్లలో ఒక్కో దానిలో 4000సైన్యం ఉంటుంది. వీటిలో 9బ్రిగేడ్లకు అమెరికా, దాని మిత్రదేశాలు పాశ్చాత్య ఆయుధాలను ఉపయోగించటంలో జర్మనీలోని అమెరికా సైనిక స్థావరాలలో శిక్షణను ఇస్తున్నాయి. రష్యాపై ఉక్రెయిన్ చేయనున్న ఈ ప్రతి దాడికి మద్దతుగా అమెరికా ఇంటెలిజెన్స్ తోడ్పడనున్నది.

న్యూయార్క్ టైమ్స్ వెల్లడి



ప్రతిదీ ఈ ప్రతిదాడిపై ఆధారపడివుందనీ, బహుశా ఇది అతి విశ్వాసం కూడా అయివుండొచ్చని, అయితే ఇది ఉక్రెయిన్ భవితను నిర్ణయించే సన్నివేశమవుతుందని రష్యాలో అమెరికా రాయబారిగా పనిచేసిన అలెగ్జాండర్ వర్షబౌ అన్నాడు. రష్యా ఆధీనంలోవున్న అన్ని ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకునే దాకా రష్యాతో చర్చలు జరపనని ఉక్రెయిన్ భీష్మించుకుని ఉంది. కానీ పాశ్చాత్య దేశాలు ఎంతగా మద్దతునిచ్చినా రష్యా ఆక్రమణలోని భూ భాగాలను ఉక్రెయిన్ తిరిగిపొందే అవకాశం లేదని న్యూయార్క్ టైమ్స్ హెచ్చరించింది.

ఈ యుద్ధంలో ఉక్రెయిన్ ఇప్పటికే చాలా నష్టపోయిందనీ, మందుగుండు మీద చాలా వెచ్చించిందనీ, పాశ్చాత్య దేశాల శిక్షణతో ప్రతిదాడి చేయనున్న ఉక్రెయిన్ సైన్యాన్ని ఎదుర్కోవటానికి రష్యా పటిష్టమైన రక్షణ వలయాన్ని ఏర్పరచుకుందని కూడా న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఉక్రెయిన్ చేయనున్న ఈ ప్రతిదాడి ముగిస్తే సమీప భవిష్యత్తులో పాశ్చాత్య దేశాలు చేయగలిగేది ఏమీ ఉండదనీ, అమెరికా, దాని మిత్రదేశాల ఆయుధ నిల్వలు అప్పటికల్లా అడుగంటుతాయనీ, అలా ఏర్పడిన లోటును పూడ్చటానికి మరో సంవత్సరం పడుతుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ లోపు ఉక్రెయిన్‌కు ఎటువంటి అవకాశం ఇవ్వకూడదని రష్యా ఉక్రెయిన్ పైన భీకరమైన దాడులు చేస్తూనే ఉందని, రష్యాకున్న సైనిక సంపత్తి ముందు ఉక్రెయిన్ నిలువలేదనీ, అంతిమంగా విజయం రష్యానే వరిస్తుందని కూడా న్యూయార్క్ టైమ్స్ రాసింది.

మిడ్‌డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నుంచి చక్రపాణి తొలగింపు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉంటూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు, ఆర్థిక అరాచకత్వానికి పాల్పడుతున్న టి.చక్రపాణిని యూనియన్ నుంచి బహిష్కరించారు. గురువారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ. రమ ఒక ప్రకటన విడుదల చేశారు.

కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులకు

మూలవేతనమివ్వాలి

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



రాష్ట్ర సదస్సులో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

జూన్ 8న హైదరాబాద్‌లో మహాధర్నా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), 30 అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్ల (యూఆర్ఎస్)లో పనిచేస్తున్న 12,500 ఉద్యోగులకు మూలవేతనం ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇదే డిమాండ్లపై హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర సదస్సును నిర్వహించారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాట కార్యక్రమాలు నిర్వహించాలని ఆ సదస్సు నిర్ణయించింది. జూన్ ఎనిమిదో తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టనున్నట్టు పిలుపునిచ్చింది. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్ నుంచి వర్కర్ వరకు అందరూ మహిళా ఉద్యోగులే కష్టపడి పని చేసి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. అయినా ప్రభుత్వం నుంచి వారికి తగిన గుర్తింపు లభించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగు లందరూ సంఘటితంగా నిర్వహించిన పోరాటాల ఫలితంగా కొన్ని సమస్యలు పరిష్కారం అయినప్పటికీ ఇంకా పరిష్కారం కావాల్సినవి చాలా ఉన్నాయని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే పోరాటానికి ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య మాట్లాడుతూ పీఆర్సీ సిఫారసు చేసిన విధంగా కేజీబీవీ, యూఆర్ఎస్ కాంట్రాక్టు ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, సెలవు లివ్వాలని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీ ఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణను ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు వి శాంతికుమారి, జి నాగమణి, వై జ్ఞాన మంజరి, లక్ష్మి, విశాల, లక్ష్మారెడ్డి, పి మాణిక్ రెడ్డి, సోమశేఖర్, సింహాచలం, వెంకట్ పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ

- » రాష్ట్ర సబ్ కమిటీ ఆధ్వర్యంలో విద్యా మంత్రి, ఆర్థిక మంత్రి, విద్యాశాఖ అధికారులకు వచ్చేనెల 8,9 తేదీల్లో వినతిపత్రాల సమర్పణ.
- » వచ్చేనెల 1 నుండి జూన్ 30 వరకు కేజీబీవీ జిల్లా కన్వీనింగ్ కమిటీల ఏర్పాటు.
- » వచ్చేనెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు
- » జూన్ 1,2 తేదీల్లో జిల్లా కన్వీనింగ్ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతి పత్రాల సమర్పణ.
- » జూన్ 8న హైదరాబాద్‌లో మహాధర్నా

డిమాండ్లు

- » సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులందరికీ వారు పనిచేస్తున్న పోస్ట్ ప్రకారం మూల వేతనం (బేసిక్ పే) చెల్లించాలి.
- » ఎస్ఓను ప్రిన్సిపాల్‌గా, పీజీసీఆర్టీలను జేఎల్స్‌గా, సీఆర్టీలను స్కూల్ అసిస్టెంట్లుగా, పీఈటీలను పీడీలుగా గుర్తించి ఆ పోస్ట్ బేసిక్ పేను ఇవ్వాలి.
- » హాస్టల్ నిర్వహణ కోసం కేర్ టేకర్ ను నియమించాలి. సీఆర్టీలకు నైట్ డ్యూటీల నుంచి మినహాయింపునివ్వాలి.
- » పీఆర్సీ సిఫారసు చేసిన విధంగా కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులకు ఏటా రూ.1000 ఇంక్రిమెంట్ ఇవ్వాలి.
- » కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీకి అనుగుణంగా కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులను కూడా (అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించి) రెగ్యులరైజ్ చేయాలి.
- » కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలి.
- » అర్ధాంతరంగా మరణించిన కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి.
- » యూఆర్ఎస్‌లకు స్వంత భవనాలు నిర్మించాలి.
- » కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించాలి.

సుచిరిండియాకు టీఎస్ఆర్టీసీ షాక్

- ఆర్టీసీ కళాభవన్ లీజ్ రద్దు.. సీజ్

నవతెలంగాణ-ముషీరాబాద్, సిటీబ్యూరో

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సుచిరిండియాకు తెలంగాణ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) గురువారం సీజ్ చేసింది. సుచిరిండియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్‌తో గతంలో చేసుకున్న అద్దె కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసింది. సుచిరిండియా సంస్థ 2016లో టీఎస్ఆర్టీసీకి చెందిన ఆర్టీసీ కళాభవన్‌ను అద్దెకు తీసుకుంది. ఆ భవన్‌లో కల్యాణమండపం, కళాభవన్, మరో మూడు మినీ హాళ్ల లీజ్‌కు తీసుకుంటూ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం ప్రకారం నెలకు రూ.25.16 లక్షలను టీఎస్ఆర్టీసీకి సుచిరిండియా చెల్లించాలి. అయితే, కొంతకాలంగా సుచిరిండియా సంస్థ అద్దె సకాలంలో చెల్లించకపోవడంతో 6.55 కోట్ల రూపాయల బకాయి పేరుకుపోయింది. అద్దె బకాయి చెల్లించాలని టీఎస్ఆర్టీసీ అధికారులు పలుమార్లు సుచిరిండియాకు నోటీసులు జారీ చేశారు. ఆ సంస్థ నుంచిగానీ, యాజమాన్యం నుంచిగానీ తగిన స్పందన రాలేదని టీఎస్ఆర్టీసి స్పష్టం చేసింది. ఒప్పందం ప్రకారం నెల నెలా అద్దె చెల్లించకుంటే నోటీసులు జారీ చేసి, ఆర్టీసీ కళాభవన్‌ను టీఎస్ఆర్టీసీ అధికారులు స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఉంది. నోటీసులకు సుచిరిండియా సంస్థ స్పందించకపోవడంతో.. కళాభవన్‌ను అధికారులు తాజాగా సీజ్ చేశారు. సుచిరిండియా కాంట్రాక్ట్‌ను రద్దు చేశారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంఘాల నాయకుల నిరసన
- దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ-ముషీరాబాద్/విలేకరులు



మహిళారెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ.. అంతర్జాతీయంగా పతకాలు సాధించి గౌరవాన్ని ప్రతిష్టను తెచ్చిపెడుతున్న అగ్రశ్రేణి క్రీడాకారులు దేశం నడిబొడ్డున ఆందోళన చేపట్టడం బాధాకరమన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం కేసు కూడా నమోదు చేయలేదన్నారు. రెజ్లర్ల ఆరోపణలపై విచారణ జరిపిన పర్యవేక్షణ కమిటీ ఫలితాలను బహిర్గతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్‌తోపాటు ఆ విభాగంలో పనిచేస్తున్న మరికొందరు కోచ్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. జె.వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒక వైపు భేటీ బచావో భేటి పడావో అంటూ సంబురాలు చేసుకుంటూనే మరోవైపు ఈ దారుణమైన నేరంలో నిందితుడైన బీజేపీ ఎంపీని రక్షించేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితునిపై ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అథ్లెట్లు వారి కలలను సాకారం చేసుకోవడానికి ఇలాంటి ఘటనలు అవరోధం కాకూడదంటే నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి.నర్సింహారావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీకాంత్, కార్యదర్శి ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, పద్మ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు జయ కుమారస్వామి, కోశాధికారి ఆర్ వాణి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, సహాయ కార్యదర్శి మహమ్మద్ జావేద్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఏఐఏడబ్ల్యు, ఏఐకేఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ బ్రిజ్ బూషన్ శరణ్‌సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు పెద్ది వెంకట్‌రాములు, నూర్జహాన్, పెద్దిసూరి, పల్లపు వెంకటేష్ మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ముందు ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు.

రాష్ట్ర పౌరుల కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సూడాన్ దేశంలో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తరలిస్తున్న "ఆపరేషన్ కావేరి"లో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రయాణికులను తెలంగాణకు తరలించేందుకు వీలుగా ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు.

పెంచిన వేతనాలను బకాయిలతో సహా చెల్లించాలి

- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెంచిన వేతనాల జీవో ప్రకారం వెంటనే బకాయిలతో సహా చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్యను గురువారం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్, రాష్ట్ర కార్యదర్శి వై ఓమయ్య, ఉపాధ్యక్షురాలు పి ప్రేంపావని, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు టి చక్రపాణి, నాగలక్ష్మి, పెద్దమ్మ, బాల్‌రాజ్, సుమలత, లక్ష్మి, గంగమ్మ, సాయమ్మ కలిసి వినతిపత్రం సమర్పించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెల పదో తేదీలోగా బిల్లులు చెల్లించాలని కోరారు. రోజుకు రూ.32తో పనిచేస్తూ వారు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, పనిభద్రత కల్పించాలని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థులకు చెల్లిస్తున్న మెస్ చార్జీలను పెంచాలని కోరారు.

నందమూరి సుహాసినికి కాసాని వీరేష్ అభినందనలు



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమితులైన నందమూరి సుహాసినికి ఆపార్టీ నేతలు పలువురు అభినందనలు తెలియజేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కాసాని వీరేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించారు. పార్టీకి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. తాజాగా తెలంగాణలో చేపట్టిన పార్టీ కార్యక్రమాలు, త్వరలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జరగనున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల ప్రత్యేక సభల గురించి సుహాసినికి వీరేష్ వివరించారు. ఈ సందర్భంగా సుహాసిని స్పందిస్తూ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ను త్వరలోనే స్వయంగా కలుస్తాననీ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని చెప్పారు.

రివాల్వర్‌తో కాల్చుకొని సీఆర్‌పీఎఫ్ జవాన్ ఆత్మహత్య

నవతెలంగాణ-బేగంపేట

సీఆర్‌పీఎఫ్ జవాన్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని బేగంపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకోటి గార్డెన్ ప్రాంతంలో నివసిస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దేవేంద్ర కుమార్(25) సీఆర్‌పీఎఫ్ ఐజీ మహేష్ లడ్డా నివాసం వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం అతను తన నివాసం వద్ద రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. గమనించిన తోటి సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే దేవేంద్రకుమార్ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దేవేంద్ర జేబులో ఉత్తరం ఉన్నట్టు గుర్తించారు. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానిస్తున్నారు. దేవేంద్ర కుమార్ 2021 బ్యాచ్‌కు చెందినట్టు ఉద్యోగిగా తోటి ఉద్యోగులు వెల్లడించారు.

సంపాదకీయం

ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి చైనా చొరవ!

రష్యా సైనిక చర్యతో సంక్షోభం ప్రారంభమైన 427రోజుల తరువాత తొలి సారిగా చైనా అధినేత షీ జిన్‌పింగ్ బుధవారంనాడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్ ద్వారా సంభాషించి సంక్షోభ పరిష్కారానికి చొరవ చూపటం హర్షణీయం. ఇది ముందుకుపోతే ఐరోపాకు తక్షణం, ప్రపంచమంతటికీ ఎంతో ఉపశమనం కలుగుతుంది.

> రష్యా భద్రతకు హామీనిస్తూ దాని ముంగిటకు నాటోను విస్తరించకూడదని అమెరికా తలచుకొన్న మరుక్షణమే సంక్షోభానికి తెరపడుతుంది. కానీ దానికి ఏమాత్రం తావివ్వకుండా జెలెన్‌స్కీని తమ వ్యూహంలో ఒక బంధీగా మార్చిన నాటో కూటమి పరిష్కారానికి దోహదం చేస్తుందా అన్నది పెద్ద ప్రశ్న. రష్యా గనుక పోరు నిలిపివేస్తే వెంటనే యుద్ధం ముగుస్తుంది, కానీ ఇప్పటికిప్పుడు ఉక్రెయిన్ పోరును ముగిస్తే ఆ దేశమే అంతం అవుతుందని అమెరికా భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ చైనా శాంతి చొరవ మీద చేసిన వ్యాఖ్య ఉక్రెయిన్‌ను మరింత రెచ్చగొట్టటం, మరింత ఆజ్యం కుమ్మరించటం గాక మరేమిటి?

రాజకీయ పరిష్కారానికి వచ్చేందుకు ఇది పుతిన్-జెలెన్‌స్కీలకు ఒక మంచి అవకాశం. లోపల ఎవరి భయాలు, ఎవరి పట్టుదలలు వారికి ఉన్నప్పటికీ రెండు దేశాల తొలి స్పందన సానుకూలంగానే ఉంది. ఇరు పక్షాల మీద రోజు రోజుకూ ఒత్తిడి పెరుగుతోంది, దీని అర్థం వెంటనే ఏదో జరిగిపోతుందని కాదు. "ఉక్రెయిన్ సంక్షోభాన్ని సృష్టించటంలో గానీ లేదా దానిలో ఒక పక్షంగా చైనా లేదు. ఐరాస భద్రతా మండలి శాశ్వత సభ్యదేశం, ఒక బాధ్యత కలిగిన శక్తిగా ఊరికే చూస్తూ ఉండలేము, రాజుకున్న అగ్నికి ఆజ్యం పోయం, అన్నింటికీ మించి దీని వలన తమకు ఎలాంటి లబ్ది కలగదని" జిన్‌పింగ్ స్పష్టం చేశారు. తొలి నుంచీ చైనా తటస్థంగా ఉన్న సంగతి తెలిసిందే. తెరవెనుక ఉంచి అసలు ఈ చిచ్చు రేపిన అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఆంక్షలను తోసి పుచ్చి రష్యా నుంచి చమురు, ఇతర వస్తువుల దిగుమతి, ఎగుమతులు వేరు. ఆ మాటకు వస్తే మన దేశం కూడా తటస్థంగా ఉండి అదే చేస్తున్నది. ప్రపంచ రాజకీయాల్లో అమెరికా పెత్తందారీతనం, కుట్రలను ఎదుర్కొనే క్రమంలో పరస్పరం సహకరించుకోవాలన్న చైనా-రష్యా బంధం పటిష్టం చేసుకోవాలని కూడా నిర్ణయించినప్పటికీ ఉక్రెయిన్ అంశంలో చైనా తటస్థంగానే ఉంది.



భద్రతా మండలిలోని శాశ్వత దేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ ఈ సంక్షోభంలో ఉక్రెయిన్ కొమ్ముకాచి అన్ని రకాల సాయం అందిస్తూ ప్రపంచాన్ని మొత్తంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. జెలెన్‌స్కీ సేనలకు అస్త్ర శస్త్రాలను అందిస్తూ ఈ వివాదాన్ని మరింతగా పెంచి కొనసాగించేందుకు, తద్వారా తమ భౌగోళిక రాజకీయ లక్ష్యాలను సాధించుకొనేందుకు ఉక్రెయిన్‌ను బలి చేస్తూ పౌరులను నానా అగచాట్లకు గురిచేస్తున్నాయి. ఈ పూర్వరంగంలో షీ చొరవ ఏ మేరకు ఫలిస్తుందన్నది ప్రశ్నార్థకమే కావచ్చుగానీ ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయరాదు.

బీజింగ్‌లో రెండు సంవత్సరాలుగా లేని ఉక్రెయిన్ రాయబారిని ఫోన్ సంభాషణ జరిగిన వెంటనే జెలెన్‌స్కీ నియమించటం ఒక ముందడుగు, సానుకూల అంశం. జెలెన్‌స్కీతో సహా పశ్చిమ దేశాల నేతల మీద ఒత్తిడి పెంచుతుంది.

చైనాను రెచ్చగొడుతూ, దాని మీద తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రచారదాడిలో భాగంగా రష్యాకు ఆయుధాలను అందించేందుకు పూనుకున్నట్లు కథనాలను వండివారుస్తున్న సంగతి తెలిసిందే. తామే తుమ్మి తామే తథాస్తు అనుకున్నట్లుగా వాటికి తెరదించేందుకు ఇప్పుడు షీ జిన్‌పింగ్ మాట్లాడినట్లు, నేరుగా ఆయుధాలు అందివ్వకపోవచ్చు అని శకుని పాచిక విసిరారు. అంటే వేరే దారిలో ఇవ్వనుందని చెప్పటమే. కొద్ది వారాల క్రితం మాస్కో పర్యటనలోనే తమ ప్రతిపాదనలను జెలెన్‌స్కీకి కూడా అందిస్తామని షీ ప్రకటించిన అంశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ఉప్పు నిప్పుగా ఉన్న ఇరాన్-సౌదీ అరేబియాల మధ్య చైనా కుదిర్చిన సయోధ్య నెలరోజుల్లోనే సానుకూలంగా ముందుకు పోవటం వంటి పరిణామాలను చూసిన తరువాత ప్రపంచంలో చైనా పలుకుబడి కంటే దాని మీద విశ్వసనీయత పెరిగిందని చెప్పవచ్చు. తమ భౌగోళిక సమగ్రత అంటే 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియాతో సహా 1991నాటి పరిస్థితి పునరుద్ధరణ జరగాలని ఉక్రెయిన్ చెబుతున్నది. సంక్షోభ ప్రారంభంలోనే రెండు దేశాల మధ్య శాంతి, సయోధ్య కుదిర్చేందుకు నాటోలో భాగమైన తుర్కియె ప్రయత్నించిన సంగతి, నాలుగుదఫాల చర్చల తరువాత నిలిచిన అంశం తెలిసిందే. ఆ క్రమాన్ని ముందుకు పోకుండా చేసింది కూడా అదే నాటో దేశాలన్న సంగతీ ఎరిగిందే. తమ సార్వభౌమత్వాన్ని ఉక్రెయిన్ గుర్తించి, నాటోలో చేరకుండా ఉండేందుకు అంగీకరిస్తే, తమ భద్రతకు హామీ ఇస్తే మిగతా అంశాలపై చర్చలకు సిద్ధమే అని గతంలో పుతిన్ సర్కార్ ప్రకటించింది. ఉభయ పక్షాలు రాజకీయ ఒప్పందానికి అంగీకరిస్తే తక్షణం ఐరోపాలో శాంతి ఏర్పడుతుంది. పరాయి దేశాల్లో కాందిశీకులుగా, స్వదేశంలో నెలవులు తప్పిన మిలియన్ల మంది ఉక్రేనియన్ల ఇబ్బందులూ తొలుగుతాయి.

రష్యా భద్రతకు హామీనిస్తూ దాని ముంగిటకు నాటోను విస్తరించకూడదని అమెరికా తలచుకొన్న మరుక్షణమే సంక్షోభానికి తెరపడుతుంది. కానీ దానికి ఏమాత్రం తావివ్వకుండా జెలెన్‌స్కీని తమ వ్యూహంలో ఒక బంధీగా మార్చిన నాటో కూటమి పరిష్కారానికి దోహదం చేస్తుందా అన్నది పెద్ద ప్రశ్న. రష్యా గనుక పోరు నిలిపివేస్తే వెంటనే యుద్ధం ముగుస్తుంది, కానీ ఇప్పటికిప్పుడు ఉక్రెయిన్ పోరును ముగిస్తే ఆ దేశమే అంతం అవుతుందని అమెరికా భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ చైనా శాంతి చొరవ మీద చేసిన వ్యాఖ్య ఉక్రెయిన్‌ను మరింత రెచ్చగొట్టటం, మరింత ఆజ్యం కుమ్మరించటం గాక మరేమిటి?

"జైహింద్" ఆలోచన మన హైదరాబాదు వాడిదే!

> సైన్యంలో మేజర్‌గాను, విదేశాలలో భారత రాయబారిగానూ పనిచేయడమే గాక, ఆబిద్ హసన్‌కు ఉరుదూ, పర్షియన్ కవిత్వమంటే చాలా చాలా ఇష్టంగా ఉండేది. విశ్వకవి 'జనగణమన అధినాయక జయహే' గీతాన్ని ఆయన హిందుస్థానీలోకి అనువదించాడు. హిందీ-ఉర్దూలు కలిసి ఏర్పడిందే హిందూస్థానీ భాష. "శుభ్ సుఖ్ చైన్ కి బార్ ఖా బర్ సే"గా అది చాలా ప్రాచుర్యం పొందింది. దానికి కెప్టెన్ రామ్‌సింగ్ ఠాకూరి సంగీతం సమకూర్చాడు. అయితే అది మిలట్రీ మార్చింగ్ సాంగ్‌లా ఉంటుంది. దీనికి కూడా మళ్ళీ ఒక ప్రాధాన్యత ఉంది. 15 ఆగస్టు 1947న దేశానికి స్వాతంత్ర్యం లభించిన మరునాడే నాటి తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎర్రకోట మీద మన మువ్వన్నెల జెండాను ఎగరేసి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ సందర్భంలో ఆ కార్యక్రమానికి కెప్టెన్ ఠాకూరిని ఆయన మ్యూజిక్ బ్యాండ్‌ని నెహ్రూ ఆహ్వానించారు. స్వతంత్ర భారత దేశంలో తొలిసారి ఎర్రకోట దగ్గర ఆబిద్ హసన్ గీతం, కెప్టెర్ ఠాకూరి సంగీత సారథ్యంలో ప్రపంచానికి వినిపించడం జరిగింది.

'జైహింద్' అనే నినాదాన్ని ఆరెస్సెస్, జనసంఘ్, బీజేపీ వారెవరూ సృష్టించలేదు. దేశభక్తి, దేశభక్తి - అని గొంతులు ఎండిపోయే విధంగా అరచి గీపెడుతున్న వారికి ఎవరికీ ఆ ఆలోచనే రాలేదు. దేశం గర్వించదగ్గ ఏ చిన్న పనీ వారు చేసింది లేదు. అయితే, మరి ఆ పని ఎవరు చేశారూ? జైహింద్ - అనే మాటను ఎవరు వాడుకలోకి తెచ్చారూ?.. అవి, స్వాతంత్ర్య పోరాటం సాగుతున్న రోజులు! సుభాష్ చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీని రూపొందించుకున్న రోజులు. ఆ ఆర్మీలో దేశంలోని భిన్న ప్రాంతాల వారు ఉండేవారు. పరిచయస్తులు, మిత్రులు ఎవరైనా కలిస్తే వారు వేరు వేరు రకాలుగా అభివాదం చేసుకునేవారు. కొందరు 'నమస్కార్' అని, మరికొందరు 'రామ్‌రామ్' అని, ఇంకొందరు 'అస్సలాము అలైకుం' అని సంభోదించుకునేవారు. సుభాష్‌చంద్రబోస్ సెక్యులర్ భావాలు కలిగిన వాడు గనక, తన ఆజాద్ హింద్ ఫౌజ్ (ఆర్మీ)లో ఇన్ని రకాల పలకరింపు (విష్)లు ఉండటం ఆయన ఇష్టపడలేదు. దేశభక్తి ఉట్టిపడేలా, దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా అందరూ ఒకేరకంగా పలకరించుకోవాలని ఆయన కోరుకున్నారు. అందుకు ఒక మాటను, లేదా నినాదాన్ని రూపొందించమని మిత్రులకు, తన ఆర్మీలో ఉన్న ముఖ్యులకు సూచించారు.



డాక్టర్ దేవరాజు మహారాజు

అలా ఎందరో ఎన్నెన్నో రకాలైన మాటలు సూచించారు. తన నేషనల్ ఆర్మీలో మేజర్‌గా పనిచేసే ఒక వ్యక్తి ఒకరోజు వచ్చి - ఒకరికొకరు ఎదురుపడ్డప్పుడు 'హలో' అని పలకరించుకోవాలని సూచించాడు. సుభాష్‌చంద్రబోస్‌కు అది నచ్చలేదు. ఎందుకంటే అది మన దేశానికి సంబంధించిన పలకరింపు కాదు. ఆ మాట ఇతర దేశాలలో కూడా ఉంది. ఒకరికొకరు అభివాదం చేసుకోవడానికి ఎలాంటి మాట కావాలో బోస్ అతనికి మరొకసారి వివరించాడు. అంతే... ఆ మేజర్ మరో రెండు మాటలు చెప్పాడు. ఒకటి 'జై హిందుస్థాన్' అని, మరొకటి 'జైహింద్' అని వినగానే జైహింద్-అన్నది బోస్‌కు బాగా నచ్చింది. చిన్న మాటయినా అది బలంగా ఉందనిపించింది. జైహింద్ - అంటే భారతదేశానికి జయము కలుగుగాక అని అర్థం. అప్పటి స్వాతంత్ర్యోదమ కాలానికి అది బాగా సరిపోతుందని అనుకున్నారు బోస్. అదే జైహింద్ అనే మాటను తన నేషనల్ ఆర్మీలో ప్రవేశపెట్టారు. ఆ మాటలో స్వాతంత్ర్యం సంపాదిస్తామన్న ఆత్మవిశ్వాసం ఉంది. దేశభక్తి ఉంది. పలకడానికి సుళువుగా ఉంటూనే, మనోబలాన్ని పెంచే బలం కూడా ఆ మాటలో ఉంది. సుభాష్‌చంద్రబోస్ అన్నీ బాగా ఆలోచించి తన ఉపన్యాసాలలో కూడా ఆ మాట తరచూ ఉపయోగించేవారు. ఆ విధంగా 'జైహింద్' అనతి కాలంలో ఒక జాతీయ నినాదం అయ్యింది.

ఇంతకూ 'జైహింద్'కు రూపకల్పన చేసిన ఆ నేషనల్ ఆర్మీ మేజర్ ఎవరూ? అంటే - ఆయన మన తెలంగాణ - హైదరాబాదువాడే. పేరు ఆబిద్ హసన్ సఫ్రానీ. చిన్నప్పటి పేరు జైనుల్ ఆబిదీన్ హసన్. చిన్నప్పుడే ఆనాటి శాసనోల్లంఘన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. దానితో చదువు ఆగిపోయింది. కొంతకాలం తర్వాత ఇంజనీరింగ్ చదువుదామని జర్మనీ వెళ్ళాడు. అక్కడే నేతాజీని కలుసుకున్నాడు. అప్పుడు బోస్ జర్మనీలోనే ఉన్నారు. అప్పుడే ఆబిద్ జీవితం మలుపు తిరిగింది. చివరిదశలో ఉన్న ఇంజనీరింగ్ కోర్సు వదిలేసి, బోస్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా చేరాడు. అప్పటికే జర్మన్ భాషపై కొంత పట్టు సాధించడం వల్ల, జర్మన్ భాష అనువాదకుడిగా కూడా నేతాజీకి సహాయపడ్డాడు. ఇండియాకు తిరిగి వచ్చాక ఇక్కడ ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హింద్ ఫౌజ్)లో 1942-45 మధ్య ఆబిద్ హసన్ మేజర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత ఐ.ఎఫ్.ఎస్. (ఇండియన్ ఫారెన్ సర్వీసు) సాధించాడు. 1948-1969 మధ్య కాలంలో డెన్మార్క్‌కు, ఆ తర్వాత ఈజిప్టుకు భారత రాయబారిగా సేవలు అందించాడు. 5 ఏప్రిల్ 1984న హైదరాబాద్‌లోనే తన డెబ్బయి రెండవ యేట కన్నుమూశాడు. జీవితాన్ని దేశభక్తికి అర్పించిన మహోన్నతుడిగా నిలిచిపోయాడు.

'జైహింద్' నినాదానికి రూపకల్పన చేయడమే కాదు, ఆయన గొప్పతనాన్ని శ్లాఘించడానికి మరో విశేషం కూడా ఉంది. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో ఉన్నప్పుడే ఆబిద్ హసన్ తన పేరుకు "సఫ్రానీ" అని తగిలించుకున్నాడు. సాఫ్రాన్ అంటే కాషాయరంగు. దాన్ని హిందువులు పవిత్రమైందిగా భావిస్తారు గనక, దాన్ని ఆయన స్వీకరించి తన పేరుకు చివర 'సఫ్రానీ' అని చేరుకున్నాడు. మత సామరస్యానికి గుర్తుగా, హిందువుల పట్ల తన సోదరభావాన్ని ప్రకటించుకోవడానికి ఒక ముస్లిం యువకుడు ఆ నిర్ణయం తీసుకున్నాడు. మధ్యలో కొంతకాలం కాంగ్రెస్ సభ్యుడిగా ఉన్నా అందులో ఎక్కువ కాలం ఉండలేదు. దేశ విభజన జరిగి పాకిస్థాన్ విడిపోయిన తర్వాత ఐఎఫ్ఎస్ పూర్తిచేయడానికి తన పూర్తి సమయం కేటాయించాడు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు కార్యదర్శిగా ఉన్న రోజుల్లో ఆబిద్ ఆయన వెన్నెంటే ఉండేవారు. ఆయన నౌకలో ఏ దేశం వెళ్ళినా, వెంట వెళుతూ ఆయనను దగ్గరుండి జాగ్రత్తగా చూసుకునేవాడు. తర్వాత కాలంలో నేతాజీకి ఆబిద్ హసన్‌కు చుట్టరికం కూడా కలిసింది. నేతాజీ మేనల్లుడు అరబిందో బోస్ - ఆబిద్ హసన్ అన్న కూతురు సురయా హసన్‌ను పెండ్లి చేసుకున్నాడు. ఆబిద్ హసన్ అన్న బద్రల్ హసన్ గాంధీజీతో కలిసి పనిచేసినవాడు. ఇక్కడ సురయా హసన్ గురించి కూడా కొన్ని విషయాలు చెప్పుకోవాలి.

1928లో పుట్టిన సురయా ఆ రోజుల్లో కేంబ్రిడ్జి యూనివర్సిటీకి వెళ్ళి అక్కడ టెక్స్‌టైల్ డిజైనింగ్‌లో పట్టా తీసుకుని వచ్చింది. హైదరాబాద్‌లోనే స్థిరపడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తన వ్యాపారం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించుకుంది. అంతరించి పోతున్న ఒకనాటి చేనేత కళని పునరుద్ధరించింది. బిద్రి, హిమ్రు, ఇక్కల్, కలంకారీ వంటి వాటిని గద్వాల్, ఉప్పాడ వంటి వస్త్రాల్ని ఇక్కడి నుంచే ఖండాంతరాలకు అందించింది. కాంగ్రెస్ కార్యకర్తగా, ఖాదీ ఉద్యమకారిణిగా జీవితాంతం కృషి చేసిన ఆమె, ఇటీవల 2021లో హైదరాబాద్‌లో తుదిశ్వాస వదిలింది.





సైన్యంలో మేజర్‌గాను, విదేశాలలో భారత రాయబారిగానూ పనిచేయడమే గాక, ఆబిద్ హసన్‌కు ఉరుదూ, పర్షియన్ కవిత్వమంటే చాలా చాలా ఇష్టంగా ఉండేది. విశ్వకవి 'జనగణమన అధినాయక జయహే' గీతాన్ని ఆయన హిందుస్థానీలోకి అనువదించాడు. హిందీ-ఉర్దూలు కలిసి ఏర్పడిందే హిందూస్థానీ భాష. "శుభ్ సుఖ్ చైన్ కి బార్ ఖా బర్ సే"గా అది చాలా ప్రాచుర్యం పొందింది. దానికి కెప్టెన్ రామ్‌సింగ్ ఠాకూరి సంగీతం సమకూర్చాడు. అయితే అది మిలట్రీ మార్చింగ్ సాంగ్‌లా ఉంటుంది. దీనికి కూడా మళ్ళీ ఒక ప్రాధాన్యత ఉంది. 15 ఆగస్టు 1947న దేశానికి స్వాతంత్ర్యం లభించిన మరునాడే నాటి తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎర్రకోట మీద మన మువ్వన్నెల జెండాను ఎగరేసి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ సందర్భంలో ఆ కార్యక్రమానికి కెప్టెన్ ఠాకూరిని ఆయన మ్యూజిక్ బ్యాండ్‌ని నెహ్రూ ఆహ్వానించారు. స్వతంత్ర భారత దేశంలో తొలిసారి ఎర్రకోట దగ్గర ఆబిద్ హసన్ గీతం, కెప్టెర్ ఠాకూరి సంగీత సారథ్యంలో ప్రపంచానికి వినిపించడం జరిగింది.

ఆబిద్ హసన్ సఫ్రానీ 'జనగణమన' గీతాన్ని హిందుస్థానీలోకి ఈ విధంగా అనువదించాడు. భావం, లయ ఏమాత్రం చెడకుండా అద్భుతంగా ఆవిష్కరించాడు...

శుభ్ సుఖ్ చైన్ కి బర్ఖా బర్సే
భారత్ భాగ్ హై జాగా
పంజాబ్ సింధ్ గుజరాత్ మరాఠా
ద్రావిడ్ ఉత్కళ్ వంగా
చంచల్ సాగర్ వింధ్య హిమాలయ్
నీలా యమునా గంగా - తెరేనిత్ గుణ్ గాయే
తుఝ్‌సే జీవన్ సాయె - సబ్ తన్ పాయే ఆశా
సూరజ్ బన్‌కర్ జగ్‌పర్ చమ్‌కే
భారత్ నామ్ సుభాగా
జయహెూ జయహెూ జయహెూ
జయ జయ జయహెూ భారత్ నామ్ సుభాగా

సబ్‌కె దిల్ మే ప్రీత్ బసాయె తెరీ మీఠా వాణీ
హర్ సూబేకా రహనే వాలే హర్ మహజబ్ కె ప్రాణీ
సబ్ భేద్ ఔర్ ఫరక్ మిటాకె
సబ్ గోద్ మె తెరీ ఆకే - గూంథే ప్రేమ్‌కి మాలా
సూరజ్ బన్ కర్ జగ్ పర్ చమ్‌కె భారత్ నామ్ సుభాగా
శుభ్ సవేరే ఫంఖ్ పకేరే - తెరే హి గుణ్ గాయె
బాస్ భరీ భర్‌పూర్ హవాయేం
జీవన్ మె రుత్ లాయే
సబ్ మిల్‌కర్ హింద్ పుకారే
జయ్ ఆజాద్ హింద్‌కి నారే -
ప్యారా దేశ్ హమారా
సూరజ్ బన్‌కర్ జగ్‌పర్ చమ్ కే
భారత్ నామ్ సుభాగా జయహెూ జయహెూ
జయ జయ జయహెూ భారత్ భాగ్ హై జాగా

(శుభం, సుఖం, ప్రశాంతత వర్షాలై కురవనీ, భారతదేశపు భాగ్యం మేలుకుంది. పంజాబ్, సింధ్, గుజరాత్, మరాఠా, ద్రావిడ్, ఉత్కళ్, వంగా - వింధ్య హిమాలయాల ఒడిలో యమునా గంగలు ఉవ్వెత్తున ప్రవహిస్తూ నీ గుణగణాల్ని కీర్తించనీ, ప్రతి ఉదయం అన్ని మతాల, అన్ని ధర్మాల వారు, వారి వారి హృదయాల్లో నీ తీయని మాటలే నిలుపుకోనియ్. భేదాభిప్రాయాలు, తేడాలు అంతమొందించుకున్న వారందరి ఒడిలో ప్రేమతో అల్లిన నీ పూలమాలలే ఉన్నాయి. భారతదేశం సూర్యుడిలా ప్రపంచానికి వెలుగు పంచనీ. ఉషోదయాల రెక్కలు నీ గుణగణాల్ని కీర్తిస్తున్నట్లు, వీస్తున్న గాలులు సమయానికి చక్కని రుతువులు తెస్తున్నట్టుగా ఉన్నాయి. అందరం కలిసి భారతావనికి విజయం కలగాలని జైహింద్ - అని జయ జయ హింద్ అని నినదిద్దాం! - సంక్షిప్త భావం)

గత చరిత్రలోంచి ఎలుగెత్తి సగర్వంగా చెప్పుకోవాల్సిన ఇలాంటి ఘట్టాలు మనం చెప్పుకోం! అనవసరమైన వాటికి ప్రాధాన్యమిస్తుంటాం!! ఇక సమకాలీనంలోనైతే అవివేకపు అంశాలే ఎంతో ప్రాధాన్యమైనవిగా ప్రభుత్వ పెద్దలు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. నిజాయితీగా ఆలోచించగల వారికి మాత్రమే ఈ విషయం బోధపడుతుంది!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



వెలుగు దివ్వెలు... పూలే, అంబేద్కర్‌లు

విశ్వ మానవ సౌభ్రాతృత్వం... స్వేచ్ఛను కోరి చీకట్లు నిండిన పీడిత ప్రజల జీవితాలలో తమ ఆలోచనలతో వెలుగులు నింపిన వెలుగు దివ్వెలు మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్‌లు. స్ఫూర్తివంతమైన వారి ఆలోచనలు ఆనాటి మతం, కులరక్కసి, ఆధిపత్య భావజాలంపై సవాలు చేసి పీడితులకు, తాడితులకు అండగా నిలడ్డాయి. బ్రాహ్మణీయ భావజాలంపై నిరంతరం పోరు సల్పి మత జాడ్యాలను, కుల జాడ్యాలను ఎండగట్టారు. స్వార్థపూరితమైన జీవితానికి తావులేకుండా తమ సహచరులను(సావిత్రి భాయిపూలే-రమాభాయి) సైతం సమ సమాజ స్వప్నం కోసం పరితపించేలా ప్రేరేపించారు.



పాలడుగు నాగార్జున
9492358458

దేశంలో అనేక విజయాలకు, అద్వితీయమైన పోరాట స్ఫూర్తిని అందించినవారు బాబా సాహెబ్ అంబేద్కర్. భారతదేశంలో ఆధిపత్య సమాజంలో అంటరాని వ్యక్తి గా చూడబడిన అంబేద్కర్ స్వతంత్ర భారతదేశంలో మొదటి న్యాయశాఖ మంత్రిగా అతని ప్రయాణం విజయం మాత్రమే కాదు. ఈ దేశం సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని ధృఢ సంకల్పంతో పరిరక్షించడమేనన్న అంబేద్కర్ జాతీయ వాది. అంబేద్కర్ తన జీవితాంతం హిందూ సమాజంలో వేళ్ళూనికుపోయిన అంటరానితనానికి, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాడు. పీడిత ప్రజలపై ఆధిపత్య భావజాలాన్ని నిరంతరం సవాలు చేశారు. సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా లేకుంటే రాజకీయ ప్రజాస్వామ్యానికి భరోసా ఉండదని అన్నారు. అతని తత్వం అణగారిన వర్గాలకు స్ఫూర్తి గాను, రాజకీయ జ్ఞానోదయంగా పనికి వచ్చాయి. అంబేద్కర్ రాజకీయ సమానత్వంతో పాటు సామాజిక, ఆర్థిక జీవితంలో అసమానతల ఫలితంగా ఏర్పడిన వైరుధ్యాలను తొలగించడానికి ప్రయత్నించారు. ఆ విధంగా బహుజనులను చైతన్యం చేస్తూ వారికి దారి దీపం అయ్యారు. అంబేద్కర్ స్ఫూర్తి నేటికి సజీవంగా ఉన్నది అంటే వారి భవిష్యత్ ఆలోచనలు, దార్శనికతకు నిదర్శనం.

19వ శతాబ్దంలో భారత దేశంలో సామాజిక విప్లవానికి నాంది పలికిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే. తన జీవన ప్రయాణం మొత్తం కూడా భూస్వాములకు పెత్తందారులకు వ్యతిరేకంగా కొనసాగించారు. సమాజంలో పేరుకుపోయిన మూఢ అజ్ఞానానికి కారణమైన బ్రాహ్మణాధిక్యతను కూకటి వేళ్లతో పెగిలించాలంటే దళిత బహుజన జీవితాలలో విద్య అనే వెలుగు నింపడమే సరైన మార్గం అని పూలే విశ్వసించారు. విద్య అనే అఖండ జ్యోతులు వెలిగించడానికి ఆజన్మాంతం ఆధిపత్య వర్గాలతో అక్షర యుద్ధం చేసిన మహనీయుడు పూలే. సమాజంలో సగభాగమైన స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని స్త్రీలలో విద్యను అభివృద్ధి చేయడానికి తన సహచరి సావిత్రిబాయి పూలేకు విద్యాబుద్ధులు నేర్పించి స్త్రీల పురోభివృద్ధికి పాటుపడిన వారు పూలే. కుల మత వివక్షతలు లేని సమ సమాజ స్థాపన కోసం పాటుపడిన పూలే పోరాట స్ఫూర్తిని ఎత్తిపట్టాల్సిన బాధ్యత ఈ దేశ తాడిత, పీడిత వర్గాల సామాజిక బాధ్యత.

పరమత సహనం విరాజిల్లిన భరత భూమిపై అసహనం, మత విద్వేషాలు చెలరేగుతున్నాయి. దళితులు, మైనారిటీ, మహిళలు, ఆదివాసీల మీద నిరంతరం దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారు. ఒక వైపు పూలే అంబేద్కర్ ఆలోచనా స్ఫూర్తిని కొనసాగిస్తున్నాం అంటూ వాటికి విరుద్ధంగా అసమ్మతిని ప్రకటించే, ప్రశ్నించే సామాజిక ఉద్యమకారులపై, కవులపై, కళాకారులపై, జర్నలిస్టులపై, తమకు వంతపాడని న్యాయమూర్తులపై, కిడ్నాప్‌లకు, భౌతిక దాడులకు, హింసకు పాల్పడటం అంబేద్కర్, పూలే ఆలోచనలకు విరుద్ధం కాదా! కులం, మతం పేరుతో దురహంకార హత్యలకు పాల్పడటం, మత విద్వేషం నింపడం లాంటి సంఘటనలు ఈ దేశంలో చూస్తూనే ఉన్నాం. విభిన్న సంస్కృతులకు నిలయమైన ఈ దేశంలో ఏక మత సంస్కృతిని వ్యాప్తి చేయడానికి బీజేపీ తహతలాడుతుంది. బీసీ కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా బీజేపీ మినహా అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర సమాజం గొంతెత్తి నిలదీస్తుంటే బీజేపీ మాత్రం కనీసం ఆ వైపుగా ఆలోచన కూడా చేయడం లేదు. ప్రభుత్వ రంగాలను నిర్లక్ష్యం చేస్తూ మొత్తానికి ప్రయివేటు రంగాన్నికి అప్పజెప్పుతూ రిజర్వేషన్ల వ్యవస్థకు మంగళం పాడే కుట్రలకు తెరలేపుతున్నారు. శాస్త్రీయమైన రాజ్యాంగాన్ని విస్మరించి అశాస్త్రీయమైన మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి కుట్రలు చేస్తున్నారు. ఈ విద్వేష పాలనకు చరమగీతం పాడాలంటే రాజ్యాంగాన్ని పరిరక్షించబడాలంటే, పీడచీడఅవగడిత, అణగారిన వర్గాలకు న్యాయం దక్కాలంటే పూలే, అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తితో సంఘటితంగా ఉద్యమించాలి. సాంస్కృతిక భావజాలం కోసం రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మైనారిటీలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, ఆదివాసీలు పిడికిలి బిగించి మతోన్మాద ప్రభుత్వంపై జంగ్ సైరన్ మోగించాలి. పూలే-అంబేద్కర్ ఆలోచనా స్ఫూర్తిని కొనసాగించాలి.

"మన మార్క్స్ మహర్షి అంబేద్కరే" అనే వ్యాసానికి స్పందన

ఈ మధ్య "మన మార్క్స్ మహర్షి అంబేద్కరే" అనే మకుటంతో డా॥ పట్టా వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఒక వ్యాసం రాశారు. మార్క్సిజం చెప్పేదాని ప్రకారం చరిత్రే హీరోలను తయారు చేస్తుంది అని అంటారాయన. దీనిని కాదని ఎవరంటారు?

తరువాత పేరాలో న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్‌కు 1853లో మార్క్స్ రాసిన ఒక వ్యాసం నుండి ఒక వాక్యం కోట్ చేశారు. "బ్రిటిష్ పరిపాలన ఏషియన్ సమాజంలో గతంలో కనీ, వినీ ఎరుగని సామాజిక విప్లవాన్ని తట్టి లేపింది" అన్నారు. అందులో ఏమున్నదంటే English interference... and this produced the greatest, and so, to speak the truth, the only social revolution ever heard of in Asia ఇదే కొటేషన్‌ను వెంకటేశ్వర్లు గారు కూడా తెలుగులో ఇచ్చారు.




సి. సాంబిరెడ్డి

బ్రిటిష్ వాళ్ళు మనదేశంలో తమ లాభాలను పెంచుకోటానికి ఎలాంటి మార్పులు అవసరమో, అలాంటి మార్పులనే వాళ్లు మనదేశంలో చేపట్టారు. దాంట్లో భాగంగానే కొద్దిగా రైల్వే మార్గాలు, కొన్ని పరిశ్రమలు స్థాపించారు. 'మెకాలే' విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టారంతే. అంతకు మించి ఏమీలేదు. మార్క్స్ కూడా ఇలాంటి అభివృద్ధిని గురించి గొప్పగా ఎక్కడా ప్రస్తావించలేదు. సామ్రాజ్య వాదాన్ని గురించి ఆయన ఒకచోట పాజిటివ్‌గా కామెంటు చేసినా, అది పెట్టుబడిదారీ విధానపు పొటెన్షియాలిటి గురించి ప్రస్తావించటానికి మాత్రమే.

నాయకుల అవసరం ఎప్పుడంటే, ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి ఆనాడు ఉన్న ఉత్పత్తి సంబంధాలు ఆటంకంగా తయారైనప్పుడు, ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఉత్పత్తి సంబంధాలు అతి క్రమించలేని సంకెళ్లుగా మారినప్పుడు ఉత్పత్తి స్తంభించిపోతుంది. ఆర్థికాభివృద్ధి నిలిచిపోతుంది. ఈ పరిస్థితిని మార్చాలంటే, ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే, అభివృద్ధికి తోడ్పడే ఉత్పత్తిశక్తులకు బంధాలుగా మారిన ఉత్పత్తి సంబంధాలను బద్దలు కొట్టాలి. ఈ బంధాలను బద్దలు కొట్టాలంటే పెద్ద ఎత్తున జన సమీకరణ జరగాలి. జనాన్ని సమీకరించగల నాయకులు తయారవ్వాలి. ఆ విధంగా తయారైన నాయకులు పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రజా సమూహాలను నడిపించి, ప్రజాబలంతో వారిని ఓడిస్తారు. దోపిడీ సంబంధాలు రద్దు చేస్తారు. ఆ విధంగా బంధించబడ్డ ఉత్పత్తి శక్తులు విడుదల అవుతాయి. దీనినే సామాజిక విప్లవం అంటారు. ఆ విప్లవాన్ని జయప్రదం చేయటానికే నాయకులు అవసరం ఏర్పడుతుంది. వాళ్లు ఇలాంటి సంక్షోభ సమయాల్లోనే సాధారణంగా జన్మిస్తారు. అంతేగాని, డా॥ పట్టా చెప్పినట్లుగా అంతా సజావుగా ఉండి, ఉత్పత్తి శక్తులు పెరుగుతున్న దశలో కాదు.

బ్రిటిష్ వాళ్లు మనదేశానికి వచ్చే ముందు మనదేశంలో నిచ్చెనమెట్ల కులవ్యవస్థతో కూడిన భూస్వామ్య వ్యవస్థ అమలులో ఉండేది. ఆ దశలో మనదేశం పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థకు ప్రతినిధులైన బ్రిటిష్ సామ్రాజ్య వాదుల చెరలో చిక్కుకుంది. పెనం నుండి పొయ్యిలో పడ్డట్లుగా తయారైంది మన పరిస్థితి. వాళ్లు మన సంపదలన్నింటినీ దోచేశారు. రైతాంగ దోపిడీ, రైతులను కూలీలుగా మార్చేసింది. చేతి వృత్తులను ధ్వంసం చేసి వారిని దిక్కులేని వారిగా తయారు చేసింది.

న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్‌కు రాసిన తన రెండు వ్యాసాల్లో భారతదేశంలో జరిగిన బ్రిటిష్ దోపిడీ గురించి మార్క్స్ కళ్లకు కట్టినట్టుగా వివరించారు. బ్రిటిష్ వాళ్ల రాక పూర్వం శతాబ్దాల పాటు మనదేశంలో స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంతో పటిష్టంగా పని చేసింది. భూమి ప్రభుత్వానిది. సాగు చేసుకోటానికి రైతులకు హక్కు ఉండేది. సాగునీటి వ్యవస్థను కూడా ప్రభుత్వమే నిర్వహించేది. వీటిని ఉపయోగించి రైతు పంటను పండించేవాడు. పండిన పంటలో ఒక భాగంతో శిస్తు చెల్లించేవాడు. వృత్తిదార్లు కూడా గ్రామంలో ఉండేవారు. తమ స్వంత పరికరాలతో తయారు చేసిన వస్తువులను వృత్తిదారులు రైతులకు ఇచ్చేవారు. రైతులు దానికి బదులుగా వృత్తిదారులకు ధాన్యం ఇచ్చేవారు. మిగిలిన ధాన్యాన్ని రైతు తన కుటుంబానికి వాడుకునేవాడు. ఇలా గ్రామంలో



వస్తు మారక పద్ధతి ద్వారా ఇటు రైతుల అవసరాలు, అటు వృత్తిదారుల అవసరాలు, రెండూ తీరేవి. ఉప్పు, ఇనుము మినహా ఏదీ కొనాల్సిన అవసరం ఉండేది కాదు. అలా వ్యవసాయానికి, పరిశ్రమలకు మధ్య మనదేశంలో గ్రామస్థాయిలో బంధం ఏర్పడిందని మార్క్స్ అంటారు. ఈ బంధం కొనసాగినంత కాలం మన గ్రామాలు స్వయం పోషకత్వంతో ఉండేవి. వాటి మనుగడకు ఎలాంటి ధోకా ఉండేది కాదు. కాని ఈ బంధం తెగిపోతే ఈ గ్రామీణ వ్యవస్థ మనుగడ కుంటుపడుతుంది. అలాగే ప్రభుత్వ నిర్వహణలో ఉన్న సాగు నీటి వ్యవస్థ దెబ్బతిన్నా ప్రమాదమే. బ్రిటిష్ వాళ్లు వచ్చిన తరువాత వాళ్ల ప్రభుత్వం ఈ సాగునీటి వ్యవస్థను విస్మరించింది. పంటలు దెబ్బతిన్నాయి. దేశం కరువు, కాటకాల వాత పడింది. ఒకదాని తరువాత ఒకటిగా కరువులు వస్తూనే ఉండేవి. వచ్చిన ప్రతి కరువు లక్షలాది మందిని పొట్టనబెట్టుకునేది. 20వ శతాబ్దం, 4వ దశకంలో బెంగాలులో వచ్చిన కరువుకు 45 లక్షల మంది బలయ్యారు. బ్రిటిష్‌వాడు రైల్వేలు వేశాడు. టెలిగ్రాఫ్‌ను ఏర్పాటు చేశాడు. ఓడరేవులు నిర్మించా డు అని అంటారు. అవన్నీ తమ దోపిడీకి అవసర మైన మేరకు మాత్రమే ఏర్పాటు చేసుకున్నారు. అవన్నీ ప్రజలకు పెద్దగా ఉపయోగ పడేవి కావు.

వాళ్ల రెవెన్యూ పెంచుకోటానికి బ్రిటిష్ వాళ్లు భూసంబంధాల్లో మూడు రకాల మార్పులు చేశారు. ఆ దెబ్బతో రైతాంగం మొత్తం దివాళా తీసింది. వారంతా కూలీలుగా మారారు. సామాజిక సంక్షోభమంటే ఇదే. మార్పు కొరకు ప్రజలు ఎదురు చూసేది ఇలాంటి పరిస్థితులలోనే. ఈ పరిస్థితులకు కారణమైన బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమికొట్టడానికి నాయకులు ముందుకు వచ్చారు. 1875లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పడింది. లాలా లజపతిరాయ్, బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్ లాంటి నాయకులు ముందు కొచ్చారు. తరువాత గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, చంద్రశేఖర్ అజాద్ లాంటి నేతలు, విప్లవకారులు, అదే కాలంలో ముందుకు వచ్చిన కమ్యూనిస్టు విప్లవకారులు, ఇలా ఎంతో మంది నాయకులు బ్రిటిష్ తుపాకులకు ఎదురొడ్డి నిలిచారు. బ్రిటిష్‌వాడు సృష్టించిన అదే సంక్షోభంపై నాయకులతో పాటు డా॥ బి.ఆర్ అంబేద్కర్‌ను కూడా రంగం మీదకు తెచ్చింది. అంటే డా॥ బి.ఆర్ అంబేద్కర్ కూడా పై నాయకులందరి మాదిరిగానే చరిత్ర సృష్టించిన మహా నాయకుడు. డా॥ వెంకటేశ్వర్లు, డా॥ తెల్‌తుమ్‌డే గురించి ప్రస్తావించారు. డా॥ తెల్‌తుమ్‌డే అన్నట్లు డా॥ అంబేద్కర్ నిజంగానే ఫెబియన్ సోషలిస్టు. వాళ్ల కూడా అంటే, ఫెబియన్ సోషలిస్టులు కూడా సమానత్వాన్నే, సోషలిజాన్నే కోరుకుంటారు. కాని దానిని క్రమ క్రమంగా, అంచెలంచెలుగా తెస్తామంటారు. గంతు రూపంలో జరిగే విప్లవానికి వాళ్ల వ్యతిరేకులు.

ఈ వ్యాసంలో డా॥వెంకటేశ్వర్లు ఇంకా అనేక విషయాలు ప్రస్తావించారు. వాటన్నింటిని తడివి ఇప్పుడున్న మంచి వాతావరణాన్ని చెడగొట్టదలచుకోలేదు. గతాన్ని తవ్వి పొందగల ప్రయోజనం శూన్యం. కొంతకాలం కలిసి పనిచేశారు. కాబట్టి కొన్ని సమస్యలు తలెత్తి ఉండవచ్చు. వాటిని వదిలేద్దాం. ఇంతవరకు కనీ, వినీ ఎరుగనంతటి ప్రమాదాన్ని ప్రస్తుతం దేశం ఎదుర్కొంటూ ఉంది. హిందూత్వ అనే ఫాసిస్టు భూతం ప్రజాస్వామిక సంస్థలు దేనినీ బతకనిచ్చేట్లుగా లేదు. రాజ్యాంగ సంస్థలన్నీ ప్రమాదంలో పడ్డాయి. పార్లమెంటు మొదలు, న్యాయ వ్యవస్థ, ఎలక్షన్ కమిషన్, సిబిఐ, ఈడీ లాంటి నిఘా సంస్థలు, విద్యారంగం, మన రాజ్యాంగ పీఠికలో పొందుపరచుకున్న ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామాజిక న్యాయం, ఫెడరల్ వ్యవస్థ ఇలా ఆధునిక వ్యవస్థలు, విలువలు అన్నీ మంటగలిసిపోతున్నాయి. ఇప్పుడున్న రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని ప్రతిష్ఠించ బోతున్నారు. కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని అమలు జరుపబోతున్నారు. ప్రజాస్వామ్యం స్థానంలో నిచ్చనమెట్ల కులవ్యవస్థ అమలు కాబోతున్నది. ఇప్పుడు కావలసింది, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తుల ఐక్యత. ఫాసిస్టు హిందూత్వకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం. మిగతావన్నీ పక్కన బెట్టి అందరం కలిసి ఫాసిస్టు భూతాన్ని తరిమికొడదాం, రండి.



చిన్నప్పుడు మనం విన్న చుక్ చుక్ రైలు ఒక్కసారిగా గుర్తొస్తోంది... అందులో ఏడుస్తున్న బిడ్డకు తల్లి జోల పాడుతూ... "జో జో పాపా ఏడవకు... లడ్డు మిఠాయి తినిపిస్తా..." అంటోంది. మనం వాడుక భాషలో కూడా ఎవరినైనా ఆటపట్టించాలి అంటే 'లడ్డూ కావాలా నాయనా' అంటుంటాం. ఇంతకీ... ఈ లడ్డూ గోల ఏంటి అనుకుంటున్నారా.? అయితే ఆ వివరాలేంటో తెలుసుకుందాం రండీ...



లడ్డూ కావాలా అమ్మా...

లడ్డు అంటే ఇష్టపడని వారు ఈ భూమి మీద ఉండరు అంటే అతిశయోక్తి కాదేమో. చిన్న పిల్లల దగ్గర నుండి పెద్దవాళ్ళ వరకు అందరూ ఇష్టంగా తినే స్వీట్స్ రారాజు లడ్డూ. అయితే అందరిలా కాకుండా మనం కాస్త స్పెషల్‌గా ఉండాలని... చరిత్రలో మనకంటూ ఒక పేజీ ఉండాలని కొందరు అనుకుంటూ ఉంటారు. ఊరికే ఇలా అనుకోవడం మాత్రమే కాకుండా వారి బుర్రలోనీ ఆలోచనలకు పదును పెట్టి ఆ ఆలోచనకు కాస్త కొత్తదనాన్ని చేర్చినపుడే విజయం సాధిస్తారు. అలా తాను తయారు చేసిన ఏ పదార్థం అయినా సమాజంలోని ప్రతీ ఒక్కరి జీవన శైలికి తగ్గట్టుగా ఉండాలని కోరుకుంటుంది కవితా గోపు. అందరి మన్ననలను అందుకుంటోంది.

ఆలోచనలను ప్రోత్సహిస్తూ...

'లడ్డూ బాక్స్' అనే సంస్థను 2019లో ప్రారంభించారు కవిత. ఇందు కోసం తాను చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని కూడా వదులుకుంది. ఈ సంస్థను మొదలు పెట్టారు. ప్రతీ మగాడి విజయం వెనుక ఒక మహిళ ఉన్నట్లు కవిత ఆలోచనలను ప్రోత్సహిస్తూ తన వంతు సహాయ సహకారాలను అందించారు ఆమె భర్త సందీప్. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అన్నట్లు తన చెయ్యిని పెండ్లి ప్రమాణాల్లోనే.. కాదు సమాజంలో తన భార్య కు ఒక ప్రత్యేక స్థానం పొందేందుకూ అండగా ఉన్నారు సందీప్.

గడ్డు పరిస్థితుల్లో...

అప్పుడప్పుడే అడుగులు వేస్తున్న చిన్న బిడ్డకు ఒక పెద్ద దెబ్బతగిలితే ఆ తల్లి మనసు విల విల లాడుతుందోంది. అలా 2019లో కవిత ప్రారంభించిన తన సంస్థకు కరోనా రూపంలో పెద్ద దెబ్బ తగిలింది. ఆమెనే కాదు కరోనా ఎందరో జీవితాల్ని తలకిందులు చేసింది. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో తన బిడ్డను (లడ్డు బాక్స్ సంస్థను) ఎలా కాపాడుకోవాలి అని తలమునకలు అవుతున్న పరిస్థితుల్లో ఒక చిన్న ఆలోచన ఊపిరి పోసుకుంది.

అవగాహన కల్పిస్తూ...

ఆఫ్‌లైన్‌లో కాకుండా. ఆన్‌లైన్ బిజినెస్ మొదలు పెట్టారు. అలా మొదలు పెట్టిన సంస్థ ఒక బాక్స్ స్వీట్స్‌తో మొదలైంది. ఇప్పుడు ఆ ఆర్డర్‌లు కాస్త కేజీల కొద్ది లడ్డూలు కావాలనే వరకు విస్తరించింది. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు పెద్దలు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య వంతులుగా ఉండాలనే లక్ష్యంతో తాము తయారు చేసే లడ్డూల కోసం బెల్లంతో, చిరు ధాన్యాలను ఉపయోగిస్తున్నారు. ప్రజల్లో చిరు ధాన్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. తాను చేస్తున్న కృషికి గాను అగ్రగామిగా ఉన్న సంస్థలకు ధీటుగా నిలబడి అవార్డ్ కూడా అందుకున్నారు.

- దీప నిదానకవి



పిల్లలకు సెలవులా..?



వేసవి సెలవులొస్తున్నాయంటే తల్లిదండ్రులు ముందే భయపడిపోతుంటారు. పిల్లల అల్లరి అలా ఉంటుంది మరి. ఇలాంటప్పుడు వేసవి మొత్తానికి ఒక వ్యాపకం లాంటిది ఇచ్చి వారిని బిజీగా ఉంచండి. అప్పుడు ఇంట్లో అందరూ ప్రశాంతంగా ఉండొచ్చు..

- పరీక్షలు ముగియడంతోనే డ్యాన్స్ స్కూళ్ల తెరుచుకుంటాయి. నృత్యాన్ని పిల్లలు కూడా ఇష్టపడతారు. వీలైతే వారిని అందులో చేర్పించండి. ఇది చిన్నారులకి తగిన వ్యాయామం అందించడమే కాదు... వారి రోజునీ ఉల్లాసంగా గడిచి పోయేలా చేస్తుంది.
- పిల్లలకు మట్టిలో ఆడుకోవడం చాలా ఇష్టం. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మట్టిలో ఆడుకుంటే అనారోగ్యానికి గురవుతారనే భయంతో మట్టిలో చేతులు పెట్టనివ్వం. అలాంటప్పుడు మార్కెట్‌లో రంగురంగుల క్లే కిట్‌లు దొరుకుతున్నాయి. వాటిని కొనిచ్చేయండి. బుద్ధిగా కూర్చొని వాటితో నచ్చిన బొమ్మలు చేసుకుంటుంటారు.
- గ్యాడ్జెట్స్‌తో ఆడుకోవటం, కంప్యూటర్‌పై పని చేయటాన్ని కొందరు పిల్లలు ఇష్టపడతారు. ఇలాంటి వారికి కంపోజింగ్, సిస్టమ్‌పై అవగాహన వచ్చేందుకు క్లాసులు చెప్పించండి. వారి సమయమూ సద్వినియోగ మవుతుంది. ఇలా నేర్చుకున్న కొత్త విషయాలు వారి భవిష్యత్తుకి బంగారు బాటలు వేస్తుంటాయి.

ఇట్ల చేద్దాం

ఆకుకూరలు ఎక్కువ రోజులపాటు తాజాగా ఉండాలంటే వాటిని కడిగి, ఆరబెట్టి, సన్నగా తరుక్కోవాలి. తర్వాత ఐస్ ట్రేలలో ముప్పావు వంతు నింపి, ఆకులు మునిగే వరకు నీరు పోసి ఫ్రీజర్‌లో ఉంచాలి. వీటికి ఇతర పదార్థాల వాసన పట్టకుండా ఉండాలంటే ఈ ఐస్‌ట్రేలకు ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్ ఫిల్మ్ చుడితే సరిపోతుంది.


వేసవి తాపాన్ని తగ్గిస్తాయి

రోజురోజుకు ఎండ పెరిగిపోతుంది. ఉక్కపోత, చెమటతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటువంటి సమయంలో ఆరోగ్యపరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే శరీరం డీ హైడ్రేట్ అయిపోయి ప్రాణాపాయం సంభవించే అవకాశం కూడా ఉంటుంది. బయట వాతావరణం వేడిగా ఉంటుంది కాబట్టి శరీరాన్ని లోపల చల్లగా ఉంచుకోవడం ముఖ్యం. అందుకోసం తగిన ఆహార పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే నీరు ఎక్కువగా తీసుకోవాలి. ఈ నేపథ్యంలో వేసవిలో ఎక్కువగా తీసుకోవాల్సిన పానీయాలు, ఆహార పదార్థాలు ఏంటి? వాటిని ఎప్పుడు ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం...

కొబ్బరి నీరు : ఇది వేసవిలో అత్యంత ఆరోగ్యకరమైన పానీయం. ఇది అలసిపపోయిన శరీరాన్ని తిరిగి రిఫ్రెష్ చేయడానికి బాగా ఉపకరిస్తుంది. సహజ ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, మినరల్స్‌తో నిండి ఉన్న ఈ కొబ్బరి నీరు వేసవి వేడిని అధిగమించడంలో మీకు బాగా సహాయపడుతుంది. ఇది శరీరాన్ని రీహైడ్రేట్ చేస్తుంది. అనారోగ్యాల బారి నుంచి కాపాడుతుంది. అంతేకా జీర్ణక్రియను కూడా ప్రోత్సహిస్తుంది.

మజ్జిగ : ఇది తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. వాతావరణం కారణంగా ప్రేరేపించబడే గట్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మజ్జిగ అనేది శరీర సాధారణ ఉష్ణోగ్రతను పునరుద్ధరించే ప్రోబయోటిక్స్, విటమిన్లు ఖనిజాలతో సమృద్ధిగా ఉండే పానీయం. అంతేకాక ఇది మీ హైడ్రేషన్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

కీరదోస : వీటిలో నీటి కంటెంట్‌తో పాటు ఫైబర్, విటమిన్లు బీ1, బీ2, బీ3, బీ5, బీ6, ఫోలిక్ యాసిడ్, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం, జింక్‌లు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడతాయి. అంతేకాక వేసవి నెలల్లో మిమ్మల్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. కాబట్టి అలసిపోయినట్లు అనిపించినప్పుడల్లా మీ శక్తి స్థాయిలను తిరిగి పొందడానికి కీరదోసకాయలను తినొచ్చు.



ఇండ్లు, ఇండ్లస్థలాలివ్వడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించాలని సూచించారు. 5.60 లక్షల మందికి డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వం తన హామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఆ హామీ మేరకు డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలనీ, ఇప్పటికే నిర్మించిన వాటిని కేటాయించాలని కోరారు. రాజ్యాంగం చెప్పిన జీవించే హక్కులో భాగమైన నివాస హక్కు అందరికి దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2022 డిసెంబర్ 31 నాటికి అందరికి ఇండ్లు కట్టిస్తామన్న ప్రధాని మోడీ తన హామీ నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందనే భయం మోడీకి పట్టుకుందని తెలిపారు. దీంతో కేంద్ర గృహ నిర్మాణశాఖ నిధుల నుంచి రూ.467 కోట్లతో ఇల్లు, భారీ ప్రహారీ గోడ, అక్కడ్నుంచి పార్లమెంటు వరకు సొరంగం నిర్మించుకుంటున్నారని విమర్శించారు. అదే మోడీ..... ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీ ఎంపీలు, నాయకులు కేంద్రంపై ఒత్తిడి చేయాలనీ, తద్వారా పేదలకు ఒక ఇంటికి రూ.10 లక్షలు ఇప్పించాలని సూచించారు. పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నర్సింహారావు, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి తదితరులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మానాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రవి, వేదిక రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్, బొప్పని పద్మ, కోట రమేష్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి వీఓఏల నిరసన

(మొదటిపేజీ తరువాయి)

అండగా ఉంటామని చెప్పారు. ములకలపల్లిలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, టేకులపల్లి సీఐటీయూ జిల్లా కోశాధికారి మేకల పద్మ,పినపాకలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు.

బీజేపీని ఓడించాలి

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజెపిని ఓడించా లని సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పిలుపు ఇచ్చింది. బెంగళూరులోని గాంధీ భవన్లో ఎస్కేఎం "కిసాన్ పంచాయత్" నిర్వహించింది. కర్నాటక రైతుల 15 డిమాండ్లు, ఒక ప్రత్యేక, తక్షణ డిమాండ్ తో కూడిన డిమాండ్‌ల చార్టర్ కిసాన్ పంచాయతీ విడుదల చేసింది. ఈ సమావేశంలో 20కి పైగా సంఘాలకు చెందిన 200 మంది రైతు నాయకులు హాజరయ్యారు. ఎస్కేఎం సీనియర్ జాతీయ నాయకులు హన్నన్ మొల్లా, యోగేంద్ర యాదవ్, కవిత కురుగంటి, అవిక్ సాహా పంచాయితీని ఉద్దేశించి ప్రసంగించారు. తమ హక్కులు, డిమాండ్ల కోసం రైతులు చేసిన వివిధ పోరాటా లలో తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులైన రైతులకు నివాళులర్పించారు.

డిమాండ్లు

1. భూ సంస్కరణల (సవరణ) చట్టం, ఏపీఎంసీ సవరణ చట్టం, పశు వుల వధ నిరోధక చట్టం వంటి 2019-2020లో బీజేపీ ప్రభుత్వం రూపొందించిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి.
2. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించే చట్టం తీసుకొచ్చినా రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలి.
3. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు, రైతులందరికీ లాభదాయకమైన ధరలను చట్టబద్ధంగా హామీతో కొత్త చట్టాన్ని అమలు చేయాలి.
4. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమర్థవంతమైన విపత్తు నివారణ, పంటల బీమా యంత్రాంగాల అనేక విపత్తుల కారణంగా నష్టపోతున్న వివిధ నష్టాలకు రైతులకు తగిన పరిహారం ఇవ్వాలి.
5. రైతులు , వ్యవసాయ కార్మికు లు అప్పుల భారంతో బాధలను అనుభ వించకుండా , వ్యవసాయ నష్టాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడకుం డా ఉండేలా రుణభారం నుంచి రైతుల విముక్తి చట్టం. అలాగే రైతుల బకాయి ఉన్న వ్యవసాయ రుణాలన్నింటినీ ప్రభుత్వం మాఫీ చేయాలి.
6. భూసేకరణ, పునరావాసం , పునరావాస చట్టం (ఎల్ఎఆర్ఆర్) 2013కి బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలను రద్దు చేయాలి. రైతుల ఇష్టానికి వ్యతిరేకంగా ఎలాంటి భూమిని సేకరించకూడదు.



సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకే

(మొదటిపేజీ తరువాయి)

(ఏఐటీయూసీ) వ్యవహరించారు. సదస్సునుద్దేశించి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ...సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలకు సంబంధించిన కార్యాచరణ ప్రకటించారు. పంచాయతీల్లో వారు వివిధ కేటగిరీల వారీగా పని చేస్తున్నారని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 500 మందికి ఒక కార్మికుడిని ఖరారు చేయలేదన్నారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులకు నేటికీ ఉద్యోగ భద్రత లేదన్నారు. ఇచ్చే అరకొర వేతనం నాలుగైదు నెలలకోసారి ఇస్తే కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. మల్టీపర్పస్ విధానం కార్మికుల ప్రాణాలను తీస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లు ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేస్తున్నారని వాపోయారు. వారికి వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. 11వ పీఆర్సీ కమిషన్ సిఫారసుల మేరకు జీఓ నెం.60 ప్రకారం రూ.19 వేలు, రూ.22,900, రూ.31,040 వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ సలహాదారులు ఎమ్‌డీ.యూసుఫ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ముందుకు తెస్తున్నదనీ, ప్రాణత్యాగం చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, 8 గంటల పని దినాలను 12 గంటలకు మార్పులు చేస్తున్నదని విమర్శించారు. ఈ విధానాలను గ్రామ పంచాయితీ సిబ్బంది ముందుగా వ్యతిరేకించాలనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జేఏసీ కార్యదర్శి ఎస్.యజ్ఞనారాయణ్ మాట్లాడుతూ..కారోబార్, బిల్ కలెక్టర్ల సమస్యలు పరిష్కరించాలనీ, పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్‌ను వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ కేటగిరీలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ.. పీఆర్సీ ద్వారా అందరికీ జీతాలు పెంచి పంచాయతీ కార్మికులను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న వారిని ఎందుకు పర్మినెంట్ చేయరని నిలదీశారు. ఎక్కడా లేని మల్టీపర్పస్ విధానం పంచాయతీ కార్మికులకే ఎందుకు అని ప్రశ్నించారు. ఈ సదస్సులో నల్లా రాధాకృష్ణ (జీపీకేఎంయూ), దాసు (ఐఎఫ్‌టీయూ), పి. శివబాబు (ఐఎఫ్‌టీయూ), తదితరులు మాట్లాడారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

జీపీ కార్మికుల డిమాండ్లన్నీ న్యాయమైనవే : ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి

గ్రామపంచాయతీ కార్మికుల కోసం తీసుకొచ్చిన మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలనీ, వారికి కనీస వేతనం ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. బంగారు తెలంగాణ కాదు..అందరూ బతికే తెలంగాణ కావాలని ఆకాంక్షించారు. సమస్యలపై అన్ని గ్రామపంచాయతీ కార్మిక సంఘాలు ఒక్కతాటిపైకొచ్చి పోరాడటం మంచి పరిణామం అని ప్రశంసించారు. ఇచ్చేదే రూ.8,500 వేతనం, అందులో ఇద్దరు, ముగ్గురు పంచుకుంటే ఆ వేతనంతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వారు కోరుతున్నవేం గొంతెమ్మ కోరికలు కాదనీ, న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పంచాయతీ కార్మికులు ప్రమాదాల్లో చనిపోతుంటే తనకేం పట్టనట్టు రాష్ట్ర సర్కారు వ్యవహరించడం సరిగాదన్నారు. పంచాయితీ సిబ్బందికి ప్రకటించిన ఎస్‌కే.డే ఇన్సూరెన్స్ పథకాన్ని నేటికి కూడా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల పోరాటాలకు తన మద్దతు ఉంటుందని భరోసానిచ్చారు.

జేఏసీ కార్యాచరణ ఇదే..

- గ్రామాల్లో మేడే దినోత్సవాన్ని నిర్వహించాలి.
- మే 10 నుండి 25 వరకు జిల్లాల్లో సదస్సులు నిర్వహించాలి.
- మే 26న సర్పంచ్‌లకు, పంచాయితీ కార్యదర్శులకు వినతి పత్రాలు ఇవ్వాలి.
- మే 29న ఎంపిడిఓలకు వినతి పత్రాలు ఇవ్వాలి.
- జూన్ ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతులు అందజేత
- జూన్ 5న పంచాయితీరాజ్ శాఖ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇవ్వాలి.
- జూన్ 12న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 25 తర్వాత నిరవధిక సమ్మెలోకి కార్మికులు

గడువు పొడిగించాలి : తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేయాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. పేదలకు ఇండ్లస్థలాల పట్టాలివ్వడానికి విడుదల చేసిన జీవో నెంబర్ 58, 59 గడువు ఈనెల 30వ తేదీతో ముగియనున్నట్టు ప్రభుత్వ ప్రకటనలు తెలియజేస్తున్నాయని వివరించారు. మిగులు భూములు, ప్రభుత్వ భూముల్లో 2020, జూన్ రెండో తేదీకి ముందు వాస్తవ అధీనంలో ఉన్న పేదలకు పట్టాలివ్వడానికి ఇచ్చిన గడువును పొడిగించాలని కోరారు. మీసేవా కేంద్రంలో దరఖాస్తుల కోసం ఇచ్చిన గడువులో, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ఆటంకం ఏర్పడింద ని పేర్కొన్నారు. ఇప్పటివరకు జీవో నెంబర్ 58 ప్రకారం గ్రామాల్లో 1.50 లక్షల మంది, జీవో నెంబర్ 59 ప్రకారం పట్టణాల్లో 42 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు ప్రకటించారని తెలిపారు. 125 గజాలలోపు ఉన్నవారు ఉచితంగా పట్టా పొందడానికి మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 126 నుంచి 250 గజాలున్నవారు రిజిస్ట్రేషన్ ధరలో 50 శాతం చెల్లించాలని తెలిపారు. 251 గజాల నుంచి 500 గజాల వరకు ఉన్నవారు 75 శాతం, 500 నుంచి వెయ్యి గజాలు స్వాధీనంలో ఉన్నవారు 100 శాతం రిజిస్ట్రేషన్ ధర చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఇందుకు ఆధార్‌కార్డు గానీ, కరెంటు బిల్లుగానీ లేదా గ్రామపంచాయితీ/మున్సిపాల్టీకి చెల్లించిన రశీదులు జతపర్చాలని పేర్కొన్నారు. పై ఆధారాలేవీ లేని వారు వేలసంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో భౌతికంగా సర్వే నిర్వహించి 2020 జూన్ రెండో తేదీకి ముందు స్వాధీనంలో ఉన్న పేదలకు వారి స్థితిని బట్టి పట్టాలను మంజూరు చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మీ సేవా కేంద్రాలు లేకపోవడం, ఉన్నా సరిగా పనిచేయకపోవడంతో చాలామంది వినియోగించుకోలేకపోతున్నారని పేర్కొన్నా రు.ఆన్‌లైన్‌లో నింపడం రాక కూడా దరఖాస్తులు చేసుకోలేదని తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం,మంచిర్యాల,పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో ప్రధానంగా దళితులు,గిరిజనులు,వెనకబడిన తరగతుల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్లు, సిబ్బంది స్వయంగా సర్వే చేసి, ప్రభుత్వ భూమిలో లేదా మిగులుభూముల్లో 125 చదరపు గజాల స్థలంలో ఇండ్లు నిర్మాణం చేసుకున్నవారి నుంచి దరఖాస్తులు తీసుకోవా లని సూచించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా తహశీల్ కార్యాలయాలకు బాధ్యత పెట్టడం ద్వారా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని తమ్మినేని తెలిపారు. అందుకనుగుణంగా ఆయా జీవోల గడువును పొడిగించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

ఆత్మహత్యలను అరికట్టాలి

- ప్రయివేటు కాలేజీలు నిబంధనలు పాటించాల్సిందే
- కళాశాలల్లో ఇంటర్ తరగతులనే బోధించాలి
- ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ తప్పనిసరి
- పీజీలో 50 మార్కులున్నోళ్లనే అధ్యాపకులుగా నియమించాలి :ఇంటర్ బోర్డు మార్గదర్శకాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టాల్సిన అవసరముందని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. బోర్డు ప్రకటించిన నిబంధనలను ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు పాటించాలని ఆదేశించింది. కాలేజీల్లో ఇంటర్ తరగతులనే బోధించాలని తెలిపింది. కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఆధార్‌తో కూడిన బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని కోరింది. రంగారెడ్డి జిల్లాలోని నార్సింగి శ్రీచైతన్య కాలేజీ యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకుల వేధింపుల వల్ల సాత్విక్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో మార్చి ఆరో తేదీన హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో శ్రీచైతన్య, నారాయణతోపాటు పలు ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆత్మహత్యల నివారణకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. మార్చి 17న ఆ కమిటీ సమావేశం జరిగింది. అందులో చర్చించిన అంశాల ఆధారంగా విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం మార్గదర్శకాలను విడుదల చేశారు. జూనియర్ కాలేజీల్లో ప్రతిరోజూ క్రీడలు, మానసిక ఉల్లాసం కలిగించే కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఇంటర్ బోర్డు ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. పీజీలో 50 శాతం మార్కులున్నోళ్లనే అధ్యాపకులుగా సరిపోయినంత మందిని నియమించాలని తెలిపారు. విద్యాసంవత్సరం మధ్యలో వారిని తొలగించొద్దని పేర్కొన్నారు. ఒకవేళ తొలగించాల్సి వస్తే వారి స్థానంలో మరొకరిని వెంటనే నియమించాలని ఆదేశించారు. కాలేజీ ప్రిన్సిపాల్ మొబైల్ నెంబర్‌ను తప్పకుండా ప్రకటించాలని కోరారు. ఒకవేళ ప్రిన్సిపాల్ మారితే ఆ విషయాన్ని జిల్లా ఇంటర్ విద్యా అధికారి (డీఐఈవో)కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇతరులను కాలేజీల్లోకి అనుమతించొద్దని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు సమయమిచ్చి అనుమతించాలని సూచించారు. కాలేజీలో సీనియర్ అధ్యాపకున్ని కౌన్సిలర్‌గా నియమించాలని కోరారు. అదనపు తరగతులను మూడు గంటల కంటే అదనంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు రెసిడెన్షియల్ విధానంలో ఉంటే విద్యార్థులకు కనీసం ఎనిమిది గంటలపాటు నిద్ర ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తీసుకోవడంతోపాటు తయారు కావడానికి గంటన్నర సమయం కేటాయించాలని తెలిపారు. సాయంత్రం గంటసేపు విశ్రాంతి తీసుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. మధ్యాహ్నం, రాత్రి భోజనానికి కనీసం 45 నిమిషాల సమయం కేటాయించాలని వివరించారు. విద్యార్థి ఎవరైనా కాలేజీ నుంచి వెళ్లిపోతే ఫీజు తిరిగి చెల్లించాలని ఆదేశించారు. మూడు నెలల్లోపు అయితే 75 శాతం, నాలుగు నుంచి ఆర్నెళ్లలోపు అయితే 50 శాతం, ఆర్నెళ్ల తర్వాత వెళ్తే 25 శాతం ఫీజును వారంరోజుల్లో చెల్లించాలని కోరారు. ఏడాదిలో రెండుసార్లు విద్యార్థులకు మెడికల్ చెకప్ చేయించాలని సూచించారు. అధ్యాపకులు టీచింగ్ డైరీని అమలు చేయాలని తెలిపారు. విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. కాలేజీల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

కొత్త సీసాలో పాత సారా : మధుసూదన్‌రెడ్డి

ఇంటర్ బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలు కొత్త సీసాలో పాత సారాలాగా ఉందని ఇంటర్ విద్య జేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు, ఫీజులను నివారించేందుకు, నాణ్యమైన భోజనం అందించేందుకు ఎలాంటి చర్యలుంటాయో ప్రకటించలేదని తెలిపారు. బోర్డు నిబంధనలు పాటించకుంటే కాలేజీలపై ఎలాంటి చర్యలు తీసుకుంటాయో లేవని పేర్కొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం



నవతెలంగాణ-ఘట్కేసర్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ వరమని ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. మున్సిపాల్టీకి చెందిన పవన్ లాల్‌కు శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధులు పేదలకు వరం అని, లబ్దిదారుడు పవన్ లాల్‌కు రూ. 27,500/- చెక్కును అనారోగ్య ఖర్చుల నిమిత్తం అందజేశామని తెలిపారు. మాజీ వార్డు సభ్యులు దేవేందర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షుడు కేషవపట్నం ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు బర్ల రాధాకష్ణ ముదిరాజ్ నాగభూషణం, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద అమ్మాయి పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత



నవతెలంగాణ- నాగోల్

నిరుపేద అమ్మాయి పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాసగుప్త మంగళసూత్రం, మేట్టెలు, చీర, గాజులు అందించారు. గురువారం నందిగామ మండలం అంకిరెడ్డి గూడెం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి మల్లమ్మ.. నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస గుప్తా నివాసంలో అతన్ని కలిసి.. తన కూతురు అనిత పెండ్లికి సహాయం చేసి ఆదుకోవాలని కోరింది. వెంటనే స్పందించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా వస్తు రూపంలో సాయాన్ని అందించి ఆదుకున్నారు. వీరి వెంట శేషు, రాములు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

నకిలీ ఐపీఎల్ టికెట్ల విక్రయాలు



- ఆరుగురు నిందితుల అరెస్టు
- 68 నకిలీ టికెట్ల స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో / ఉప్పల్

క్రికెట్ సీజన్ మొదలైందంటే చాలు చిన్నాపెద్దా అనే తేడాలేకుండా మ్యాచ్‌లను చూసేందుకు ఉత్సాహం చూపిస్తారు. ఇక ఐపీఎల్ మ్యాచ్‌ల గురించి చెప్పనక్కర్లేదు. ఎంత ఖరీదైనా సరేపెట్టి ఐపీఎల్ టికెట్లు కొనుగోలు చేసి మ్యాచ్‌లకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు. ఇదే అదునుగా భావించిన ఓముఠా సులువుగా డబ్బులు సంపాదించాలని ఐపీఎల్ టికెట్లను నకిలీ చేసింది. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టుచేసి వారి నుంచి 68 ఐపీఎల్ నకిలీ టికెట్లు, ఆరు సెల్‌ఫోన్లు, కంప్యూటర్, 3 అక్రిడేషన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉప్పల్ ఏసీపీ పీ.నరేష్‌రెడ్డి, సీఐ ఆర్.గోవిందారెడ్డి తెలిపిన వివరాల మేరకు నాచారంకు చెందిన కోమటిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, హిమాయత్‌నగర్‌కు చెందిన అఖిల్ అహ్మద్, రామంతాపూర్‌కు చెందిన పెగ్గిడీ మృదుల్ వంశీ, బహద్దూర్‌పురాకు చెందిన ఎండీ ఫహీం, సింగిచెర్లకు చెందిన ఇవేలీ శ్రావణ్ కుమార్, హిమాయత్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసీఫ్‌లు కలిసి ఒక ముఠాగా ఏర్పాడ్డారు. గోవర్ధన్ రెడ్డి 'యుఫోనీ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వెండర్ ఏజెన్సీ'కి సబ్‌కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈవెం ట్స్‌కు, శుభకార్యాలకు పనిచేసేందుకు వర్క్సను సరఫరా చేస్తుంటాడు. కంపెనీ ఇచ్చే యాక్సెస్ అక్రిడేషన్ బార్‌కోర్డుతో నకిలీ టికెట్లు తయారు చేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ పథకాన్ని మిగితా వారికి చెప్పడంతో అందుకు వారు అంగీకరించారు. ఆరుగురు కలిసి ఒక ముఠాగా ఏర్పడి అక్రిడెషన్లను బార్‌కోడ్‌లను సెల్‌ఫోన్‌లో కాపీ చేసి నకిలీ టికెట్లను తయారు చేసి విక్రయించారు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు ప్రత్యేక నిఘావేసి నిందితులను అరెస్టు చేశారు. నకిలీ టికెట్లు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు.

దోమల బెడదపై దృష్టి పెట్టండి



- అధికారులను ఆదేశించిన కార్పొరేటర్ చింతల అరుణ

నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లోని పలు కాలనీల్లో దోమల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి నివారణా చర్యలు చేపట్టాలని డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శానిటేషన్ ప్రోగ్రాం, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రోగ్రాంలో భాగంగా 11వ రోజైన గురువారం నాగోలులోని గ్రీన్ ఫీల్డ్ కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, శ్రీనివాస హిల్స్ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై వెంకటరమణ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో కార్పొరేటర్ పాల్గొని సమస్యలను పరిశీలించారు. సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ అరుణా సురేందర్ యాదవ్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణాలు, డ్రయినేజీ సమస్యలు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, ప్రధాన సమస్య అయిన దోమల బెడద లాంటి సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్ అలేఖ్య రెడ్డి, విద్యుత్, ఎంటమాలజీ, రాంకీ, సఫాయితో పాటు ఆయా శాఖల సిబ్బంది, వివిధ కాలనీల వాసులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచిన.. మల్‌రెడ్డి బ్రదర్స్

- బీఆర్ఎస్ బీఎన్ రెడ్డి డివిజన్ అధ్యక్షులు కటికి రెడ్డి అరవింద్ రెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

మల్‌రెడ్డి రామిరెడ్డికి స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు చేసే స్థాయి లేదని బీఎన్ రెడ్డి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కటికిరెడ్డి అరవింద్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న పాదయాత్రలో మల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఖండించారు. బీఎన్ రెడ్డి డివిజన్‌లో 90 శాతం ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, 10 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటినీ వెంటనే పూర్తిచేసి లబ్దిదారులకు అందజేస్తామన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని తెలిపారు. మల్‌రెడ్డి బ్రదర్స్ గురించి నియోజకవర్గంలో పాన్ డబ్బాల నుంచి, తోపుడు బండ్ల వ్యాపారస్తుల వరకూ ఎవరిని అడిగినా చెబుతారని విమర్శించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన నాలుగు హామీలను నెరవేర్చడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నో ఏండ్లుగా మార్నింగ్ వాక్‌తో ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేయటం సరికాదన్నారు. పార్టీలు మారడం, తల్లి లాంటి పార్టీకి వెన్నుపోటు పొడవటం మల్ రెడ్డి బ్రదర్స్‌కే సాధ్యమని ఆరోపించారు. ఎమ్మెల్యేతోనే రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం అవుతుందని, డివిజన్ ప్రజలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాధవరం నర్సింగ్ రావు, రమేష్ నాయుడు, మునగాల రాఘవేందర్, శివ శంకర్, రషీద్, మహేష్, స్వర్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం



- కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి రామ్ రెడ్డి

నవతెలంగాణ-హస్తినాపురం

ఎల్.బి నగర్ నియోజకర్గంలోని పలు డివిజన్‌లలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి సరియైన ప్రణాళిక లేదని కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ మల్ రెడ్డి రామ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో హస్తినాపురం ఈస్ట్ సిగ్నల్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి నిర్వహించిన హాత్ సే హాత్ జోడోయాత్రలో మల్‌రెడ్డి రామ్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రోడ్లు వేసి అభివద్ధి చేస్తే కనీసం ఆ రోడ్లని మరమ్మత్తు కూడా చేయలేని దీనస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయ్యాయని, ఎమ్మెల్యే గా చేసిన అభివృద్ధి పనుల పై సమీక్ష చేపట్టాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి పేద రైతుల కడుపుపై కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై బి.ఆర్.ఎస్ పార్టీ ధరల పెరుగుదల ప్రశ్నించలేకపోతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లలో అధికార పార్టీకి బుద్ధి చెబుతామని, తెలంగాణలోకాంగ్రెస్ ప్రభుత్వం రానున్నదని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాక్సుద్, మధు, మోహన్ రెడ్డి,సదాశివుడు, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాసరావు, కిషోర్ గౌడ్, సురేందర్ రెడ్డి, గణేష్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, మతిన్, రమేష్ నాయక్, రాజశేఖర్, నాగేశ్వరరావు, భాను, మంజుల రెడ్డి, సంగీత, సౌమ్య స్వర్ణ మాధవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మెన్ మామిడి భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ లోని రెడ్‌క్రాస్ హైదరాబాద్ బాల బడి పిల్లలకు సందర్శిని హోటల్ మేనేజ్‌మెంట్ సుదర్శన్, సుప్రభా దంపతులు సహృదయంతో వేసవి కాలం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకుని పిల్లలకు నెల రోజులు వరకు మజ్జిగను పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల బడి స్కూల్ టీచర్స్ నాజీయ, దుర్గా, రెడ్ క్రాస్ సిబ్బంది లక్ష్మి, వెంకట్, మహేంద్ర రెడ్డి, సత్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



- బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని బాలాజీ నగర్‌లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. పేద ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్ యాదవ్, జనరల్ సెక్రటరీ శ్రీశైలం, అడ్వైజర్స్ ధనంజయ్, నాగ చారి, బాలకృష్ణ, లక్ష్మయ్య, ఆనంద్ నాయుడు, బాషా దస్తగిరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ధర్మేందర్ కుమార్ శర్మ, సరోజ మహేందర్ రెడ్డి, మనోహర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జీహెచ్ఎంసీ డీసీ..!

- డీసీ, కంప్యూటర్ ఆపరేటర్ అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

బిల్ పాస్‌చేసేందుకు ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు జీహెచ్ఎంసీ డీసీ, కంప్యూటర్ ఆపరేటర్ అడ్డంగా దొరికిపోయారు. గురువారం ఏసీబీ డీజీ తెలిపిన వివరాల మేరకు చాంద్రయాణగుట్ట, జీహెచ్ఎంసీ సర్కిల్ 8లో సతీష్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 5వ సర్కిల్‌కు చెందిన కాంట్రాక్టర్ ఓమర్ అలీ ఖాన్‌కు చెందిన బిల్ గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. అయితే బిల్‌పాస్ చేయాలంటూ ఓమర్ అలీ ఖాన్ సతీష్‌ను సంప్రదించడంతో లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దాంతో ఓమర్ అలీ ఖాన్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనలతో ఓమర్ అలీ ఖాన్ రూ.2000లు లంచం ఇస్తుండగా అప్పటికే నిఘా వేసిన ఏసీబీ అధికారులు సతీష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే చార్మినార్ జోన్ (డీసీ) డిప్యూటీ కమిషనర్ రిచాగుప్తా సూచనల మేరకు తాను డబ్బులు తీసుకున్నట్టు ఏసీబీ అధికారులకు చెప్పడంతో డీసీని సైతం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా లంచాలు అడిగితే నేరుగా లేదా ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీజీ తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి

- సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య

నవతెలంగాణ - వనస్థలిపురం



సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజ కవర్గంలోని ఆటోనగర్‌లో మే 1 నుంచి 6వ తేదీ వరకు మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహి స్తున్నట్టు ఎల్బీనగర్ సర్కిల్ సీఐ టీయూ ప్రధాన కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారోత్సవాలను కార్మిక శక్తితో విజయవంతం చేయాలని, రోజువారి పనుల్లో నిమగ్నమై నిత్యం సమస్యలతో సతమతమవుతున్న కార్మికుల్లో ఉల్లాసాన్ని కల్పించేందుకు ఆట, పాటలతోపాటు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారం రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సాయం చేసి కార్మికుల కుటుంబాల్లో ఆనందాన్ని నింపాలన్నారు.

దేశంలో బీజేపీతోనే సమస్య

- సీపీఐ కార్యవర్గ సభ్యులు రాత్లావత్ శంకర్ నాయక్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

దేశంలో అభివృద్ధి కుంటుపడటానికి బీజేపీనే ప్రధాన కారణమని సీపీఐ కార్యవర్గ సభ్యులు రాత్లావత్ శంకర్ నాయక్ తెలిపారు. గురువారం యాకుత్ పురా నియోజకవర్గంలోని సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో 'బీజేపి కో హటావో.. దేశ్ కో బచావో' కార్యక్రమాన్ని నిర్వహించగా.. సరస్వతీ నగర్, కృష్ణా నగర్, ఇండస్ట్రీయల్ కాలనీ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ ప్రతి ఇంటి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లా డుతూ.. దేశంలో ధరలు పెరుగుదల, మతాల పేరిట రాజకీయం చేస్తున్న బీజేపీ తీరును ప్రజలకు వివరిస్తూ దేశం నుంచి బీజేపీని నామరూపం లేకుండా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఐ.ఎస్.సదన్ డివిజన్ కార్యదర్శి షేక్.మహమూద్, ఆటో యూనియన్ నాయకులు సీహెచ్ జంగయ్య, సహాయ కార్యదర్శి దశరథ్ నాయక్, అమీన, వెంకటేష్, రేష్మ, జానీ, షమ్మ, అజీం, షాబుద్దీన్ అంజీ, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో సమస్య తలెత్తకుండా చూడాలి

- కార్పొరేటర్ శ్వేతా మధుకర్

నవతెలంగాణ - సంతోష్ నగర్



ఐఎస్ సదన్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. గురువారం ఐ.ఎస్ సదన్ డివిజన్‌లోని నాగార్జున కాలనీలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో నిర్వహించిన పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌కు కార్పొరేటర్ హాజరయ్యారు. కాలనీలోని సమస్యలైన విద్యుత్ అంతరాయాలు, భూగర్భ జలాలు పునర్నిర్మాణం, కొత్త రోడ్లు, ఫుట్ పాత్.. సమస్యలను మంజూరు చేయాలని కాలనీ వాసులు కార్పొరేటర్, అధికారులను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ప్రధాన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మధుకర్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, దయాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, ప్రవీణ్, అశోక్ రెడ్డి, రాధాకృష్ణ, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ పదవుల నియామకాలు చెల్లవు

- ఎల్బీనగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి



నవతెలంగాణ -వనస్థలిపురం/హయత్‌నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని బీఎన్ రెడ్డి డివిజన్, మన్సురాబాద్ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు మంగళవారం విడుదల చేసిన నియామకాలు చెల్లవని ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసే దిశగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యూత్ జోడో బూత్ జోడో' కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి నుంచి ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువజన కార్యకర్తల పనితీరును బట్టి యువజన కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి అధ్యక్ష పదవుల నియామకాలు చేపట్టాల్సిందిగా రాష్ట్ర బాధ్యులు, జాతీయ కార్యదర్శి సురభి ద్వివేది సమక్షంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్టు చెప్పారు. నియామకాలపై యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షునిగా రాష్ట్ర అధ్యక్షునికి సంప్రదించగా, ఆయనకు కూడా అవగాహన లేదని అనుమానం వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్‌రెడ్డి రామ్‌రెడ్డిని కొందరు యువజన నాయకులు తప్పుదోవ పట్టించి ఫేక్ నియామక పత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐ క్యాంపస్‌లో "మెకానికల్, మెటీరియల్స్ ఇంజినీరింగ్, నాణ్యతలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ట్రెండ్స్ (INCOFEEQ-2K23)" అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. ఈ సదస్సును ఎర్ ప్రారంభించారు. సింగరేణి కొలీరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ డి.సత్యనారాయణరావు ప్రారంభించారు. **నవతెలంగాణ-సిటీబ్యూరో**

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కేసీఆర్

- ఎమ్మెల్యే అహ్మద్ బీన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ-సంతోష్‌నగర్

తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని మలక్ పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బీన్ అబ్దుల్లా బలాల అన్నారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులైన డ్రయినేజీ వ్యవస్థ, మంచినీరు సరఫరా, పరిశుభ్రత పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం అధికారులు, కార్పొరేటర్లు, ఓల్డ్ మలక్ పేట డివిజన్ కార్పొరేటర్ ఎండీ సైపుద్దీన్ షఫీ, జీహెచ్ఎంసీ ఈఈ, ఏఈ, సంబంధిత అధికారులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలుచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ ఆదేశం మేరకు ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ పథకాలను డివిజన్‌లోని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు ఆయా ఖర్చులను రిఫండ్ చేసే సీఎంఆర్ ఫండ్స్‌ను అందజేస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు.ఎంఐఎం ఆక్టివ్ సభ్యులు, అధ్యక్షులు, స్థానికులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

అగ్లీ బార్ - అప్నా సర్కార్.. కాంగ్రెస్ సర్కార్



- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ - ఘట్‌కేసర్

ఆరుకాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాలతో నేల రాలి అన్నదాత కష్టాల్లో ఉంటే అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు సమ్మేళనాల పేరుతో సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ విమర్శించారు. ఘట్‌కేసర్ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాచివాన్ సింగారం, చౌదరిగూడ గ్రామాల్లో గురువారం నిర్వహించిన 'హాత్ సే హాత్' జూడో యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగర శివారు ప్రాంతమైన మేడ్చల్ నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతే.. అటు మంత్రి మల్లారెడ్డి గానీ, అధికారులు కానీ వచ్చి నష్టాన్ని అంచనా వేసిన పాపాన పోలేదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పుల్లో కూరుకుపోయిన రైతన్నను రుణమాఫీతో ఆదుకుంటే, నేటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం కనీసం పంట నష్టాన్ని అంచనా వేయలేక ప్రజలను అరిగోస పెడుతుందన్నారు. రాష్ట్రంలోని రైతులనే పట్టించుకోని టీఆర్ఎస్ ప్రభుత్వం, అబ్ కీ బార్... కిసాన్ సర్కార్ నినాదంతో దేశ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, 'అగ్లీ బార్ - అప్నా సర్కార్ - కాంగ్రెస్ సర్కార్" అంటూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పొన్నం తరుణ్ గౌడ్, ఘట్‌కేసర్ మండల వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, మండల్ అధ్యక్షులు కర్రె రాజేష్, మండల్ వర్కింగ్ అధ్యక్షులు బాబు రావ్ గౌడ్, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుర్రే మహేష్, మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ పాల్గొన్నారు.

ఐవీఎఫ్ తెలంగాణ కార్యాలయాన్ని పారంభించిన నాయకులు

నవతెలంగాణ -నాగోల్



హైదరాబాద్‌లోని నారాయణగూడ కుబేర ఎస్టేట్‌లో నూతనంగా నిర్మించిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు ఐవీఎఫ్ బెనారస్ ఆనంద నిలయం బ్రోచర్ ఆవిష్కరణను ఐవీఎఫ్ చీఫ్ అడ్వయిజర్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, తదితర జాతీయ నాయకులతో కలిసి రిబ్బన్ కట్‌చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఊర్లో బడి, గుడి, అన్నదానం లాంటివి చేయడానికి ఆర్యవైశ్య సోదరులు, మహిళలు ముందుంటారని తెలిపారు. జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఐవీఎఫ్ బలోపేతం చేసేందుకు యువత, మహిళలు, నాయకులు సన్నద్ధం కావాలని అన్నారు. ఇప్పటికే ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఇంకా మరిన్ని సేవలకు ఆర్యవైశ్యులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆర్య వైశ్యులు వ్యాపారం చేయడంలో మాత్రమే కాదు, సామాజిక సేవలోనూ ముందుంటారని, ఇకముందు కూడా అలాగే ఉండాలని తెలిపారు. ప్రిలిమినరీ పాస్ అయి, ఐఎఎస్ కోసం ప్రిపేర్ అవుతున్న 26 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. రాష్ట్రంలోని 33జిల్లాల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాతనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతి గడప గడపకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సీనియర్ కార్యనిర్వాహక అధ్యక్షులు గంజి రాజమౌళి గుప్త, స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్, తెలంగాణ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, అధ్యక్షులు చందా భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు కట్ట రవికుమార్, అడ్వైజర్స్ ముస్త్యాల సత్తయ్య, గౌరిశెట్టి చంద్రయ్య, కె. మల్లికార్జున్, గెల్లి రమేష్, ప్రభాకర్, కక్కిరాల రమేష్, పురుషోత్తమ్, యూత్ వైస్ ప్రెసిడెంట్ నరేష్ గుప్త, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిల్కానగర్ డివిజన్‌కు 119 ఎలక్ట్రికల్ పోల్స్

- కార్పొరేటర్ బన్నాల

నవతెలంగాణ-ఉప్పల్



కార్పొరేటర్ బన్నాల గీతా గురువారం చిల్కానగర్ డివిజన్‌లో పర్యటించి వివిధ శ్మశానవాటికల్లో, పార్కులలో, అన్సర్వ్ ఏరియాలలో 119 ఎలక్ట్రికల్ పోల్స్ అవసరాన్ని గుర్తించి అధికారులకు ప్రతిపాదనలు పెట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అతి త్వరలో అన్ని వైకుంఠ ధామాలలో, పార్కులలో అవసరాన్ని బట్టి చిల్కానగర్ డివిజన్ లోని అన్ని ప్రాంతాలలో ఎలక్ట్రికల్ పోల్స్ తో పాటు ఎల్ఈడీ లైట్స్ దానికి సంబంధించిన వైర్లు కూడా ఏర్పాటు చేసి డివిజన్‌లోని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డివిజన్‌లో ఎక్కడా చీకటిగా లేకుండా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి కోకుండా జగన్, మైనారిటీ అధ్యక్షులు అబ్బు బాయ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, బాలు ఇస్మాయిల్, శివ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ సిబ్బంది బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీటీసీ

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్



అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన మన్మోహన్‌ను లష్కర్ గూడ ఎంపీటీసీ సీక సాయి కుమార్ గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు మన్మథకుమార్, కిషన్ నాయక్, నాయకులు నాతి ప్రసాద్, ఆర్‌కే లింగం, శ్రీకాంత్, సాయి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బంది.. భద్రత, సంక్షేమానికి పెద్దపీట

- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



నవతెలంగాణ-హయత్‌నగర్

ట్రాఫిక్ సిబ్బంది భద్రత, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలిని తట్టుకుని పనిచేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది కోసం వేసవి కాలంలో డీ హైడ్రేషన్‌ను అధిగమించడానికి రూ. 5 లక్షల విలువైన 71,250 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏసీ హెల్మెట్లను ఐదుగురు ట్రాఫిక్ సిబ్బందికి జాయింట్ సీపీ సత్యనారాయణ తో కలిసి గురువారం ఎల్బీ నగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో సీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అందుకే రూ. 3.2 కోట్ల విలువైన స్పీడ్ లేజర్ గన్లు, డిజిటల్ కెమెరాలు, ట్రాఫిక్ సేఫ్టీ పరికరాలయిన బారికేట్లు, కోన్‌లు, బొల్లార్డ్స్, అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, కిట్‌బ్యాగ్‌లు, సేఫ్టీ హెల్మెట్‌లు, మాస్కులు, రేడియం జాకెట్లు, సన్ గ్లాసెస్, గ్లోవ్స్, వాటర్ బాటిల్స్, రెయిన్ కోట్స్ వంటి కిట్ ఆర్టికల్స్ ట్రాఫిక్ సిబ్బందికి అందించడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేసవిలో ఎండల తీవ్రత నుంచి రక్షించుకునేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. సరైన నంబర్ ప్లేట్లు లేని, నకిలీ నంబర్ ప్లేట్లు కలిగి ఉన్న వాహన యాజమానుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. నకిలీ నంబర్ ప్లేట్లు కలిగి ఉన్న వాహనాల కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఎల్బీ నగర్ ట్రాఫిక్ ఏసీపీ హరి కృష్ణ, మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఇతర ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్థలాలను కేటాయించాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతీ నియోజకవర్గంలో శాసనసభ్యులకు యూనియన్ ద్వారా వినతిపత్రం సమర్పిస్తున్నామని వారు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని జర్నలిస్టులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలాలను కేటాయించేలా కృషి చేయాలని కోరారు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు, యావపురం రవి, గుమ్మడి ప్రసాద్, కిరణ్ కుమార్, యాటరాజు, అంజనేయులు, బెలిదే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రారంభించిన ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మీర్‌పేట్ హెచ్ బీ కాలని డివిజన్ ఎన్టీఆర్ నగర్ కమ్యూనిటీ హాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి వైద్య బందంతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ మధు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఐలవేని రాజు, శ్యామ్ పాత్రో, రమేష్ రాథోడ్, నాగరాజు, అరుణ్, భాను, అంజి, శ్రీను, ఉల్లెం బాలరాజు, వాసు నవీన్ గౌడ్, పూస రమేష్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, మహిళా నాయకులు మంజుల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రాబోయే కాలంలో ప్రజలు బుద్ధి చెప్పాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్



నవతెలంగాణ-నాచారం

దేశవ్యాప్తంగా బీసీ కుల జనగణన అధికారికంగా నిర్వహించాలని ప్రగతిశీల పార్టీలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమిస్తుంటే ముస్లింల రిజర్వేషన్లు తొలగిస్తానని కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్ షా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి ఎస్ బోస్ అన్నారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్, నెహ్రూ నగర్ కాలనీలలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 50 శాతం పైబడి ఉత్పత్తి కులాలకు సంబంధించిన హక్కులను, అధికారాలను కాలరాస్తూ శాశ్వతంగా బానిసత్వంలోనికి నెట్టే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం వేగంగా చేస్తున్నదన్నారు. ఈ దేశంలో జంతువులకు, వక్షాలకు లెక్కలు ఉంటాయి కానీ బీసీ ప్రజల జనగణన లెక్కలు పరిగణించకపోగా బీసీ వర్గాల ప్రజలను మనుషులుగా చూసేందుకు బీజేపీ ప్రభుత్వం అంగీకరించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కమిషన్ అమలు చేయాలని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున సామాజిక సంఘాలు, బీసీ ప్రజలు పోరాటం చేస్తుంటే ఉద్యమాలను పక్కదారి పట్టించేందుకు అయోధ్య లాంటి సమస్యలను ముందుకు తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కుట్రలకు తెర లేపే దుర్మార్గపు చరిత్ర బీజేపీ ప్రభుత్వం చేస్తుందని ధ్వజమెత్తారు. ఈ దేశంలో బీజేపీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుంటుంది తప్ప బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులు మార్చడానికి ఏనాడూ ప్రయత్నం చేయలేదని అన్నారు. ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం భారత రాజ్యాంగం కల్పించిన అధికాణ ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని, ఆయా రాష్ట్రాలు ప్రతిపాదిస్తున్న మోడీ ప్రభుత్వం ఆ బిల్లులను పక్కనపెట్టి మైనారిటీలపైకి అట్టడుగు కులాలను రెచ్చగొట్టి లబ్ది పొందాలని కుటిల రాజకీయాలను తెలంగాణ రాష్ట్రంలో తెరలేపుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, సీపీఐ ఉప్పల్ స్టీరింగ్ కమిటీ సభ్యులు సత్యప్రసాద్, నర్సింహ, నాయకులు బిక్షపతి, నర్సింగ్ రావు, వీరయ్య, శ్రీను, ఎల్లేష్, కపాకర్, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలి



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-కంటోన్మెంట్

విద్యార్థులు వేసవి సెలవుల్లో ఎంతో విలువైన సమయాన్ని వధా చేసుకోకుండా వేసవి శిబిరాలను ఉపయోగించుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. గురువారం మారేడ్‌పల్లి మున్సిపల్ గ్రౌండ్‌లో వేసవి శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో సైతం రాణిం చాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను వివిధ క్రీడలలో ప్రోత్సహించే ఆలోచనతోనే ప్రభుత్వం ప్రతీ సంవత్సరం సమ్మర్ కోచింగ్ క్యాంప్ లను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ క్యాంప్‌లో క్రికెట్, బాక్సింగ్, వాలీబాల్, ఫుట్ బాల్, స్విమ్మింగ్ తదితర క్రీడలలో అనుభవజ్ఞులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏ రంగంలో ఆసక్తి కనబరుస్తున్నారో గుర్తించి ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను సమ్మర్ కోచింగ్ క్యాంప్ లలో చేర్పించాలని కోరారు. అంతకు ముందు క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, కార్పొరేటర్ దీపిక, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీ మోహన్ రెడ్డి, స్పోర్ట్స్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

మేడే ఉత్సవాల సందర్భంగా టీఎస్ఐటీయూ, బీఆర్‌టీయూ కార్మిక సంఘాల సంయుక్తంగా రాష్ట్ర కార్యదర్శి బూరుగు మారుతి రావు ఆధ్వర్యంలో రూపొందించిన మేడే ఉత్సవాల వాల్ పోస్టర్‌ను బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికాగో నగరంలో కార్మికుల నెత్తురు చిందించిన ప్రతిఫలం, కార్మికుల హక్కులు అమలులోకి వచ్చిన దినం మేడే అని అన్నారు. అంతటి త్యాగాన్ని కార్మిక లోకం స్మరించుకోవలసిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. మేడే ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్మికుల హక్కు లు చట్టాలను గుర్తు చేసుకోవాలని అన్నారు. మేడే ఉత్సవాల్లో కార్మిక లోకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పీ నారాయణ, ఈఎస్ఐ బోర్డు డైరెక్టర్ వేముల మారయ్య, రమణ రెడ్డి , బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కుంటి కష్ణ, జీ4ఎస్ తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పర మారుతి ప్రసాద్, కార్మిక సంఘం నాయకులు సాయికుమార్, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

శాంసంగ్ స్మార్ట్ మానిటర్ ఎం8 సీరీస్

నవతెలంగాణ-హైదరాబాద్

నేటి నుండి శాంసంగ్ ఎం8 సీరీస్ ఆధునిక మోడల్ మార్కెట్ లో అందుబాటులోకి రానుంది. వినియోగదారులు ఆఫర్స్ పొందవచ్చు. లైవ్ కామర్స్ సమయంలో స్మార్ట్ మానిటర్ కొనుగోలు చేసిన వినియోగదారులు తక్షణ కార్ట్ డిస్కౌంట్ రూ.9,000లు పొందడానికి అర్హులవుతారు. ద స్మార్ట్ మానిటర్ ఎం8 సీరీస్ పీసీ - నిరంతరంగా పనిచేయడానికి తక్కువ అనుభవాన్నిచ్చే ప్రపంచంలో మొదటి స్మార్ట్ మానిటర్స్ కుటుంబానికి చెందినది. యూజర్స్ వై-ఫై ద్వారా పీసీ లేదా టీవీకి కనక్ట్ చేయకుండానే నెట్ ఫ్లిక్స్, అమేజాన్ ప్రైమ్ వీడియో, డిస్నీ ప్లస్, యాపిల్ టీవీ సహావివిధ రకాల ఓటీటీ సేవలను కూడా ఆనందించడానికి అవకాశం ఇస్తుంది. స్మార్ట్ మానిటర్ ఆధునిక మోడల్ కు కీబోర్డ్, మౌస్ కంట్రోల్ ఉన్నాయి. ఇవి యూజర్ కంటెంట్ ను సులభంగా అన్వేషించడానికి అవకాశమి స్తాయి. 4 స్టైలిష్ రంగుల్లో - వార్మ్ వైట్, సన్ సెట్ పింక్, డై లైట్ బ్లూ, స్ప్రింగ్ గ్రీన్ ఆర్గానిక్ హెర్రింగ్ బోన్ నమూనాతో, నాజూకైన అల్ట్రా-స్లిమ్ 11.39 మీమీతో, ఎంగి సీరీస్ సొగసుదనానికి కేంద్రం. స్మార్ట్ మానిటర్-ఎం8 సీరీస్ రూ. 53,999 ప్రారంభపు ధరకు విడుదలైందని ఆ సంస్థ తెలిపింది.

2లక్షల యూనిట్స్ లక్ష్యాన్ని సాధించిన కియా

నవతెలంగాణ-హైదరాబాద్

2022-23 ఆర్థిక సంవత్సరం లో అత్యధిక మార్కెట్ వాటా 7.4శాతం నమోదు చేసిన తరువాత, భారతదేశపు ప్రీమియం, అతివేగంగా పెరుగుతున్న కారు తయారీదారు, కియా ఇండియా నేటికి 95 దేశాలకు 2లక్షల ఎగుమతుల మైలురాయిని దాటిని గణనీయమైన చర్యను సాధించిందిని సంస్థ ప్రకటిం చింది. కియా ఇండియా చీఫ్ సేల్స్ అండ్ బిజినెస్ అధికారి మైయంగ్-సిక్ సోహ్న్ మాట్లాడుతూ... ఆధునిక అనంతపురంగ సదుపాయం, తయారీ గొప్పదనాన్ని తయారీ, నవ్యత, భారతదేశంలో పెట్టుబడి పె ట్టడం ద్వారా, ప్రభుత్వం కలకు తోడ్పడటం ద్వారా ప్రపంచానికి చూపించడానికి గర్విస్తున్నామన్నారు. ఇది భారతదేశం తయారీ వేదికగా, అంతర్జాతీయంగా ఎస్ యూవీలకు గల పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడానికి ఏ విధంగా సిద్ధంగా ఉందో కూడా చూపిస్తుందన్నారు. కియా సెల్టోస్‌బెస్ట్ సెల్లింగ్ ప్రోడక్ట్ నవ్యతగా ఎల్లప్పుడూ నిలిచిందన్నారు. తమ 4వ సంవత్సరంలో కూడా గెలుపు ప్రతిష్టను నిర్వహించడాన్ని కొనసాగిస్తోందన్నారు.

పెప్సీతో రైజ్ అప్, బేబీ అంటోన్న సమంత

నవతెలంగాణ-హైదరాబాద్

యువత తిరుగులేని అభిరుచులు, ఎదురులేని స్ఫూర్తిని తమ వైవిధ్యమైన కథనాలతో వ్యక్తిగతీకరించే పెప్సీ తమ నూతన బ్రాండ్ పొజిషనింగ్ రైజ్ అప్, బేబీ! కు నూతన చిత్రీకరణను విడుదల చేసింది. ఈ ప్రచారంలో నటి, యూత్ ఐకాన్, దేశవ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తి ప్రదాత, సమంత కనిపించనున్నారు. ఈ ప్రచారంతో సమంత పెప్సీ తారాలోకంలో ఒకరిగా నూతన బ్రాండ్ అంబాసిడర్ గా మారారు. ఈ ప్రచారం గురించి పెప్సీ కో ఇండియా, కేటగిరి లీడ్, పెప్సీ కోలా సౌమ్య రాథోర్ మాట్లాడు తూ... పెప్సీ ఎప్పుడూ కూడా యువతరానికి ప్రాతినిధ్యం వహిస్తుంద న్నారు. తమ గత రెండు ప్రచారాలు ద్వారా యువత సామాజిక నిబంధనల కంటే పైకి ఎదుగుతున్నప్పుడు వారి అణచివేయలేని స్ఫూర్తిని చిత్రించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రచారం గురించి సమంత మాట్లాడుతూ... తమ మనసుకు నచ్చినట్టు మహిళలు నడుచుకోవడాన్ని తాను నమ్ముతున్నాన న్నారు.

'మేడే గోడపత్రిక ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

కార్మికుల దినోత్సవం మే డే గోడ పత్రికను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల మారయ్య, సివిల్ సప్లై హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చిగుళ్ల శ్రీనివాస్ (హమాలీ శీనన్న) ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్ ను విడుదల చేసిన ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం పారిశ్రామిక వాడలకు నిలయమని అన్నారు. సంఘటిత,అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులు మేడే ఉత్సవాల్లో భాగస్వాములై శ్రమజీవుల ఐక్యత చాటాలని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో ఆటో రవాణా రంగ కార్మికులకు అదనపు టాక్స్ లను తొలగించి,ట్రాఫిక్ చలాన్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కారం చేసిన ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వమని అన్నారు. పారిశ్రామిక వాడల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన కార్మిక చట్టాలు వల్లనని అన్నారు. అన్ని వర్గాలను అక్కున చేర్చుకొని ఆదరిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలు అండదండగా నిలవాలని కోరారు. కార్మిక వాడల్లో కర్షక ప్రాంతాలలో, ఆటో అడ్డాలో, అమాలి యూనియన్లలో మేడే ఎర్రజెండా ఎగరేసి కార్మికుల యొక్క పోరాట త్యాగాలని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, పాండు నాయక్, సాయికుమార్, అశోక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేద,బడుగు,బలహీన వర్గాలకు మేలు'



నవ తెలంగాణ నేరేడ్ మెట్

కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన సంస్కరణలతో పేద బడుగు బలహీనుల వర్గాలకు ఎంతో మేలు జరిగిందని డిసిసి ప్రెసిడెంట్ మల్కాజ్గిరి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే నంది కంటి శ్రీధర్ ఆ పార్టీ ఒక్కసారి కాంగ్రెస్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశం ప్రకారం చేపట్టిన హత్ సే హాత్ జొడో అభియాన్ యాత్ర అల్వాల్ డివిజన్ హరిజన బస్తీ , ఓల్డ్ ఆల్వాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలను కలిసి స్థానికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తయారు చేసిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే యువకులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి అని అన్నారు . ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సీ సి ఎల్ యాదగిరి, పవన్, శ్రీపాల్ రెడ్డి, సంతోష్ రెడ్డి, జాజుల భాస్కర్, జాజుల హరికుమార్, శ్రీనివాస్, రాజు, మహేష్, మేరీ,పద్మ, నిర్మలతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు


'మూఢనమ్మకాలు-నేటి పాలకులు' అంశంపై క్లాసు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో "మూఢనమ్మకాలు-నేటి పాలకులు" అంశంపై క్లాసును స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు పీటీ చారి వివరించారు. మానవుడు శైశవ దశలో ఉన్నప్పుడు ఏది ఎందుకు జరుగుతుందో తెలియక ప్రతీదాన్ని దైవంగా భావించి పూజలు చేసేవారని.. అర్థం కాని వాటిని దైవానికి ఆపాదించి తమకు తోచిన కారణాలు చూపి అదే ఆచారాలుగా అలవాటు చేసుకున్నారని తెలిపారు. మతాలు ఏర్పడిన తర్వాత దానినే తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ఆయుధంగా ఉపయోగించుకున్నారన్నారు. ప్రజలను మూఢనమ్మకాల్లో ఉంచి తమపై తిరుగుబాటు చేయకుండా మౌఢ్యంలో ముంచారన్నారు. వాన వస్తే, వరదలు వస్తే, భూకంపాలు వస్తే దేవుడికి కోపం వచ్చిందని వాటికి నివారణగా యజ్ఞ యాగాదుల పేరు మోసం చేశారని చెప్పారు. నేడు కూడా పాలకులు మూఢనమ్మకాలు పెంచి పోషించటకు అంతా వేదాల్లోనే ఉన్నాయని మభ్యపెట్టడం చేస్తున్నారన్నారు. శాస్త్ర సాంకేతిక అంశాలను ఉపయోగించుకుని మూఢనమ్మకాలు వాటికి జోడించి ప్రజలను అణిచి ఉంచుతున్నారని చెప్పారు. అందుకని భారత రాజ్యాంగంలో చెప్పిన విధంగా సైంటిఫిక్ టెంపర్ ను అందరిలో కలిగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా గొడుగు యాదగిరిరావు వ్యవహరించారు. చివరగా ప్రసాద్ బాబు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమానికి కోమటి రవి, కెసిఆర్ దాస్, రాజమల్లు, ఆచార్యులు, బంగారు నర్సింగరావు, గణేష్, మహేష్, వెంకట సుబ్బయ్య, శ్రీమన్నారాయణ, నాగయ్య, వినోద, మంగ, శారద, జెన్ని, జి శివరా మకష్ణ, గోపి, సురేష్, రుక్కయ్య, శ్రీనివాసరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాలకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ చర్లపల్లిలోని తన స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని బాధితుడు గడ్డం యాదగిరి ఆరోపించారు. గురువారం చర్లపల్లి డివిజన్ ఆఫీసర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్లపల్లి గ్రామంలోని 300 సర్వే నెంబర్‌లోని 4961 గజాల భూమిని శశికాంత్, ముత్యంగౌడ్ వద్ద తాను కొనుగోలు చేశానని తెలిపారు. పక్కనే ఉన్న ఎంఆర్ శ్రీనివాస్ తన స్థలంలో అక్రమంగా కాంపౌండ్ వాల్, షెడ్ నిర్మాంచాడని తెలిపారు. అడ్డుకునేందుకు వెళ్లిన తనపై పోలీసులు కేసు నమోదు చేసి కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని ఆరోపించారు. ఎంఆర్ శ్రీనివాస్ కాంపౌండ్ వాల్ కట్టుకునేందుకు సహకరించారని తెలిపారు. తన భూమికి సంబంధించిన పత్రాలు పోలీసులు చూడలేదని వాపోయారు. తనను నిర్బంధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు.

మెరుగైన వైద్యం కోసం రూ.5 లక్షలు మంజూరు



నవతెలంగాణ-మల్కాజిగిరి

వినాయకనగర్‌కు చెందిన శ్రీనివాస్ కుమారుడు పరమేష్ రెండు కిడ్నీలు చెడిపోయాయి. దాంతో అతనికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం నిమిత్తం స్థానిక నాయకులు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు దష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్‌లో వైద్య ఖర్చుల నిమిత్తము రూ. 5 లక్షలు బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బద్దమ్ పరశురాం రెడ్డి, మల్కాజ్గిరి సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, మల్కాజిగిరి అధికార ప్రతినిధి సతిష్ కుమార్, మల్కాజ్ గిరి మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, సూరి,ఫరీద్,పేపర్ శ్రీను, కన్నా, పాషా, సాయి, పార్థసారధి, అజమ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాలలో టాయిలెట్ బ్లాక్ ఏర్పాటు



- ప్రారంభించిన ఐఏఎస్ అధికార రాహుల్ బొజ్జ

నవతెలంగాణ-కంటోన్మెంట్

విరోచ్ ఫౌండేషన్ లేడీస్ సర్కిల్ 43 సహకారంతో మహీంద్రా హిల్స్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన 28 టాయిలెట్ బ్లాక్‌ను ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విర్పో ఫౌండేషన్ లేడీస్ సర్కిల్స్ ప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాలలో, కళాశాలలో బాలికల సంక్షేమం కోసం సంస్థ పనిచేస్తుందని తెలిపారు. లేడీస్ సర్కిల్ అనేది సర్కిల్ ఇండియాలో ఒక భాగం.. ఇది సమాజానికి సేవ చేయడానికి కట్టుబడి ఉన్న జాతీయ సంస్థ అని చెప్పారు. ఎడ్యుకేట్ టు ఎన్‌లైటెన్ అనేది తమ లీడ్ ప్రాజెక్ట్, ఇది పాఠశాలలకు మౌలిక సదుపాయాల సహాయం అందించడంపై దష్టి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమం కింద తరగతి గదులు, మరుగుదొడ్లు, ఫర్నీచర్ మొదలైన సౌకర్యాలు అవసరమైన పాఠశాలలను గుర్తించి సహాయం చేస్తామన్నారు ఇందులో భాగంగానే మహేంద్ర హిల్స్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో 28 బ్లాక్ టాయిలెట్లను నిర్మించినట్టు వివరించారు. కార్యక్రమంలో సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధికారులు చంద్రకాంత్ రెడ్డి, రామ్, లక్ష్మణ్, కార్యదర్శి కే సంయుక్త కార్యదర్శి కే. శారద, రిజినల్ కో-ఆర్డినేటర్ నాగ కళ్యాణి, ప్రిన్సిపల్ వినోలా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా జనవిజ్ఞాన వేదిక ఉచిత వేసవి శిక్షణ



నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో రెండో రోజు పర్సనాలిటీ డెవలప్మెంట్ తరగతిని రాదేశం లేఖ బోధించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిజికల్ గా డెవలప్మెంట్ అవ్వడమే కాదు తనకు క్లాస్ రూమ్ లో బోధిస్తున్న వివిధ పాఠ్యాంశాలపై, సామాజిక అంశాలపై, శాస్త్రీయ అవగాహన పెంచుకోవడమే పర్సనాలిటీ డెవలప్మెంట్ అని వారన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో పాటు పాఠశాల తరగతుల్లో బోధించే వివిధ పాఠ్యాంశాలపై పరిపూర్ణమైన అవగాహన పెంచుకొని సామాజికంగా తన తల్లిదండ్రులు, గురువులతో సమాజంలో ఉన్న ఇతరులతో గౌరవభావంతో మెలుగుతూ, ఉన్నతమైన విలువలను పాటిస్తూ తన లక్ష్యాలను చేరుకోవాలని వారు అన్నారు. రెండో రోజు ఈ వేసవి శిక్షణ శిబిరంలో కాప్రా మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, సీహెచ్ ప్రభాకర్ , ఉపాధ్యక్షులు శివ శంకర్ రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న సీసీ రోడ్డును కాపాడాలి

నవతెలంగాణ-కాప్రా

శివ సాయి నగర్‌లో కబ్జాకు గురవుతున్న సీసీ రోడ్డును కాపాడాలని డిమాండ్ చేస్తూ శివ సాయి నగర్ కాలనీవాసుల ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

భగీరథ మహర్ష జయంతి సందర్భంగా పలువురి నివాళులు

నవతెలంగాణ-బంజారాహిల్స్



భగీరథ మహర్ష జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు పూలమాల వేసి వారికి నివాళులు అర్పించారు. డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షులు డాక్టర్ సి.రోహిన్ రెడ్డి, ఖైరతాబాద్ సీనియర్ నాయకులు పల్లపు గోవర్ధన్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కేసీఆర్ ఫౌండేషన్ అధినేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి నివాళ్లర్పించడంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కాటూరి రమేష్, అధికార బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల సూత్ర ఎగ్జిబిషన్ షురూ..

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఇండియన్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ సూత్ర మూడు రోజులు ఎగ్జిబిషన్ బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణలో గురువారం ప్రముఖ నటి బిగ్ బాస్ ఫేమ్ ఇనయా సుల్తానా, మోడల్స్ పూజ, లక్ష్మి, పావని, హారిక, కిరణ్మయి, శ్రావణి లాంఛనంగా ప్రారంభించారు. మోనికా మధ్యన్, ఉమేష్ మధ్యన్ నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన గురువారం నుంచి ఆదివారం వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు హైదరాబాద్, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా ఈ ఫ్యాషన్ వస్త్ర కళాకారులు, స్వతంత్ర డిజైనర్లు కలిసి తీసుకువచ్చే ఒక వేదికను అభివృద్ధి చేయడానికి ప్రముఖ జ్యువెలర్స్, ఫ్యాషన్ డిజైనర్లు, చేతి వృత్తుల వారికి ఇంటి దగ్గరే ఉండి డిజైన్ చేసేవారికి ప్రత్యేక ఉద్యోగ కల్పన ధ్యేయంగా తాము ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పండుగలా మే డే నిర్వహిస్తాం

- వారం రోజులపాటు ఘనంగా వారోత్సవాలు
- కళారూపాలు, డప్పు వాయిద్యాలతో ఆటాపాటా
- మహా నాయకుల కటౌట్లతో భారీ ప్రదర్శన
- మెరుపు మయంకానున్న చౌరస్తాలు, ప్రధాన రోడ్లు
- సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ కార్మిక దినోత్సవం 'మే డే'ను వారం రోజులపాటు పండుగలా నిర్వహిస్తామని సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి తెలిపారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీఐటీయూ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుమారస్వామి వివరాలను వెల్లడించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మే 1న ఉదయం



10 గంటలకు వైఎంసీఏ చౌరస్తా నారాయణగూడ నుంచి ముషీరాబాద్ చౌరస్తా వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పులతో ఆటాపాటా, మహా నాయకుల కటౌట్లతో ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ పరిధిలో ఉన్న అన్ని యూనియన్ల అడ్డాల్లో ఉదయం 9 గంటల్లోపు జెండా ఆవిష్కరణలు పూర్తి చేసుకుని 10 గంటల కల్లా ఈ ప్రదర్శనలో పాల్గొనాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. 137 ఏండ్ల క్రితం కార్మికులు సాగించిన వీరోచిత పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి కొన్ని హక్కులు దక్కాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఏడు రోజుల వరకు నగర వ్యాప్తంగా 8 ప్రాంతాల్లో 'మేడే'నీ వారోత్సవంగా జరపాలనీ, ప్రత్యామ్నాయ సంస్కృతిని అమలు చేయాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘాలు నగరవ్యాప్తంగా బస్తీల్లో మేడే జెండాలు ఆవిష్కరించాలన్నారు. మేడే ఉత్సవ నిర్వహణ కమిటీల ఆధ్వర్యంలో జరిగే ఆట-పాటల పోటీలు, కవి సమ్మేళనాలు, వివిధ కళారూపాలతో సాంస్కృతిక కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో సహా అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని మే డే పండుగను ఘనంగా నిర్వహించాలని కోరారు. పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పని చేసే ప్రతి కార్మికుడూ పాల్గొని మేడే ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కోశాధికారి ఆర్.వాణి, నగర కమిటీ సభ్యులు పి.పుల్లారావు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలపై మేడే స్ఫూర్తితో పోరాడుదాం

- సీఐటీయూ నాయకులు పి.నాగేశ్వర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలపై మేడే స్ఫూర్తితో పోరాడుదాం అని సీఐటీయూ నాయకులు పి.నాగేశ్వర్, కె.జంగయ్య అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా గురువారం చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో కార్మికుల ఆటల పోటీలను సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, గోషామహల్ నియోజకవర్గ కన్వీనర్ కె.జంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తొలగించి కోర్డుల, చట్టసభల్లో రక్షణలేని 3 లేబర్ చట్టాలను తెచ్చారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వల్ల అసంఘటిత కార్మికులకు పనులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్కువ వేతనాలతో వలస కార్మికులు శ్రమను ప్రయివేటు యాజమాన్యాలు దోచుకుంటున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు జీవనం గడపలేక కార్మికులు అప్పులపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడే వారోత్సవాల సందర్భంగా వారం రోజులపాటు కార్మికులకు ఆటలు, పాటలు సహపంక్తి భోజనాలు, విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. చిన్నప్పటి ఆటలను గుర్తు చేసుకుని కార్మికులు ఉత్సాహంగా కబడ్డీ, కుస్తీ, రన్నింగ్ ఆటలు ఆడారు. క్రీడలు కార్మికుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులను నాయకులు అభినందించారు. విజేతలకు బహుమతులను మే డే రోజున జరిగే సభలో అందిస్తామని తెలిపారు.

'సోషల్ థాట్ ఆఫ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కారల్ మార్క్స్'పై ఉపన్యాసం



నవతెలంగాణ-ఓయూ

ఆర్ట్స్ కాలేజ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్ కాలేజీలో "సోషల్ థాట్ ఆఫ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కారల్ మార్క్స్" అనే అంశంపై ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.సి.గణేష్ అధ్యక్షతన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రొ.కంచె ఐలయ్య హాజరై మాట్లాడారు. అంబేద్కర్ పుట్టిన రోజును ప్రపంచ విజ్ఞాన దినంగా ఇటీవల ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని గుర్తు చేశారు. మార్క్సిజం, అంబేద్కరిజంపై వారు తులనాత్మకంగా వివరించారు. విద్యార్థులు నిరంతరం చదవాలనీ, రాయాలనీ, రాయడంతోపాటు వివిధ రకాల ఆలోచనలపై, కలం ద్వారా పోరాటం చేయాలన్నారు. పేదరికం నుంచి వచ్చిన తాను నిరంతరం తనను తాను అన్వేషించుకుంటూ సామాజిక అధ్యయనాలకు, పరిశోధనలకు అంకితం చేసుకున్నానని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్ మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరూ వివిధ రకాల వాదాల పట్ల అవగాహన ఏర్పరచుకుని జీవితంలో రాబోయే విషయాలను సునిసితంగా పరిశీలించాలని కోరారు. సభ ప్రారంభానికి ముందు కార్యక్రమాన్ని ఉద్దేశాన్ని, కాన్సెప్ట్ నోటును అంబేద్కర్ రీసర్చ్ సెంటర్ డైరెక్టర్ కొండ నాగేశ్వర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కమిటీ చైర్మన్ హెడ్ ప్రొ. కాశీం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ, డాక్టర్ బాలు నాయక్, డాక్టర్ స్వాతి, డాక్టర్ సిఎస్ స్వాతి, ప్రొ.చంద్రునాయక్, ప్రొ.అంజయ్య, ప్రొ.రాములు, ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ పాల్గొన్నారు.



హైదరాబాద్ స్వచ్ఛమైన నగరం

- విద్యార్థులు లక్ష్యాల సాధన దిశగా పయనించాలి
- సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల
- ఓయూలో 24వ జాతీయ ఎడ్యుకేషన్ ఫిల్మ్ ఫెస్టివల్

నవతెలంగాణ-ఓయూ

ముత్యాలు, బిర్యానికే కాకుండా హైదరాబాద్ మహానగరం స్వచ్ఛమైన ప్రేమకు మారుపేరని ప్రఖ్యాత తెలుగు సినీ దర్శకుడు, ఓయూ పూర్వ విద్యార్థి శేఖర్ కమ్ముల అన్నారు. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ సీఈసీ, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ హైదరాబాద్ ఓయూలో తొలిసారిగా నిర్వహిస్తున్న 24వ జాతీయ ఎడ్యుకేషనల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో శేఖర్ కమ్ముల పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు సీఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జగత్ భూషణ్ నడ్డా, ఓయూ వీసీ ప్రొ.రవిందర్‌తో కలిసి ఠాగూర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. దివంగత ప్రధాని పీవీ నరసింహ్మారావు, అంతరిక్షంలో అడుగు పెట్టిన తొలి భారతీయుడు రాకేశ్ శర్మ, మహ్మద్ అజారుద్దీన్, హర్షా భోగ్లే, శ్యామ్ బెనగల్ లాంటి ఎంతో మంది గొప్ప వ్యక్తులను అందించిన ఉస్మానియాలో సీఈసీ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. సార్వత్రిక, దీర్ఘకాలిక ఆకర్షణతో సినిమాలు నిర్మించటం, వీక్షకుల మనసుల్లో చెరగని ముద్రలు వేయటానికి చలనచిత్ర నిర్మాతలు సమాజానికి బాధ్యత వహిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా విద్యారంగ చలనచిత్ర నిర్మాతలను ప్రోత్సహించటంలో సీఈసీ యూజీసీ చేస్తున్న కృషిని ప్రశంసించారు. విద్యార్థులు, యువత తాము నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా ఫోకస్ చేయాలని పిలుపునిచ్చారు. మూడ్రోజుల పాటు ఓయూలో జరిగే డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్‌ను విద్యార్థులు, అధ్యాపకులు విజయవంతం చేయాలన్నారు. సీఈసీ డైరెక్టర్ ప్రొ. జగత్ భూషణ్ నడ్డా మాట్లాడుతూ.. 70 ఏండ్ల స్వతంత్ర భారత్‌లో విద్యార్థుల నమోదులో స్థూల జాతీయ సగటు కేవలం 27 శాతమేనని చెప్పారు. రానున్న పన్నెండేండ్లలో మరో 23శాతం విద్యార్థుల నమోదును పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ప్రతిష్టాత్మక 24వ, సీఐసీ, యూజీసీ ఎడ్యుకేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించే అవకాశాన్ని ఓయూకు ఇచ్చిన ప్రొ.జెబి నడ్డాకు ఓయూ వీసీ రవిందర్ కృతజ్ఞతలు తెలిపారు. SWYAM - MOOCs & NPTEL ప్లాట్‌ఫారమ్‌లలో అందించే కోర్సుల నుంచి విద్యార్థులు ప్రయోజనం పొందాలని ఆకాంక్షించారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని, హైదరాబాదీ బిర్యానీతో ఆతిథ్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. సీఐసీ అదనపు డైరెక్టర్ డాక్టర్ సునిల్ మెహ్రూ మాట్లాడుతూ.. ఎడ్యుకేషనల్ వీడియో ప్రొడక్షన్ రంగంలో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ప్రోత్సహించడానికి 1988 నుంచి ఎడ్యుకేషనల్ వీడియో కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిల్మ్ ఫెస్టివల్‌కు మొత్తం 193 ఎంట్రీలు రాగా, 13 సినిమాలు అవార్డుకు ఎంపికయ్యాయని వివరించారు. 12 ఏండ్లలోపు వారి ప్రశంసనీయమైన ప్రయత్నాలకు 14 సినిమాలు సైటేషన్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. అంతకు ముందు స్వాగతోపన్యాసం చేసిన ఓయూ ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్ ఈఎంఆర్సీ డైరెక్టర్.. ఈ అవకాశం కల్పించిన సీఈసీ, ఓయూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన ప్రొ. ప్యాట్రిక్ ఫిల్మ్ ఫెస్టివల్ విజయవంతం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రఘుపతి, ప్రొ.శ్రీరాములు, ప్రొ.మల్లేశం, ప్రొ.మంగు, ప్రొ.శ్రీనివాసులు సహా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్, బీఓఎస్‌లు, ఆయా విభాగాల డైరెక్టర్లు, బోధన, బోధనేతర సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొద్దు నిద్రలో మోడీ సర్కార్

- సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



మహిళలకు రోజు రోజుకూ రక్షణ లేకుండా పోతుందనీ, దేశంలో హత్యలు, లైంగిక దాడులు పెరిగిపోతున్నా మోడీ సర్కార్ మొద్దు నిద్రలో ఉందని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి విమర్శించారు. 'బీజేపీ హటావో దేశ్ బచావో' అనే నినాదంతో గురువారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో ప్రజలకు కరపత్రాలు పంచుతూ బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాయాదేవి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జాతీయ నేర నమోదు బ్యూరో తెలిపినప్పటికీ వీటిని అరికట్టడంలో మోడీ సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రణాళిక ప్రకారం మహిళలపై దాడులు, అణిచివేత, వివక్ష కొనసాగుతుందన్నారు. బిల్కిస్ భానో కేసులో నేరస్తులుగా ఉన్న వారిని నిబంధనలకు విరుద్ధంగా జైలు నుంచి విడుదల చేయటం అనంతరం వారికి బీజేపీ నాయకులు సన్మానాలు చేయటం అత్యంత దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు బాధిత కుటుంబాలను అభద్రతా భావానికి గురిచేసి భయాందోళన కలిగించేలా ఉన్నాయనీ, ఉత్తరప్రదేశ్‌లో దళిత మహిళపై లైంగిక దాడి, హత్య చేసి జైలు నుంచి విడుదలైన నిందితులు బాధిత కుటుంబాలను కేసును వాపస్ తీసుకోవాలని బెదిరించటం విననని బాధిత కుటుంబాల ఇండ్లను కూలగొట్టడం లాంటి ఘటనలు జరుగుతున్నా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. పైగా నిందితులు మరిన్ని దాడులు చేసేలా ప్రభుత్వాలు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. నరోడా పటియాలో మహిళలపై హత్యలు, లైంగికదాడులు చేసిన బాబు బజరంగిపై ప్రత్యేక కోర్టు విచారణకు సంబంధించి గుజరాత్ ప్రభుత్వం సరైన ఆధారాలు ఇవ్వకపోవడం మూలంగానే నిందితులంతా విడుదలయ్యారని గుర్తు చేశారు. గతంలో హంతకులు బాహాటంగానే ముస్లీం మహిళలను చంపడం గర్వంగా ఉందని ప్రకటించినప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు ఎందుకు వెనకడుగు వేస్తున్నాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా పౌర సమాజం మోడీ ప్రభుత్వం మహిళలపై చేపిస్తున్న దాడులను ప్రజా ఉద్యమాలు చేసి ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు ఆర్.మల్లేష్, కాంపల్లి శ్రీనివాస్, కొమురెల్లి బాబు, జంగయ్య, లతీఫ్, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి గ్యార నరేష్, ఆఫీస్ బేరర్స్ కల్యాణ్ పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రకు ప్రజల నీరాజనం

- మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు

నవతెలంగాణ-అంబర్‌పేట



హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రకు ప్రజల నీరాజనం పలుకుతున్నారని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త నాయకులు కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు అన్నారు. గురువారం హాత్ సే హాత్ జోడో యాత్ర లో భాగంగా ఆర్ లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రకి ముఖ్య అతిథిగా వీహెచ్ హనుమంతరావు హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినంక రెండు కోట్ల ఉద్యోగాలు ప్రతి ఏటా భర్తీ చేస్తానని చెప్పి 9 సంవత్సరాలలో రెండు లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని కేవలం మతం కులం మధ్య చిచ్చులు పెడుతూ బబ్బుం గాడుపుతున్నారని విమర్శించారు. రాబోయే రోజులో కేంద్రంలోని రాష్ట్రంలోని అధికారంలో కి వచ్చే విధంగా ప్రతి ఒక్కరు కష్టపడాలని సూచించారు. అనంతరం కాచిగూడ లోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిణి రెడ్డి, శంభుల శ్రీకాంత్ గౌడ్, పోలినేని రామ్మోహన్ రావు, వేణుగోపాల్, రమేష్ బాబు,ఫరీద్, గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సెట్విన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-ఓయూ

స్కూల్స్, కాలేజీలకు సెలవుల సందర్భంగా సీతాఫల్ మండిలోని సెట్విన్ కేంద్రంలో వివిధ శిక్షణా కార్యకలాపాలను ముమ్మరం చేశామనీ, సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు ఈ సెట్విన్ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సెట్విన్ కేంద్రం కార్యకలపాలను అయన తనిఖీ చేశారు. సిబ్బంది, శిక్షణకు వచ్చిన వారితో సదుపాయాలపై ఆరా తీశారు. 2021 సెప్టెంబరులో సీతాఫల్‌మండి సెట్విన్ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభించామనీ, ఇప్పటి వరకు 16 వందల మందికిపైగా ఔత్సాహికులకు వివిధ అంశాల్లో శిక్షణను కల్పించామని అయన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యూటీషన్, కంప్యూటర్, సీసీ టీవీ, మొబైల్ రిపేర్, హెూటల్ మేనేజ్మెంట్, టైలరింగ్, ఫాషన్ డిజైనింగ్ తదితర అంశాల్లో ఈ కేంద్రంలో నిపుణులైన శిక్షకుల ద్వారా ఔత్సాహికులకు శిక్షణకు అవకాశం కల్పిస్తున్నామని పద్మారావు గౌడ్ తెలిపారు. వివిధ ఆధునాతన సదుపాయాలు, అన్ని వనరులను తాము సమకూర్చి ఏర్పాటు చేసిన సెట్విన్ శిక్షణా కేంద్రం కార్యకలాపాల పట్ల ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని పద్మారావు గౌడ్ వివరించారు. స్వల్ప కాలిక, దీర్ఘ కలిక కోర్సులు కుడా ఉన్నాయనీ, వివిధ ఉద్యోగాలు, స్వయం ఉపాధికి సైతం ఈ కేంద్రంలో అందించే శిక్షణ ఉపకరిస్తోందని తెలిపారు. ఈ కేంద్రం కార్యకలాపాలను వినియోగించుకుని తమ జీవితాల్లో రాణించాలని పద్మారావు గౌడ్ సూచించారు. వివరాలకు సితాఫల్‌మండీ సెట్విన్ కేంద్రం కో-ఆర్డినేటర్ నవీన్, సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించవచ్చు అని తెలిపారు.

హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.చెన్నయ్య అన్నారు. ఈ నెల 29వ తేదీన లేబర్ కమిషనర్ ఆఫీస్ ఎదుట హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ధర్నా పోస్టర్‌ను కిషన్‌గంజ్, మహారాజ్ గంజ్, హమాలీ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యలను పరిశీలించడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదన్నారు. వెంటనే సమాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) గోషామహల్ జోన్ సీఐటీయూ నాయకులు పి.నాగేశ్వర్, కె.జంగయ్య, మహరాజ్ గంజ్, ముక్తార్ గంజ్, హమాలీ నాయకులు సాయిలు, పి.కుర్మయ్య, సంతోష్, బాల్‌రాజు, అశోక్, సిద్దులు, సంతు శ్రీను, మహబూబ్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మే 5 నుంచి 20 వరకు తెలంగాణ బాలోత్సవం ఉచిత సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-ముషీరాబాద్



తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపు-2023 మే 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలంగాణ బాలోత్సవం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్.సోమయ్య వెల్లడించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమ్మర్ క్యాంపు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం తెలంగాణ బాలోత్సవం ఉచితంగా నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంపులో పిల్లల రోజు వారి కార్యక్రమాలకు భిన్నంగా సరదాగా ఆడుతూ, పాడుతూ సృజనాత్మకంగా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా శిక్షణలు, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలతో పాటు పేపర్ క్రాఫ్ట్ డ్రాయింగ్ పెయింటింగ్, తెలుగు, ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యతపై ప్రాథమిక శిక్షణ, ఇండోర్ గేమ్స్‌లకు నాటికలు, శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు శిక్షణలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల యాజమాన్యం సహకరించాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం 9490098343, 9490098676 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుజావతి, గుమ్మడి రాజు, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-అంబర్‌పేట



బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా సీనియర్ నాయకురలు గుండ్రాతి శారదాగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ్ కా నేత కేసీఆర్ అబ్ కీ బార్ కిసాన్ సర్కార్, కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు నేడు దేశం అనుసరిస్తుందన్నారు. కులం మతం మీద బీజేపీ దాడి చేస్తుందనీ, అది తెలంగాణాలో నడవదు అన్నారు. త్వరలో రానున్న ఎన్నికల్లో బీజేపీ తెలంగాణాలో ఒక్క సీట్ కూడా గెలవలేదన్నారు. దేశం నేడు కేసీఆర్ కోసం చూస్తుందనీ, ప్రజాస్వామ్య పరిపాలన కోరుకుంటున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సునీత, సంధ్య చంద్రకళ, శోభా, ప్రతిభ, సక్కుబాయి, కె.లక్ష్మి, లక్ష్మి బాయి స్రవంతి, జానకి, పి.లక్ష్మి పద్మ బాలమణి, రజిత, ఎల్లమ్మ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అనుభవ కేంద్రాన్ని ప్రారంభించిన సన్‌స్టోన్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



భారతదేశంలోని ఉన్నత విద్యా సేవలను అందించే ప్రముఖ సంస్థల్లో ఒకటైన సన్‌స్టోన్ హైదరాబాద్‌లో తన అనుభవ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా తన ఆన్-గ్రౌండ్ ఉనికిని విస్తరించిందని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు అంకుర్ జైన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేంద్రం విద్యార్థులకు వారి భవిష్యత్ గురించి సమాచారం అందుకుని తగిన నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించేలా, వ్యక్తిగతీకరించిన కెరీర్ కౌన్సెలింగ్ అనుభవాన్ని అందించడానికి రూపొందిందన్నారు. తెలంగాణలోని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌ను అందించడం, విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గించడాన్ని ఈ అనుభవ కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. హైదరాబాద్‌లో అనుభవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నందుకు తమకు సంతోషంగా ఉందన్నారు. నిర్ణయాత్మక సామర్థ్యాలతో విద్యార్థులకు వారి భవిష్యత్తు గురించిన సాధికారత కల్పించడానికి తమ కేంద్రం సిద్ధంగా ఉందనీ, తద్వారా వారు విజయవంతమైన మార్గాన్ని ఎంచుకోవడానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులకు వారి వృత్తిపరమైన అభివృద్ధి మార్గాలను సూచించడంలో సమగ్ర తోడ్పాటు అందిస్తుందనీ, కేంద్రం అందించే సేవల్లో ఉద్యోగ శోధన వ్యూహాలు, రెజ్యూమె రాయడం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు అలవర్చడం వంటివి ఉంటాయనీ, విద్యార్థులు ఎంచుకున్న కెరీర్‌లో విజయవంతం కావడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను తమ సంస్థ అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ హెడ్‌గా శ్రీను నాయక్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం టెక్నాలజీ కళాశాల కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ప్రొ.సపావట్ శ్రీను నాయక్ నియమితులయ్యారు. ఆయన గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో జనరల్ వార్డెన్‌గా, ఆడిషిన్ చీఫ్ వార్డెన్ గా పని చేశారు. ప్రస్తుతం ఫార్మా డీ బిఓఎస్‌గా పని చేస్తున్నారు. గతంలో వరంగల్ నీట్‌లో ఆరేండ్లపాటు అసిస్టెంట్ ప్రొపెసర్‌గా పనిచేసి 2013 నుంచి ఓయూ టెక్నాలజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. విభాగం ఉన్నతికి విద్యార్థుల ఉపాధికి కృషి చేస్తానని శ్రీను నాయక్ చెప్పారు. శ్రీను నాయక్‌ను గురువారం ఔట అధ్యక్షుడు ప్రొ.మనోహర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు, అధ్యాపకులు రమేష్, బస్వరావు, హాయవదన, ప్రభాకర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, తలారి గంగాధర్, లక్ష్మారెడ్డి, రామచందర్, సోమేశ్వర్, విజయ్ కుమార్, రాజు పాడ్యా, శ్రీను నాయక్ శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.



పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలనీ, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ దృష్టి సారించాలని అని బాగ్ అంబర్ పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని నందనవనం, బతుకమ్మకుంటలో వర్షపు నీటి పైపులైన్ పూడికతీత పనులను కార్పొరేటర్ పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా వర్షపునీటి కాలువలను పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తొలగించిన మట్టిని వెంటనే తొలగించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాగ్ అంబర్ పేట్ డివిజన్ అధ్యక్షులు చుక్క జగన్, నాయకులు మిరియాల శ్రీనివాస్, బాలకృష్ణగౌడ్, గౌతమ్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ పోలీస్ స్టేషన్ సీఐగా వై.రామకృష్ణ



నవతెలంగాణ- దుండిగల్

గత రెండు సంవత్సరాల పైగా దుండిగల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అధికారి బదిలీ కావడంతో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ వై. రామకృష్ణ గురువారం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పదవి భాధ్యతలు స్వీకరించారు..ఇదివరకు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో డిఐగా విధులు నిర్వహించారు. అనంతరం జరిగన కార్యక్రమంలో బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అయనకు పలువురు పోలీస్ సిబ్బంది పూల మాలలతో ఘనంగా గౌరవ వందనం చేశారు.

మేడేను విజయవంతం చేయాలి: బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

నవతెలంగాణ-మేడ్చల్

బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని బీఆర్ టియూ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ తెలిపారు.గురువారం ఆయన ఆధ్వర్యంలో మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మేడే ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారుఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల బీఆర్ టీ యూ అధ్యక్షులు పరమేష్ ముదిరాజ్,మేడ్చల్ పట్టణ స్టాండ్ కమిటీ అధ్యక్షులు మహేష్ ముదిరాజ్,కార్మికులు కాలేష్, శంకర్, సంతేజ,సాయి,సర్వర్,రమేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.



సూర్యనగర్‌లో ఎమ్మెల్యే కె.పి ప్రగతి యాత్ర

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధిలో "ప్రగతి యాత్ర"లో భాగంగా 52వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా సూర్య నగర్ లో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ తో కలిసి పాదయాత్ర చేస్తూ... పూర్తి చేసిన అభివద్ధి పనులు పరిశీలించి, మిగిలి ఉన్న డ్రయినేజీ సీసీ రోడ్డు సమస్యను తెలుసుకున్నారు. కాగా ప్రజలకు అసౌకర్యం లేకుండా వెంటనే భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని అక్కడే ఉన్న అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య, మధుకర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సురేష్, శివయ్య, అశోక్ గౌడ్, ఉదయ్ రాజ్ గౌడ్, భరత్, శ్రావణ్, కిరణ్, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎనిమల్ కేర్ సెంటర్‌ను తనఖీ చేసిన కార్పొరేటర్



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ లో గల, ఎనిమల్ కేర్ సెంటర్ ను తనిఖీ చేసి వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రక్రియను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు, ఈ ఎనిమల్ కేర్ సెంటర్ లో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి వాటిని వేరువేరు కెనాల్స్‌లో పెట్టి నాలుగైదు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచి వదిలిపెడు తున్నారన్నారు. ఎనిమల్ కేర్ సెంటర్ ను పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. అలాగే ఇటీవల వీధి కుక్కల వల్ల జరిగిన దురదృష్టకర సంఘటనలను దృష్టిలో పెట్టుకొని సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ సుగునందన్ రెడ్డి, డాక్టర్ లింగ స్వామి, మ్యానేజర్ రోహిత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు షౌకత్ అలీ మున్నా, మోజెస్, పోశెట్టిగౌడ్, జనయ్య, తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రజాస్వామికంగా పార్లమెంట్ మెంబర్ తొలగించినందుకు నిరసనగా రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో గురువారం గాంధీభవన్లో సత్యాగ్రహ దీక్ష చేపట్టడం జరిగింది. ఈ దీక్షలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ అధ్యక్షులు మీనాక్షి నటరాజన్ తో సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి.తదితరులు పాల్గన్నారు.



తెలంగాణ భవన్ లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన గురువారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్,మంత్రి,మాల్లా రెడ్డి,ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలతో కలిసి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొన్నారు.

- నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - కూకట్‌పల్లి

భగీరథ మహర్షి జన్మదినం సందర్భంగా సగర సంఘం జగద్గిరిగుట్ట ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, జేఎన్టీయూ ప్రిన్సిపల్ జయలక్ష్మి పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో సగరుల కుల గురువు భగీరథ మహర్షికి పూలమాలలువేశారు.రంగారావు సగర సంఘం సభ్యులతో కలిసి, సగరుల కుటుంబానికి సంబంధించిన అస్కాని జయలక్ష్మి ఎంతో కష్టపడి జేఎన్టీయూ ప్రిన్సిపల్ గా అయినందుకు వారిని సన్మానించడం జరిగింది, అనంతరం సగరుల సంబంధించిన కేపీ దివ్య, వి సింధుజ, బి రూపిక సాగర్, లు ఎంబిబిఎస్ పూర్తి చేసుకున్నందుకు వారికి రంగారావు, జయలక్ష్మి సగర సంఘం సభ్యులతో కలిసి సత్కరించారు,ఈ సందర్భంగా రంగారావు, జయలక్ష్మి లు మాట్లాడుతూ, సగర సంఘం జగద్గిరిగుట్ట వారు వాళ్ళ కులగురువు భగీరథ మహర్షి జన్మదిన వేడుకలు చాలా వైభవంగా చేశారని సగరులు కుటుంబాలలో చదువుకున్నటువంటి విద్యార్థులను సన్మానించడం మంచి కార్యక్రమము అని, సగరులు అందరూ ఐక్యంగా ఉండి సగరులతోపాటు సమాజంలో బీద వాళ్ళు ఎవరైనా ఉంటే వీలైనంతవరకు ఆదుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవరెడ్డి , సగర సంగం జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ సాగర్, రాములు సాగర్, భీమయ్య సాగర్, రా%శీ%సాగర్, రాములు,సత్యనారాయణ, నరసింహ సాగర్, రామకష్ణ, కొండయ్య ,సుదర్శన్ సాగర్, చంద్రమోహన్ సాగర్, రాము సాగర్, శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.



కనబడుట లేదు



పేరు : ఎస్. సత్యనారాయణ

వయస్సు : 65 సం॥లు

ఎత్తు : 5.4 అంగుళాలు, ఛామన చాయ (బక్కపల్చని)

ఇతను జవహర్ నగర్ ఎరియాలో ఇంటి నుండి 14.04.2023 రోజున ఇంటి నుండి బయటకు వెళ్లిపోయినాడు. ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఇతను బయటకు వెళ్లేటప్పుడు లైట్ క్రీమ్ కలర్ చొక్క, లైట్ గ్రే కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కాస్త మతి స్థిమితములేనట్లు ఉన్నది. కావున ఎవరికైనా కనబడినచో ఈ నంబరుకు సమాచారం ఇవ్వ గలరు.

9948526597

ప్రమాదభరితంగా మ్యాన్ హెూల్

పట్టించుకోని అధికారులు - ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట.

అధికారుల నిర్లక్ష్యం ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం బాటసారుల, వాహనదారుల పాలిట శాపంగా మారింది. చింతల్ - చంద్ర నగర్ ప్రధాన రహదారి మధ్యలో మ్యాన్ హెూల్ కుంచించుకుపోయి నెలరోజులు గడుస్తున్న కూడా ఏ ఒక్కరు పట్టించుకున్న పాపాన పోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్న కూడా కనీసం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షంలో మ్యాన్ హెూల్ వద్ద వర్షపు నీరు స్తంభించిపోయి ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని పరిసర ప్రాంతాల వ్యాపార సముదాయాల వారు నవ తెలంగాణతో వాపోయారు. అధికార పార్టీల నాయకులు పాదయాత్రలు మొక్కుబడిగా చేస్తూ ఆయారాం-గయారాం అన్నట్టుగా పలకరించి ఫోటోలకు ఫోజులు ఇచ్చుకుని పోతారని నాయకుల తీరుకు నిదర్శంగా స్థానిక బస్తీవాసులు విమర్శంచడం జరగింది.



ఘనంగా వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి, గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా ఆదర్శనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, తోపాటు కమిటీ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలను వేద పండితులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. భక్తులకు, చిన్నారులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షురాలు ఎం.దుర్గ,కార్యదర్శి వి. ఆంజనేయులు, కోశాధికారి కే .నాగభూషణం, డైరెక్టర్లు నాగదేశి రవికుమార్ ,పివిఎల్ నాం చారమ్మ, ఎస్.చంద్రశేఖర్ ,సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కోటేశ్వరరావు, నారాయణ ,తదితరులు పాల్గొన్నారు.



స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ - బాలానగర్

ఈ నెల 30 న జరగబోయే స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని డి.ఎస్.పి బాలానగర్ మండల కమిటీ గురువారం వాల్ పోస్టర్ ను అంబేద్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దళిత శక్తి ప్రోగ్రాం బాలానగర్ మండల కమిటీ అధ్యక్షులు పరశురాం మహారాజ్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్యమే లక్ష్యంగా డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన 10,000 కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ముగింపు సభ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం ఓపెన్ గ్రౌండ్స్ వేదికగా ఈ నెల 30 జరగనుందని దీనికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనబోతున్నారని ఈ భారీ బహిరంగ సభను బాలానగర్ మండలం నుండి కూడా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని బహిరంగ సభని జయప్రదం చేయవలసిందిగా బీసీ ,ఎస్సీ ,ఎస్టీ,ల ప్రజలు స్వరాజ్యం దిశగా అడుగులు వేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత శక్తి ప్రోగ్రాం మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ మహారాజ్, బాలానగర్ మండల కమిటీ సభ్యులు రాజు మహారాజ్, పెద్ద కుర్మయ్య మహారాజ్, మల్లేష్ మహారాజ్, సురేష్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణాలతో వరదముంపు నివారణకు చర్యలు



నవతెలంగాణ-బాలానగర్

వర్షాకాలంలో కాలనీలు, బస్తీలు వరదముంపుకు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కష్ణారావు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తో కలిసి ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జింకలవాడలో రూ. 3 కోట్ల 90 లక్షల తో నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ పనులు ఇప్పటికే దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎక్కడా రాజీ పడకుండా నిధులు కేటాయిస్తూ ఎంతో అభివద్ధి చేస్తున్నారని, ఇందులో భాగంగానే నాళాల అభివద్ధి కూడా చేయాలన్న సంకల్పంతో రిటర్నింగ్ వాల్స్ నిర్మించి వర్షం వచ్చినప్పుడు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాతయాత్రచేపట్టి నాలాలను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో వరదలతో కాలనీలు ముంపునకు గురయ్యేవన్నారు. ప్రస్తుతం వరదముంపుకు గురికాకుండా డివిజన్లో బాక్స్ డ్రైన్లను నిర్మిస్తున్నామన్నారు. ఓపెన్ నాలాలవల్ల ప్రమాదాలు జరగకుండా వాటిపైన స్లాబులు వేస్తున్నామని అన్నారు. స్థానికులు నాలాల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు, సీసాలను వేయవద్దని సూచించారు. వరదనీరు. ప్రవహించకుండా ప్లాస్టిక్ వస్తువులు అడ్డుపడుతున్నాయని అన్నారు. ఎండా కాలంలో నాలాల్లోని పూడికను తీయిస్తున్నామ అని ప్రజలు గమనించి అభివృద్ధికే పట్టం కట్టాలని డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సాగర్, రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాజ్ కుమార్, సురేష్ నాయుడు, హరిప్రసాద్ నాయుడు, విష్ణు, కుర్మయ్య, బస్తీవాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'పేదల పన్నులతో పెద్దల రుణాలు మాఫీ చేస్తున్న బీజేపీని నమ్మొద్దు'

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట.

పేదలను పన్నుల పేరుతో దోచి పె(గ) ద్దలకు రుణాలు మాఫీ చేస్తున్న బిజెపిని నమ్మొద్దని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే. ఏసు రత్నం అన్నారు. ఈ మేరకుసీపీఐ చేపట్టిన ఇంటింటికి సీపీఐ పాదయాత్ర 2 వ రోజు గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవగహకల్ప, షిర్డీహిల్స్, కునమహాలక్ష్మి నగర్, మైసమ్మ నగర్ లలో కొనసాగింది .ఈ పాదయాత్ర ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ దేశంలో పేద మధ్యతరగతి ప్రజలకు నిలువనిడ లేకుండా చేస్తూ మోడీ బీజేపీ మిత్రుడైన గుజరాతి అదానికి వేల కోట్లు మాపి చేస్తున్నాడని విమర్శించారు. మనం కట్టే పన్నులు మనకు ఉపయోగపడకుండా పోతున్నాయని అన్నారు. పెట్రోల్,డీజిల్, గ్యాస్ సిలిండర్ నిత్యావసర సరుకుల ధరలు పెంచినందుకు బీజేపీని గెలిపించాలా అని ప్రశ్నించారు. పుల్వామా జవాన్ల మరణంను పట్టించుకోకుండా వారిని అమరవీరులగా గుర్తించకుండా వారి మరణం తో రాజకీయం చేసినందుకు బీజేపీ ని గెలిపించాల అని ప్రశ్నించారు. సీపీఐ పాదయాత్రలను ప్రజలు జయప్రదం చేయాల్సిందిగా కోరారు.ఈ పాదయాత్రకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ నాయకత్వం వహించగా మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య, కోశాధికారి సదానంద్, బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్ సీపీఐ నాయకులు మల్లేష్,శ్రీనివాస్, నారాయణ, శ్రీకాంత్,ఇమామ్,బాబు,రాజు, కోటేశ్వరరావు,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఈసీ కళాశాలలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్

నవతెలంగాణ- దుండిగల్

మైసమ్మ గూడ లోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2023 ని సెయిన్ ఇమిగ్రేషన్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జక్కుల నర్సింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఆర్ లోకనాథం, సెయిన్ ఐఎంఎస్ ఆపరేషన్స్ హెడ్ ఎన్. శ్రీనివాస్, విచ్చేయుగా మేనేజరల్ ఆపరేషన్స్ వీరేంద్రనాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్స్ హెడ్ ఎన్. శ్రీనివాస్, మాట్లాడుతూ వివిధ దేశాలకు వెళ్లదలచిన పేద విద్యార్థులకు ఇమిగ్రేషన్ రుసుము తీసుకో కుండా నిరుపేద విద్యార్థులకు విదేశీ విద్య అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి సమ్మిట్లు భవిష్యత్తులో పేద విద్యార్థుల కొరకు సెయిన్ ఐఎంఎస్ సర్వీస్ సేవలో మరి ఎక్కువగా నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంవల్లనిరుపేద విద్యార్థులు విదేశాల్లో చదవాలనుకున్న వారి కల నెరవేరుతుంది అన్నారు. కళాశాలలో నిర్వహించిన ఈ సమ్మిట్ కు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, జర్మనీ, దుబాయ్, మాల్ట, దేశాల నుంచి సుమారు 25 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరై, విశ్వవిద్యాలయాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, విదేశాలకు ఎలా వెళ్లాలి అనే విషయాలపై విధి విధానాలు విద్యార్థులకు వివరించారు. ఈ కళాశాల సమ్మిట్ కు సుమారు 15కు పైగా కళాశాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.



అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

- చైర్మెన్‌గా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి
- సభ్యులుగా భూపేంద్ర సింగ్, సుమ

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) వ్యవహారాల పర్యవేక్షణ, ఎన్నికల నిర్వహణకు అడ్‌హాక్ కమిటీ ఏర్పాటైంది. న్యూఢిల్లీలోని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) కార్యాలయంలో సమావేశమైన ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ క్రీడాశాఖ సూచన మేరకు అడ్‌హాక్ కమిటీని నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ముగ్గురు సభ్యుల అడ్‌హాక్ కమిటీకి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చైర్మెన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ చైర్మెన్ పేరును త్వరలోనే వెల్లడిస్తామని ఐఓఏ అధ్యక్షురాలు పి.టి ఉష తెలిపారు. భారత వుషు సంఘం (డబ్ల్యూఏఐ) అధ్యక్షుడు భూపేంద్ర సింగ్ బజ్వా, ఒలింపియన్, జాతీయ కోచ్ సుమ శిరూర్ సభ్యులుగా నియమితుల య్యారు. అడ్‌హాక్ కమిటీ బాధ్యతలు స్వీకరించిన 45 రోజుల్లో రెజ్లింగ్ ఫెడరేషన్ ఎన్నికలు నిర్వహించాలి. మే 7న ఎన్నికలకు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ప్రకటించిన షెడ్యూల్‌ను కేంద్ర క్రీడాశాఖ రద్దు చేసిన సంగతి తెలిసిందే.

విచారణ సాగుతోంది : భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, జాతీయ కోచ్‌లు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల ఆరోపణలపై భారత ఒలింపిక్ సంఘం విచారణ కొనసాగుతుందని ఐఓఏ సంయుక్త కార్యదర్శి, తాత్కాలిక సీఈవో కళ్యాణ్ చౌబె అన్నారు.

ఉష వ్యాఖ్యల దుమారం



భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, పరుగుల రాణి పి.టి ఉష వ్యాఖ్యలు క్రీడా వర్గాల్లో దుమారం రేపాయి. ఐఓఏ వర్గాలు సహా క్రీడాశాఖ నియమించిన పర్యవేక్షణ కమిటీ బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు అనుకూలంగా పని చేస్తున్నాయనే రెజ్లింగ్ క్రీడాకారుల అనుమానాలకు బలం చేకూర్చేలా పి.టి ఉష గురువారం మాట్లాడారు. ' రెజ్లర్లు వీధుల్లోకి వచ్చి నిరసన చేపట్టడంతో దేశ ప్రతిష్ట దిగజారుతోంది. లైంగిక వేధింపులపై ఐఓఏ అంతర్గత కమిటీ ఉంది. రెజ్లర్లు ఐఓఏ కమిటీ ముందుకు వచ్చి మాట్లాడాలి. రెజ్లర్ల నిరసన తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘన' అని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ సమావేశం అనంతరం పి.టి ఉష అన్నారు. ఉష వ్యాఖ్యలపై జంతర్‌మంతర్ వద్ద నిరసనలో ఉన్న మల్లయోధులు మండిపడ్డారు. ' భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు నుంచి ఇటువంటి సమాధానం ఊహించలేదు. ఓ మహిళా అథ్లెట్‌గా మా ఆవేదనను పి.టి ఉష అర్థం చేసుకుంటుందని అనుకున్నాం. అందుకు భిన్నంగా ఆమె మాట్లాడింది. పి.టి ఉష గతంలో ఆమె అకాడమీ కోసం నిరసన చేసిన సంగతి ఇప్పుడు గుర్తు చేయాలనుకుంటున్నాం. మేము మాకు జరిగిన అన్యాయం పట్ల నిరసనగా ఆందోళన చేస్తున్నామని' సాక్షి మాలిక్ మండి పడింది.

రెజ్లర్ల అరణ్య రోదన



పట్టించుకోని ప్రధానమంత్రి

న్యాయం చేయని ఢిల్లీ పోలీసులు

భారత ఒలింపియన్లు, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించి దేశం గర్వపడే ప్రదర్శనలు చేసిన మల్లయోధులు నేడు న్యాయం కోసం రోడ్డెక్కి రోదిస్తున్నారు. మైనర్లు సహా మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని జంతర్‌మంతర్ వద్ద అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఏండ్లుగా కఠోరంగా శ్రమించి, ఎన్నో త్యాగాలు చేసి, సవాళ్లను అధిగమించి దేశానికి పతకాలు తీసుకొచ్చే అథ్లెట్లు లైంగిక వేధింపులకు గురైనా పట్టించుకునే నాథుడే లేడు. సోషల్ మీడియా యుగంలోనూ మల్లయోధుల న్యాయ పోరాటం అరణ్య రోదనగానే ఎందుకు మిగులుతోంది? అసలు రెజ్లర్లు రోడ్డు మీదకు రావడానికి కారణకులు ఎవరు? నిందితులను శిక్షించకుండా రక్షిస్తున్నదెవరు?!

దేశం లేదు, ధర్మం లేదు

భారతీయ జనతా పార్టీ (బిజెపి) అను నిత్యం జపించే మంత్రం దేశం కోసం, ధర్మం కోసం. దేశాన్ని అదాని, అంబానిలకు వదిలేసిన బిజెపి.. ధర్మాన్ని నేరస్థుల చేతుల్లో పెట్టింది!. దేశం తరఫున పతకాలు సాధించిన క్రీడాకారుల పక్షాన నిలబడటమా? పార్టీ లోక్‌సభ ఎంపీ తరఫున నిలబడటమా? అనే అంశంలో బిజెపి నాయకత్వం రెండో ఆలోచన చేయలేదు. తీవ్రమైన లైంగిక ఆరోపణల అంశంలోనూ పార్టీ ఎంపీ పక్షాన నిలబడేందుకు సిద్ధపడింది. క్రీడాకారులను రోడ్డుకు వదిలేసింది. అల్లర్లు, హత్య, హత్యాయత్నం, దోపిడి సహా పలు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కోసం.. దేశానికి ప్రాతినిథ్యం వహించే అథ్లెట్లకు భంగపాటు మిగుల్చుతుంది.

ఎఫ్ఐఆర్‌కు నిరాసక్తి

దేశ రాజధాని ఢిల్లీలో మహిళలకు రక్షణ లేదని భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానిస్తే.. ఢిల్లీ పోలీసు యంత్రాంగం రాహుల్ ఇంటిముందుకొచ్చింది. మహిళల రక్షణపై చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు చూపించాలని నానా రచ్చ చేశారు. ఓ మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు స్వయంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లైంగిక వేధింపులపై ఫిర్యాదు ఇచ్చినా.. అదే ఢిల్లీ పోలీసుల్లో ఎలాంటి చలనం లేదు. లైంగిక ఆరోపణల ఫిర్యాదుపై ఎంపీకి కనీసం నోటీసు సైతం ఇవ్వలేదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ప్రాథమిక విచారణ అవసరమని భావించిన పోలీసులు.. ఇప్పటివరకు ఆ పని కూడా చేయలేదు. ఎఫ్ఐఆర్ నమోదుపై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసినా ఉలుకూ పలుకూ లేదు.

ఐఓఏ చీఫ్ సైతం..!

భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పి.టి ఉష తన వ్యాఖ్యలతో స్థాయికి తగ్గించుకున్నారు. రెజ్లర్ల ఆందోళన దేశ ప్రతిష్టకు మచ్చ తీసుకొస్తుందని ఉష అన్నారు. నేడు సాటి మహిళా అథ్లెట్లు లైంగిక వేధింపులకు గురైతే ఉష స్పందించిన తీరు విస్తుగొల్పుతుంది. న్యాయ పోరాటం చేస్తున్న రెజ్లర్లను హెచ్చరించే స్వరంతో మాట్లాడింది. ఐఓఏ చీఫ్ వ్యాఖ్యలు బిజెపి ఎంపీ సింగ్‌కు మద్దతు ఇచ్చినట్టే భావించాలి.

మీడియా.. సెన్సార్

జంతర్ మంతర్ వద్ద నిరసన, రెజ్లింగ్ సమాఖ్యలో లైంగిక వేధింపుల అంశమే బిజెపికి అధికారికంగా, అనధికారికంగా మద్దతుగా నిలుస్తున్న మీడియాకు కనిపించటం లేదు. రెజ్లర్ల ఆందోళన అంశాన్ని మరుగున పడేయడానికి అధికార పార్టీ అనుకూల టెలివిజన్ చానెళ్లు, సోషల్ మీడియా బృందాలు ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. ముఖ్యంగా ట్విట్టర్‌లో రెజ్లర్ల ఆందోళన వైరల్ కాకుండా జాగ్రత్త వహిస్తున్నారు. వర్తమానంతో ఏమాత్రం సంబంధం లేని అంశాలను తెరపైకి తీసుకొచ్చి పనికిరాని చర్చ చేస్తున్నాయి. రెజ్లర్లు రోడ్డు మీదకు వచ్చిన మొదటిరోజే జాతీయ మీడియా తన బాధ్యత సక్రమంగా నిర్వర్తిస్తే మల్లయోధులు మరోసారి నిరసనకు దిగే పరిస్థితి వచ్చేది కాదు!. రెజ్లర్ల ఆందోళనపై ఎదురుదాడి వార్తలను చూపిస్తూ.. రెజ్లర్ల రోదనను సెన్సార్ చేస్తున్నాయి.

గర్వపడే దేశభక్తులు ఎక్కడ?

'యావత్ భారతావని గర్వపడే ప్రదర్శన', ' జాతి గర్వపడేలా చేశారు'... రెజ్లర్లు పతకాలు సాధించగానే సోషల్ మీడియాలో ముంచెత్తే మెసేజ్‌లు ఇవే. అదే దేశం గర్వ పడే ప్రదర్శన చేసిన అథ్లెట్లు నేడు న్యాయం కోసం పోరాటం చేస్తుంటే.. మద్దతు పలికేందుకు ఒక్కరూ ముందుకు రావటం లేదు. ఏదైనా దేశం తర్వాతే, దేశభక్తిలో సరిలేరు మాకెవ్వరు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే దేశభక్తులు నేడు రెజ్లర్ల ఆందోళనలో కనిపించటం లేదు. అంతర్జాతీయ వేదికపై మువ్వెన్నల పతాకం రెపరెపలాడే క్షణం కోసం జీవితకాలం శ్రమించే క్రీడాకారులకు బాసటగా నిలిచేందుకు ప్రధాన స్రవంతిలో ఎవరూ ముందుకు రావటం లేదు.

ప్రధాని మోడికి పట్టదా?!

వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్ సహా ఏ క్రీడాకారులైనా పతకాలు సాధించగానే తొలుత వారిని కలుసుకునేది ప్రధాని మోడి. అథ్లెట్లు పతకాలు సాధించటంలో మోడి ఇచ్చిన సలహాలు ఎలా ఉపయోగపడ్డాయో తెలియజేస్తూ వెంటనే వార్తా కథనాలు. మరి అదే అథ్లెట్లు నేడు లైంగిక వేధింపులకు గురై న్యాయ పోరాటం చేస్తుంటే ప్రధాని నరేంద్ర మోడికి పట్టదా?!. క్రీడాకారుల విజయాలను రాజకీయంగా వాడుకున్న మోడి నేడు వారు కష్టాల్లో ఉంటే కనీసం ఓదార్చేందుకు కనికరం రావటం లేదా?!. సొంత పార్టీ ఎంపీ మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడితే మోడి జోక్యం చేసుకోరా?!.

ఎల్లప్పుడూ నిందితుల పక్షమే

రేపిస్టులు, నేరస్థులకు అండగా నిలబడటమే భారతీయ జనతా పార్టీ (బిజెపి) విధానంగా కనిపిస్తుంది. ఉన్నావో అత్యాచార ఘటన నిందితుడు కుల్దీప్ సింగ్, అత్యాచార కేసులో నిందితుడు గుర్మీత్ రామ్ రహీం బాబా, బిల్కిస్ బానో అత్యాచార నిందితులు.. తాజాగా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ వరకు ఏ ఉదంతం తీసుకున్నా బిజెపి నేరస్థులు, నిందితుల పక్షానే నిలబడింది. బాధితుల పక్షాన నిలబడే విధానమే బిజెపి మూల సూత్రాల్లో ఉన్నట్టు కనిపించటం లేదు.

పారదర్శకంగా ఎన్నికలు!

- పర్యవేక్షణ కమిటీ చెప్పిందదే
- క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్



న్యూఢిల్లీ : లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ చేసేందుకు ఏర్పాటైన కమిటీ.. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని సూచన చేసింది!. హాస్యాస్పదంగా అనిపిస్తున్నప్పటికీ ఇదే వాస్తవం. కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ గురువారం ఈ విషయం వెల్లడించారు. న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద రెజ్లింగ్ క్రీడాకారుల నిరసన కార్యక్రమానికి పౌర సమాజం నుంచి మద్దతు వెల్లువెత్తుతున్న తరుణంలో అనురాగ్ ఠాకూర్ మీడియాతో మాట్లాడారు. ' 12 గంటల పాటు రెజ్లర్ల సమస్యలు, డిమాండ్లు విన్నాను. పలుమార్లు వారితో చర్చలు జరిపిన అనంతరం పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశాం. కమిటీ విచారణలో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించటం, ఫిర్యాదుల కోసం డబ్ల్యూఎఫ్ఐలో కమిటీ ఏర్పాటు ప్రధాన లోపాలుగా తేలింది. అడ్‌హాక్ కమిటీ పర్యవేక్షణలో రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలకు ఐఓఏ చర్యలు తీసుకుంటుంది. ఫిర్యాదుల కోసం కమిటీ సైతం ఏర్పాటు అవుతుంది. రెజ్లర్ల వాదన వినిపించేందుకు క్రీడాశాఖ అందరికీ అవకాశాలు కల్పించింది' అని అనురాగ్ ఠాకూర్ అన్నారు.

జైస్వాల్ జోరు

చెన్నైపై రాజస్థాన్ గెలుపు రాజస్థాన్ రాయల్స్‌కు అగ్రస్థానం



నవతెలంగాణ-జైపూర్

రాజస్థాన్ రాయల్స్ టాప్ లేపింది. చెన్నై సూపర్‌కింగ్స్‌పై సీజన్లో వరుసగా రెండో విజయం సాధించింది. వరుసగా రెండు ఓటముల అనంతరం చెన్నై సూపర్‌కింగ్స్‌పై 32 పరుగుల తేడాతో మెరుపు విజయం నమోదు చేసిన రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం కైవసం చేసుకుంది. 203 పరుగుల భారీ ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ ఏ దశలోనూ రేసులో నిలువలేదు. డెవాన్ కాన్వే (8), అజింక్య రహానె (15), అంబటి రాయుడు (0) నిరాశపరిచారు. రుతురాజ్ గైక్వాడ్ (47, 29 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శివం దూబె (52, 33 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు) పోరాటం సరిపోలేదు. మోయిన్ అలీ (23, 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), రవీంద్ర జడేజా (23, 15 బంతుల్లో 3 ఫోర్లు) ఓటమి అంతరాన్ని కుదించారు. 20 ఓవర్లలో 6 వికెట్లకు చెన్నై సూపర్‌కింగ్స్ 170 పరుగులే చేసింది. రాయల్స్ స్పిన్నర్లు ఆడం జంపా (3/22), అశ్విన్ (2/35) మాయజాలం చేశారు.

తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (77, 43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సులు) ఐపీఎల్ కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్ నమోదు చేశాడు. 26 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన జైస్వాల్ రాయల్స్ భారీ స్కోరుకు గట్టి పునాది వేశాడు. ధ్రువ్ జురెల్ (34), దేవదత్ పడిక్కల్ (27 నాటౌట్) చివర్లో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడటంతో రాయల్స్ 200 ప్లస్ స్కోరు సాధించింది. జోశ్ బట్లర్ (27) మెరిసినా.. సంజు శాంసన్ (17), షిమ్రోన్ హెట్‌మయర్ (8) నిరాశపరిచారు. చెన్నై స్పిన్నర్లు తీక్షణ (1/24), జడేజా (1/32) రాణించారు.

నేడు సుప్రీం విచారణ



న్యూఢిల్లీ : భారత స్టార్ మల్లయోధుల దాఖలు చేసిన పిటిషనుపై భారత అత్యున్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టనుంది. రెజ్లింగ్ క్రీడాకారుల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదన వినిపించన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అరెస్టు చేయాలని కోరుతూ రెజ్లర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్యానించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేశారు. సుప్రీంకోర్టు నోటీసుకు ఢిల్లీ పోలీసులు నేడు సమాధానం ఇవ్వనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశిస్తే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం కనిపిస్తుంది.

నవచిత్రం



చిరంజీవి

భోళా శంకర్ డబ్బింగ్ షురూ..

చిరంజీవి, మెహర్ రమేష్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'భోళా శంకర్'. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం చిరంజీవి, షావర్ అలీ, వజ్రతోపాటు ఫైటర్స్, ఇతర ప్రముఖ తారాగణంపై భారీ ఇంటర్వెల్ సీక్వెన్స్‌ను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. ఇదిలా ఉంటే, మేకర్స్ గురువారం పూజా కార్యక్రమాలతో డబ్బింగ్ పనులను ప్రారంభించారు. జూన్ చివరి నాటికి సినిమా చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్‌తో పాటు లావిష్‌గా చిత్రీకరించిన పాటలూ ఉంటాయి. మెహర్ రమేష్ ఈ చిత్రంలో చిరంజీవిని పూర్తి స్టైలిష్ మాస్ అవతార్‌లో ప్రజెంట్ చేస్తున్నారు. తమన్నా కథానాయికగా నటిస్తుండగా, చిరంజీవికి సోదరిగా కీర్తి సురేష్ కనిపించనుంది. సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ పాత్రలో మెరవబోతున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగానే కాకుండా లాంగ్ హాలిడే వీకెండ్ కలిసొచ్చేలా ఈ చిత్రాన్ని ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రఘుబాబు, రావు రమేష్, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, ప్రగతి, శ్రీ ముఖి, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, ప్రభాస్ శీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మెహర్ రమేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, సంగీతం: మహతి స్వర సాగర్, డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల.



శేఖర్ కమ్ముల

హైదరాబాద్

గొప్ప ప్రేమకూ నిలయమే

'హైదరాబాద్ అంటే బిర్యానీ, ఇరానీ చాయ్‌కే కాదు... గొప్ప ప్రేమకు నిలయం' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గురువారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యునికేషన్ సంయుక్తంగా నిర్వహించిన 24వ ఎడ్యుకేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, సినిమా ద్వారా మంచి మార్పును తీసుకొచ్చేలా ఉండాలి. ఇవాళ తీసిన సినిమా మరో పదేళ్లైనా చూసేలా ఉండాలి. పిల్లలతో కలిసి చూసేలా ఉండాలి. డాక్యుమెంటరీ, ఫిల్మ్ ఏది తీసినా, ఎక్కడ పోస్టు చేసినా దిగువ స్థాయిని ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఎంపథితో చూడాలి. విద్యార్థులు మీరు ఏం కల కంటున్నారో వాటిని సాధించేందుకు కృషి చేస్తే గొప్పవాళ్లు అయినట్టే' అని చెప్పారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ సహా ఇతర విభాగాలలో విజేతలుగా నిలిచిన 13 మందికి శేఖర్ కమ్ముల ట్రోఫీతోపాటు సర్టిఫికెట్లను అందజేశారు.



విశ్వక్‌సేన్, దిల్‌రాజు, కృష్ణ చైతన్య

రాజమండ్రి నేపథ్యంలో కొత్త సినిమా

విశ్వక్ సేన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి నిర్మిస్తున్న విఎస్11 (వర్కింగ్ టైటిల్) పూజా కార్యక్రమాలతో బుధవారం ఉదయం ప్రారంభమైంది. సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ చైతన్య రచన, దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈచిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తోంది. చిత్ర ప్రారంభం సందర్భంగా నిర్మాత సుధాకర్ చెరుకూరి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత దిల్ రాజు క్లాప్ ఇచ్చారు. మొదటి షాట్‌కి నిర్మాత వెంకట్ బోయనపల్లి దర్శకత్వం వహించారు. దర్శకులు వెంకీ అట్లూరి, నిర్మాత రామ్ ఆచంట తమ చేతుల మీదుగా స్క్రిప్ట్‌ని చిత్ర బృందానికి అందజేశారు.

మే నుండి ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమవుతుంది. ఈ చిత్రంలో నటిస్తున్న ఇతర ముఖ్య తారాగణం వివరాల్ని అతి త్వరలోనే ప్రకటించనున్నారు. 90వ దశకంలో రాజమండ్రి పరిసరాల నేపథ్యంలో జరిగిన కథతో రూపొందుతోన్న ఈ సినిమా కోసం ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ప్రేక్షకులను సరికొత్త కథలతో అలరించే క్రమంలో విశ్వక్‌సేన్ మరో మంచి కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.

నాన్ స్టాప్ నవ్వులు..

శ్రీవిష్ణు కథానాయకుడిగా 'వివాహ భోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సామజవరగమన'. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పిస్తునారు. ఈ సినిమాలో శ్రీవిష్ణు సరసన రెబా మోనికా జాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. సరదాగా సాగే ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు.

హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ,'ఇదొక కంప్లీట్ ఎంటర్‌టైనర్. ఇంత ఎంటర్‌టైనర్‌ని నేనూ ఎప్పుడు చేయలేదు. సినిమా చాలా బాగా వచ్చింది. మొదటి నుంచి చివరి వరకూ నవ్వుకుంటూనే ఉంటారు. నిర్మాత రాజేష్ దండా ఈ కథతో వచ్చినపుడు ఆయన చేస్తున్న 'మారేడుమిల్లీ, భైరవ కోన' తరహాలో ఉంటుందని అనుకున్నాను. కానీ ఇది సూపర్ ఫన్ సబ్జెక్ట్. కథ విన్నప్పుడే చాలా ఎంజాయ్ చేశాను' అని తెలిపారు. 'ఈ కథ రామ్ చెప్పగానే బాగా నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్ నా జోనర్. చాలా రోజులైయింది ఎంటర్‌టైన్‌మెంట్ మూవీస్ చేసి. శ్రీవిష్ణు ఎంచుకునే కథలు యూనిక్‌గా ఉంటాయి. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన పక్కా ఎంటర్‌టైనర్ ఇది. నిర్మాత రాజేష్ కథల ఎంపిక బావుంటుంది. దర్శకుడు రామ్ చాలా నిజాయితీ గల దర్శకుడు' అని నిర్మాత అనిల్ సుంకర అన్నారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ,' ఈ కథ చెప్పినప్పుడు నాన్ స్టాప్‌గా నవ్వుకుంటూనే ఉన్నాను. నాకు బాగా నచ్చి, అనిల్ సుంకరకి చెప్పాను. ఆయనకి కూడా చాలా బాగా నచ్చింది. దర్శకుడు ఏదైతే చెప్పాడో దాని కంటే బాగా తీశాడు. హాస్య మూవీస్ బ్యానర్ స్టార్ట్ అవ్వడానికి కారణం అనిల్ సుంకర. ఆయన లేకపోతే ఈ బ్యానర్ లేదు' అని తెలిపారు.

'ఇది చిన్న టీజర్. ట్రైలర్, సినిమా ఇంకా ఫన్‌గా ఉంటాయి. ఫ్యామిలీ అంతా కలిసి సరదాగా ఎంజాయ్ చేసే సినిమా ఇది. శ్రీవిష్ణులో కామెడీ టైమింగ్ నెక్స్ట్ లెవల్. మనం వంద రాస్తే దాన్ని వెయ్యికి తీసుకువెళ్తారు. రెబ్బా చక్కగా నటించింది' అని దర్శకుడు రామ్ అబ్బరాజు అన్నారు.



శ్రీ విష్ణు



మీర్నా మీనన్

ఛాలెంజింగ్ పాత్ర చేశా..

'నాంది' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన అల్లరి నరేష్, విజయ్ కనకమేడల కాంబోలో మరో యూనిక్, ఇంటెన్స్ మూవీ 'ఉగ్రం' రాబోతోంది. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించారు. మీర్నా మీనన్ కథానాయికగా నటించింది.

మే 5న సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఈ చిత్ర విశేషాలను గురువారం నాయిక మీర్నా మీనన్ మీడియాతో షేర్ చేసుకున్నారు. 'నేను సాఫ్ట్‌వేర్ డెవలపర్‌ని. దుబాయి, కేరళలో ఇంజనీర్‌గా పని చేశాను. ఒక రోజు దర్శకుడు అమీర్ నుంచి కాల్ వచ్చింది. ఆ కాల్ ఫలితమే తమిళంలో ఆర్యతో నటించే అవకాశం వచ్చింది. తర్వాత మోహన్ లాల్ 'బిగ్ బ్రదర్', దీని తర్వాత 'క్రేజీ ఫెలో' చేశాను. వీటిల్లో వచ్చిన గుర్తింపుతో సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్' సినిమాలో అవకాశం వచ్చింది. అది ఫస్ట్ షెడ్యూల్‌లో ఉండగానే దర్శకుడు విజయ్ ఈ సినిమా కోసం సంప్రదించారు. 'ఉగ్రం' కథ చెప్పినప్పుడే ఓకే చెప్పేశాను. కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అలాగే నా పాత్ర చాలా ఛాలెంజింగ్‌గా ఉంటుంది. కాలేజీ అమ్మాయిగా, భార్యగా, ఒక బిడ్డకు తల్లిగా.. ఇలా భిన్నమైన కోణాలు నా పాత్రలో కనిపిస్తాయి. కెరీర్ బిగినింగ్‌లో ఇలాంటి పాత్ర చేయడం సవాలే. ఆ సవాల్‌ని స్వీకరించి ఈ పాత్ర చేశాను. పైగా నా పాత్ర పూర్తి స్థాయిలో, నరేష్‌తో పాటు కథలో ప్రయాణిస్తూ ఉంటుంది. నటనకు ఆస్కారం ఉండే పాత్ర దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. నరేష్ కామెడీ, సీరియస్ రెండు పాత్రలని అద్భుతంగా హ్యాండిల్ చేస్తారు. దర్శకుడు విజయ్ కనకమేడల చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. తన స్క్రీన్ ప్లే రాసుకునే విధానం అద్భుతం. ప్రతి సీన్‌కి చివర్లో ఒక మీనింగ్ ఉంటూ అది కథలో భాగమవుతుంది. తను మంచి ఎడిటర్ కూడా. సినిమా ఆయన మైండ్‌లోనే ఎడిట్ అయిపోతుంది. ఇందులో నాకు పాపగా నటించిన ఊహ కూడా అద్భుతంగా చేసింది. షైన్ స్క్రీన్స్ నిర్మాణంలో పని చేయడం ఆనందంగా ఉంది. మంచి సినిమాలు చేయాలనే ఆలోచనతో ఉండే నిర్మాతలు. ప్రస్తుతం వెట్రిమారన్ కథతో అమీర్ దర్శకత్వంలో ఓ సినిమా, అలాగే మలయాళంలో మరో సినిమా చేస్తున్నా' అని తెలిపారు.

పక్కా బ్లాక్‌బస్టర్ గుర్తు పెట్టుకోండి

మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం విదితమే. అయితే ఈ కొత్త ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పటి దగ్గర్నుంచి దీనిపై పలు రూమర్లు సోషల్ మీడియా వేదికగా షికార్లు చేస్తున్నాయి. మహేష్, త్రివిక్రమ్ మధ్య గొడవ జరగడం కారణంగా ఈ సినిమా ఆగిపోయిందనే వార్తలు రావడంతో మహేష్‌బాబు ఫ్యాన్స్ ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో వీటిపై ఈ చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ స్పందించారు. 'అటెన్షన్ కోసం కావాలనే ఇలాంటి రూమర్స్ క్రియేట్ చేస్తారు. వీటిని చూసి నవ్వుకోవాలి. లేదంటే పట్టించుకోకుండా మన పని మనం చేసుకుంటూ వెళ్ళిపోవాలి. అభిమానులందరికీ నేను చెప్పేది ఒక్కటే. ఇది పక్కా బ్లాక్‌బస్టర్ సినిమా. ఈ స్టేట్‌మెంట్‌ని మర్చిపోకండి' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదల చేస్తున్నారు.



నాగవంశీ

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవి శిక్షణా శిబిరం మే ఒకటి నుంచి జూన్ నాలుగు వరకు నిర్వహిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 16 సంవత్సరాలలోపు చిన్నారులకు సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఆర్ఎస్‌సీ) గ్రౌండ్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరంలో ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిదిన్నర గంటల వరకు అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, కబడ్డీ విభాగాల్లో పిల్లలకు, 20 ఏండ్లు పైబడిన వారికి ప్రాథమిక ఫిట్‌నెస్ శిక్షణ / యోగా శిక్షణ ఉంటుంది . ఆసక్తి కలిగిన వారు స్పోర్ట్స్ ఆఫీస్, రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్స్, సికింద్రాబాద్ నుంచి దరఖాస్తు ఫారమ్‌లను పొందవచ్చు. మరిన్ని వివరాల కోసం సంప్రదించండి 9866147148, 040-27785334 నెంబర్లలో సంప్రదించవచ్చు.

సిట్ దర్యాప్తు నివేదికపై వివరణ కోరండి..

- టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై గవర్నర్‌కు వైఎస్ షర్మిల లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ స్కాములోఐటీ విభాగం పాత్రపై సిట్ దర్యాప్తు ఎంతవరకు వచ్చిందో నివేదిక కోరాలంటూ గవర్నర్ తమిళ సై సౌందరరాజన్‌కు వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల గురువారం బహిరంగ లేఖ రాశారు. పేపర్ లీకేజీతో ఏండ్ల తరబడి కష్టపడి ప్రిపేరయిన పరీక్షకు హాజరైన అభ్యర్థుల ఆశల మీద నీళ్ల చల్లినట్టయిందని తెలిపారు. ఐటీ శాఖ వైఫల్యం వల్లనే లీకేజి జరిగిందని పేర్కొన్నారు. ఆ శాఖ జోలికి సిట్ వెళ్లటం లేదని తెలిపారు. ఈ వ్యవహారంలో పెద్దోళ్ల ప్రమేయమే ఉందని తెలిపారు. అందుకే పోలీసులు ఆ దిశగా విచారణ చేయటం లేదని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

మోడీ నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టారు

- బొగ్గు బ్లాక్‌ల వేలంతో వారి నిజస్వరూపం బట్టబయలు : సీపీఐ ప్రజాచైతన్య యాత్ర బహిరంగ సభలో కూనంనేని, చాడ



నవతెలంగాణ-గోదావరిఖని

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీని గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ ప్రజా చైతన్య యాత్ర బుధవారం రాత్రి గోదావరిఖనికి చేరుకుంది. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జన సేవాదళ్ సభ్యులు, నగర సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు యాత్రకు ఘన స్వాగతం పలికి మున్సిపల్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. బీజేపీకి హటావో.. దేశ్‌కి బచావో నినాదంతో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర 11వ రోజుకు చేరిందని, దీనికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. పేద మధ్య తరగతి, నిరుద్యోగులను మోసం చేస్తూ కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్యన చిచ్చుపెట్టిన బీజేపీని మళ్లీ అధికారంలోకి రానివ్వొద్దని ప్రజలకు సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి సంస్థను కూడా ప్రయివేటుపరం చేయాలని చాప కింద నీరులా కుట్రలకు పాల్పడుతున్నదన్నారు. మోడీ మతతత్వ ముసుగులో దేశంలోని సంపదను, పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ రామగుండం వచ్చినప్పుడు.. సింగరేణిని ప్రయివేటుపరం చేయబోమని చెప్పి.. నెల రోజుల్లోనే నాలుగు బొగ్గు బ్లాక్‌లను వేలం వేసి ఆయన నిజ స్వరూపం బయటపెట్టుకున్నారని విమర్శించారు. ఈ సభలో నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కలవేణి శంకర్, మర్రి వెంకటస్వామి, మంద పవన్, వెన్న సురేష్, గుంటి వేణు, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజ్, మద్దెల దినేష్, ఆరెల్లి పోశం, మడ్డి, ఎల్లా గౌడ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినాష్ బెయిల్‌పై సుదీర్ఘ వాదనలు

నవతెలంగాణ -హైదరాబాద్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో గురువారం గంటన్నరపాటు వాదప్రతివాదనలు జరిగాయి. ఆయన తరపున సీనియర్ లాయర్ నిరంజన్‌రెడ్డి, సునీత తరపున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూత్రా, సీబీఐ తరపున పీపీ నాగేంద్ర వాదనలు వినిపించారు. వివేకాను దస్తగిరే హత్య చేశాడు. అలాంటప్పుడు దస్తగిరి స్టేట్‌మెంట్‌ను ఎలా పరిగణలోకి తీసుకుంటారు.. అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. గూగుల్ టేకౌట్ ఎలా ఆధారం అవుతుందని కూడా ప్రశ్నించారు. అవినాష్‌ను లక్ష్యంగా చేసుకొనే సీబీఐ దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. సీబీఐ దర్యాప్తునకు అవినాష్ సహకరిస్తున్నారనీ, కాబట్టి అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పిటిషనర్‌పై క్రిమినల్ కేసులు లేవని చెప్పగా సునీత లాయర్ కల్పించుకుని ఎన్నికల అఫిడవిట్‌లో క్రిమినల్ కేసులు ఉన్నాయని అవినాష్ స్వయంగా చెప్పారని అన్నారు. విచారణకు అవినాష్ సహకరించడం లేదని సీబీఐ లాయర్ చెప్పారు. విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ జస్టిస్ సురేందర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గంగిరెడ్డి బెయిల్ రద్దు

వివేకా హత్య కేసులో తొలి నిందితుడైన గంగిరెడ్డికి పులివెందుల కోర్టు గతంలో ఇచ్చిన బెయిల్‌ను గురువారం తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. సాక్షులను ప్రభావితం చేస్తున్నందున గంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుమలత తుది ఉత్తర్వులు జారీ చేశారు. మే 5వ తేదీలోగా సీబీఐ ఎదుట లొంగిపోవాలని గంగిరెడ్డిని ఆదేశించారు. లేనిపక్షంలో గంగిరెడ్డిని సీబీఐ అరెస్టు చేయవచ్చునని తెలిపారు.

పీఎస్‌లో వ్యక్తి మృతిపై విచారణ

తుకారాంగేట్ పీఎస్‌లో ఈ నెల 25న చిరంజీవి అనే 32 ఏండ్ల ఆటో డ్రైవర్‌ను పోలీసుల విచారణకు తీసుకొచ్చిన తర్వాత మరణించిన ఘటన గురించి ఇంగ్లిషు పత్రికలో వచ్చిన వార్తను హైకోర్టు పిటిషన్‌గా పరిగణించింది. హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, సిటీ పోలీస్ కమిషనర్, నార్త్ జోన్ డీసీపీ, గోపాలపురం ఏసీపీ, తుకారాంగేట్ ఎస్‌హెచ్‌ఓలను ప్రతివాదులుగా చేసింది. సెల్‌ఫోన్ల దొంగతనం కేసులో చిరంజీవిని ఎల్‌బీనగర్ ఏరియా నుంచి తుకారాంగేట్ పోలీసులు తీసుకువెళ్లి విచారణ చేపట్టారు. ఫిట్స్ వచ్చాయని చిరంజీవిని గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చనిపోవడంతో బంధువులు ధర్నా చేశారు. పోలీసుల దెబ్బల వల్లే చనిపోయాడని ఆరోపణలపై విచారణ జరిపారు.

కవిత పిటిషన్‌ను విచారించండి

ఈడీపై కవిత పిటిషన్‌ను ధర్మాసనానికి మెన్షన్ చేసిన కపిల్ సిబల్

న్యూఢిల్లీ : ఈడీపై ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను త్వరగా విచారణ చేపట్టాలని జస్టిస్ రస్తోగి ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మెన్షన్ చేశారు. మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ చేయొచ్చా అనే అంశాన్ని సవాల్ చేస్తూ గతంలో కవిత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వచ్చే సోమవారం కవిత పిటిషన్ విచారించాలని ధర్మాసనానికి కపిల్ సిబల్ విజ్ఞప్తి చేశారు. అభ్యర్థనను పరిశీలిస్తామని జస్టిస్ రస్తోగి ధర్మాసనం తెలిపింది.

ఈడీపై ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో గత నెలలో విచారణ జరిగింది. కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మూడు వారాల పాటు వాయిదా వేసింది. మహిళలను ఈడి కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో గతంలో దాఖలు చేసిన నళిని చిదంబరం పిటిషన్‌కు సుప్రీంకోర్టు ట్యాగ్ చేసింది. కవిత తన పిటిషన్‌లో సరికొత్త అభ్యర్థన చేశారు. మద్యం పాలసీ కేసు విచారణ కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, విక్రమ్ చౌధురి కవిత తరపున వాదనలు వినిపించారు. ఈడి తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్ వి రాజు వాదనలు వినిపించారు. ఒక మహిళగా తనకు ఉన్న హక్కులను ఈడి కాలరాస్తోందంటూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు.

వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ తనకు పీఎంఎల్‌ఎ చట్టంలోని సెక్షన్ 50 ప్రకారం జారీచేసిన నోటీసులు సిఆర్‌పిసి సెక్షన్ 160కి విరుద్ధంగా ఉన్నాయని, వాంగ్మూలం నమోదు చేసేప్పుడు న్యాయవాది సమక్షంలో వీడియో చిత్రీకరణకు ఉత్తర్వులు జారీ చేయాలని కవిత ఆ పిటిషన్‌లో కోరారు. తన ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, జారీ చేసిన జప్తు నోటీసులను రద్దు చేయడంతో పాటు.. ఫోన్‌ను సీజ్ చేయడం చెల్లదని ఆదేశాలు ఇవ్వాలని, ఈ పిటిషన్‌ను నళినీ చిదంబరం వర్సెస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుకు జత చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తొలుత శుక్రవారం విచారణ జరుపుతామని చెప్పినా.. ఆ తరువాత తదుపరి విచారణని 27గా ప్రకటించింది. కాగా.. కవిత ఇప్పటికే ఈడి ఎదుట మూడుసార్లు హాజరై.. తన వాంగ్మూలాన్ని ఇచ్చారు.

సాక్షిగా పిలిచిన మహిళను తమ ఇంటి వద్ద లేదా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలని పిటిషన్‌లో కవిత కోరారు. సిఆర్‌పిసి సెక్షన్ 160ని ఉల్లఘించి, తనని ఈడీ కార్యాలయానికి పిలిచి విచారిస్తున్నారని కవిత పేర్కొన్నారు. విచారణ సందర్భంగా... ఈడి అధికారులు మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గతంలో పలు ఉదాహరణలు ఉన్నాయని కవిత తెలిపారు.

ఈడీ అధికారులు వ్యవహరించిన తీరు విస్మయానికి గురి చేసిందని పిటిషన్‌లో కవిత పేర్కొన్నారు. ఈడీ అధికారులు కొంత మంది నిందితుల పట్ల ప్రవర్తించిన తీరు తనని ఆందోళనకు, భయానికి గురి చేస్తోందని తెలిపారు. న్యాయవాదుల సమక్షంలో సిసిటివి కెమెరాల నిఘాల్లోనే విచారణ చేపట్టేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఉక్రెయిన్‌కి నాటో సైనిక సహాయం

- 1500కి పైగా యుద్ధ వాహనాలు, 230 ట్యాంకులు
- నాటో చీఫ్ వెల్లడి

కీవ్ : రష్యాతో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో నాటో దేశాలు, ఉక్రెయిన్‌కు 98శాతానికి పైగా యుద్ధ వాహనాలను అందచేశాయని నాటో చీఫ్ గురువారం తెలిపారు. 1550కి పైగా సాయుధ వాహనాలతో పాటూ 230 ట్యాంకులు, ఇతర సామాగ్రిని అందచేసినట్లు నాటో సెక్రటరీ జనరల్ జేన్స్ స్టోలెన్‌బర్గ్ తెలిపారు. సభ్య దేశాలు కూడా అపారమైన మొత్తంలో మందుగుండును పంపినట్లు చెప్పారు. 9కి పైగా బ్రిగేడ్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కొత్త బ్రిగేడ్లలో 30వేల మందికి పైగా సైనికులు వున్నారని అంచనా. వీటిన్నంటితో ఉక్రెయిన్ బలమైన స్థితిలో వుందని, రష్యా ఆక్రమిత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోగల పరిస్థితిలో వుందని స్టోలెన్‌బర్గ్ బ్రస్సెల్స్‌లో విలేకర్లకు చెప్పారు. ఉక్రెయిన్ మిలటరీని మరింత బలోపేతం చేసేందుకు 31నాటో దేశాలు కట్టుబడి వున్నాయని స్టోలెన్‌బర్గ్ తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సుదీర్ఘమైన ఫోన్ సంభాషణ జరిపినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించిన నేపథ్యంలో నాటో చీఫ్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. కాగా, జెలెన్‌స్కీ, జిన్‌పింగ్ ఫోన్ చర్చలకు రష్యా పెద్దగా స్పందించలేదు. కాగా, ఈ పరిణామం ఉక్రెయిన్‌లో పోరును ఆపేందుకు ఉపకరిస్తుందా అని ప్రశ్నించగా, ఘర్షణలను అంతమొందించడానికి, రష్యా నిర్దేశించిన అన్ని లక్ష్యాలను సాధించేందుకు దారి తీసే ఏ పరిణామాన్నైనా తాము స్వాగతించడానికి సిద్ధంగా వున్నామని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. చైనా, ఉక్రెయిన్ నేతలు ద్వైపాక్షిక, వాణిజ్య చర్చలు జరిపారని పెస్కోవ్ తెలిపారు.

ఉత్తర కొరియాను నిలువరించేందుకు అమెరికా-దక్షిణ కొరియాల మధ్య అణు ఒప్పందం

వాషింగ్టన్ : అమెరికా-దక్షిణ కొరియా మధ్య అత్యంత కీలకమైన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కింద ఉత్తర కొరియాను అదుపు చేసేందుకు అమెరికా అణ్వాయుధాలతో కూడిన జలాంతర్గామిని దక్షిణకొరియా తీరంలో మోహరించనుంది. అలాగే సియోల్ న్యూక్లియర్ ప్లానింగ్ ఆపరేషన్స్‌లో భాగం కానుంది. దీనికి బదులుగా దక్షిణ కొరియా సొంతంగా అణ్వాయుధాలు తయారు చేయాలనుకొన్న ప్రణాళికలను వదులుకోనుంది. దీనిని 'వాషింగ్టన్ డిక్లరేషన్'గా వ్యవహరిస్తున్నారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ "ఈ ఒప్పందం వల్ల ఉత్తరకొరియాను నిలువరించే క్రమంలో భాగస్వాముల మధ్య సమన్వయం పెరుగుతుంది" అని వ్యాఖ్యానించారు. కాగా, ఇప్పటికే ఉన్న ఒప్పందాల ప్రకారం యుద్ధ సమయాల్లో దక్షిణ కొరియాను రక్షించాల్సిన బాధ్యత అమెరికాపై ఉంది. దీనికి తోడు అవసరమైన సమయంలో అమెరికా అణ్వాయుధాలను వినియోగిస్తానని కూడా హామీ ఇచ్చింది. కానీ, దక్షిణ కొరియాలోని కొన్ని వర్గాలు అమెరికా మాటలను నమ్మడంలేదు. ఈ నేపథ్యంలో సొంతంగా అణ్వస్త్రాలను అభివద్ధి చేసుకోవాలనే డిమాండ్ మొదలైంది. మరోవైపు ఉత్తరకొరియా కూడా అణుబాంబులను అభివద్ధి చేసింది. ఈ నేపథ్యంలో అమెరికా - దక్షిణ కొరియా మధ్య వాషింగ్టన్ డిక్లరేషన్ జరగటం గమనార్హం.

దక్షిణ కొరియా అధ్యక్షుడు యూ సుక్ యోల్ వైట్ హౌస్‌లో మాట్లాడుతూ "వాషింగ్టన్ డిక్లరేషన్ రూపంలో దక్షిణ కొరియాకు అద్భుతమైన హామీ లభించింది" అని పేర్కొన్నారు.

అవినీతి అనకొండలు..!

గిరిజన సంక్షేమ శాఖలో అక్రమాల బాగోతం

- జిల్లా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించిన వైనం
- పోస్టింగుల్లో త్రిమూర్తులదే రాజ్యం: విచారణ కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి లేఖ
- నేటికీ చేపట్టని విచారణ



నవ తెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

జిల్లా కలెక్టర్‌ను సైతం పక్కదోవ పట్టించి కొంతమంది అధికారులు తప్పుడు పత్రాలతో సంతకాలను ఫోర్జరీ చేసి ప్రభుత్వ శాఖలో అనర్హులకు పోస్టులను కట్టబెట్టిన వైనం గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓ పక్క పేదల సంక్షేమమే తమ ధ్యేయమని చెబుతూ ఉంటే కమిషన్లకు అలవాటు పడ్డ కొంతమంది అధికారులు గిరిజన సంక్షేమ శాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడటం గమనార్హం. నిరుపేద గిరిజనులు, విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తుంటే.. అవినీతి అధికారులు కొందరు ఆ సొమ్మును స్వాహా చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను పక్కదోవ పట్టిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. నల్లగొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో గతంలో తిష్ట వేసి పనిచేసిన ముగ్గురు అధికారుల హయాంలో జరిగిన అవినీతి అక్రమాల బండారం తాజాగా బటయపడింది.

గిరిజన సంక్షేమ శాఖలో 2016 నుంచి 2019 వరకు పనిచేసిన ముగ్గురు అధికారులు ఈ పని చేశారు. అందులో ఒకరు రిటైర్ అయ్యారు. మరొకరు సూర్యాపేట గిరిజన సంక్షేమ శాఖకు, ఇంకొకరు తిరుమలగిరి సాగర్‌కు బదిలీ అయ్యారు. ఈ ముగ్గురు అధికారులు.. ఉన్నతాధికారుల అండదండలతో, రాజకీయ నాయకుల పలుకుబడితో ఎలాంటి ప్రభుత్వ ఉత్తర్వులూ లేకుండా జీవో నెంబర్ 212లోని నియమ నిబంధనలకు విరుద్ధంగా 54 మంది టైం స్కేల్ వర్కర్లను నియమించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం దుబ్బ తండాకు చెందిన పలువురు గిరిజనులు గతేడాది అక్టోబర్ 30వ తేదీన ముఖ్యమంత్రి కార్యాలయానికి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌కు లేఖలు పంపారు. అయితే పైన తెలిపిన ఏ శాఖ కూడా జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టకుండా లేఖను బుట్ట దాఖలు చేశారని తెలిసింది. అయితే ఫిర్యాదుదారులు తెలంగాణ విజిలెన్స్ శాఖకు కూడా పంపడంతో అసలు విషయం బయటపడింది. విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ కార్యదర్శిని ఆదేశించడంతో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ కార్యదర్శి విచారణకు డిప్యూటీ డైరెక్టర్ విజయ లక్ష్మిని ఆదేశించారు. ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టాల్సి ఉండగా జరగక పోవడంతో మరిన్ని అనుమానాలకు ఆస్కారం ఏర్పడింది. దాంతో ఇందులో కూడా ఏమైనా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. విచారణ నిమిత్తం అదే రోజు గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయానికి వచ్చిన టైం స్కేల్ బాధితులు డిప్యూటీ డైరెక్టర్ రాకపోవడంతో సాయంత్రం వరకు వేచి చూసి వెనుతిరిగారు.

> **బిజీ వల్ల రాలేకపోయారు..**
> వాస్తవానికి మేడం రావాల్సి ఉంది. బిజీ వల్ల రాలేకపో యారేమో. మరొక రోజైనా తప్ప కుండా వస్తారు. అది నా పరిధి విషయం కాదు. మేడమే వచ్చి ఎంక్వయిరీ చేస్తారు.
> **- రాజ్ కుమార్ - నల్లగొండ డీటీడబ్ల్యూఓ**

అవినీతి అక్రమాల చిట్టా

గతంలో పనిచేసిన డీటీడబ్ల్యూఓ నకిలీ ఉత్తర్వులు సృష్టించి, సంతకాలన్నీ ఫోర్జరీ చేసి ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా జిల్లా కలెక్టర్‌ను తప్పుదారి పట్టించడం వల్లే అవినీతి అక్రమాలకు తెర దించారని తెలుస్తోంది. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన మధ్యవర్తి ప్రధాన పాత్ర పోషించి ఒక పోస్టుకు రూ.2 నుంచి 5 లక్షల వరకు వసూలు చేసి సంబంధిత అధికారులకు ముట్టచెప్పినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. టైం స్కేల్ ఉత్తర్వులు జారీ చేయడంలో బదిలీ అయిన ఒక అధికారి కీలక పాత్ర వహించినట్టు తెలుస్తోంది. రెండో స్థాయి అధికారి అండదండలతో నియమాలను బ్రేక్ చేసి, అర్హులను తొక్కేసి 54 మంది వర్కర్లను నియమించారు. విషయం బయటకు పోకుండా రాజకీయ పలుకుబడితో పనులు కానిచ్చారని, తమ మాట వినని అధికారులను రాజకీయ అండదండలు, డబ్బులు వెదజల్లి జిల్లా దాటించినట్టు సమాచారం. ఇందులో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించిన వ్యక్తి సమీప బంధువులు కూడా ఉద్యోగాలు పొందారు. వారంతా విధులు నిర్వహించకపోయినా వేతనాలు పొందుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం హెచ్‌డబ్ల్యూఓ గ్రేడ్ వన్ అధికారి.. గతంలో ఎస్జీటీ నుంచి హెచ్‌డబ్ల్యూఓ గ్రేడ్-2గా ప్రమోషన్ తీసుకున్న సందర్భంలోనూ జీవో 45 నిబంధనలను పాటించకుండా పదోన్నతి పొందినట్టు రుజువైంది.

డీటీడీఓపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్నప్పటికీ పదోన్నతి పొందిన అధికారి మాత్రం పదవి అనుభవిస్తూ శాఖపై పూర్తి అజమాయిషీ చేస్తున్నారు. అంతేకాకుండా వసతి గృహాల్లో బయోమెట్రిక్ హాజరు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ హాజరు లేకుండా డైట్ చార్జీలను డ్రా చేస్తున్నారు. అంతేకాదు, విద్యార్థులకు పెట్టాల్సిన మెనులోనూ నాణ్యత పాటించడం లేదని, ఎమ్ఎల్ఎస్ పాయింట్ల నుంచి వచ్చే బియ్యాన్ని విద్యార్థుల కోసం ఉపయోగించకుండా అక్కడే వాటిని విక్రయిస్తున్నారు. విద్యార్థుల కోసం జీసీసీ (గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్) నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూరు నుంచి కొనుగోలు చేయాల్సిన కిరాణా సరుకులను తమకు తెలిసిన షాపు వద్ద సరిపడా కొనుగోలు చేయకుండా విద్యార్థుల సంఖ్యకు సగానికి మాత్రమే వస్తువులు కొనుగోలు చేసి నకిలీ బిల్లులను సృష్టించారు. వస్తువులను విక్రయించిన షాప్ యజమాని ఖాతాలో వేయాల్సిన డబ్బులను వారి డీడీఓ అకౌంట్‌లో వేసుకొని డ్రా చేసి వారికి ఇవ్వాల్సింది ఇచ్చి మిగతావి కమిషన్ రూపంలో నొక్కేస్తున్నారు. అంతేకాదు, మెడికల్ అలవెన్స్, హాస్టల్ భవనాల రిపేర్లకు సంబంధించిన బిల్లులు, విద్యార్థులకు పంపిణీ చేసే నోటు పుస్తకాలు, బ్లాంకెట్లు, షాపులు, తదితర సామగ్రిలోనూ అవినీతికి పాల్పడ్డారని తెలిసింది.

> **ఆరు నెలలు దాటినా చేపట్టని విచారణ : ఫిర్యాదుదారులు**
> గిరిజన సంక్షేమ శాఖలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌కు లేఖ రాసినా నేటికీ ఎలాంటి విచారణా చేపట్టలేదు. విజిలెన్స్ అధికారులే రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టాలి. విషయంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని అవినీతికి పాల్పడ్డ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలి. లేనిపక్షంలో తమ కార్యాచరణను ప్రకటించి పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

6 నుంచి 9వ తరగతి వరకు తొలిమెట్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమం (తొలిమెట్టు) వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 2022-23 విద్యాసంవత్సరంలో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. విద్యార్థులందరికీ ప్రణాళికాబద్ధంగా బోధనాభ్యసన కార్యక్రమాలను అమలు చేయాల్సి ఉంటుంది. కరోనా మహమ్మారి నేపథ్యంలో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పూర్తిగా పడిపోయిన విషయం తెలిసిందే. ఆ సామర్థ్యాన్ని పెంచడం కోసమే ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ప్రజల ఎజెండాతోనే దేశ రాజకీయాల్లోకి అడుగు : మంత్రి జగదీష్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజల ఎజెండాతోనే బీఆర్ఎస్ దేశ రాజకీయాల్లోకి అడుగు పెట్టిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోడీకి మూడిందనీ, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గురువారం తెలంగాణాభవన్ లో జరిగిన బీఆర్ఎస్ ప్లీనరీ సందర్భంగా తనను కలిసి విలేకర్లతో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షానికి కూడా పనికి రాకుండా పోయిందని ఎద్దేవాచేశారు. రాజకీయాల్లో ఎత్తుగడలు వేయడంలో సీఎం కేసీఆర్ దిట్ట అని చెప్పారు. ఏ రాష్ట్రంలో ఏ సమయంలో ఏ ఎత్తుగడ వేయాల్లో కేసీఆర్‌కు తెలిసినంతగా మరొకరికి తెలియదని స్పష్టం చేశారు. సమయానుకూలంగా ఎత్తుగడలు ఉంటాయని తేల్చి చెప్పారు. అటువంటి ఎత్తుగడలతో తెలంగాణా రాష్ట్ర సాధించుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సరికొత్త ఎత్తుగడలతోనే దేశ రాజకీయాల్లోకి తెలిపారు.

టర్కీ సార్వత్రిక ఎన్నికలు

- ప్రవాస టర్కీయుల ఓటింగ్ ప్రారంభం

అంకారా : టర్కీ జాతీయ ఎన్నికల్లో విదేశాల్లో నివసిస్తున్న లక్షలాదిమంది టర్కిష్ జాతీయులు ఓటు వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 16 పోలింగ్ కేంద్రాల్లో మే 9 వరకు వీరు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. టర్కీలో మాత్రం మే 14వరకు ఓటింగ్ జరగదు. అధ్యక్షుడు రెసెప్ తైయిప్ ఎర్డోగన్‌కు మరోసారి అధికార పగ్గాలు అందిస్తారో లేదో ఈ ఎన్నికల్లో తేలిపోనుంది. ఎర్డోగన్ ఆరోగ్యంపై ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆరోగ్యం బాగుండకపోవడంతో బుధ, గురువారాల్లో పాల్గొనాల్సిన ఎన్నికల ర్యాలీలను కూడా ఆయన రద్దు చేసుకున్నారు. కాగా, ఓటింగ్ ముందు 110మంది కుర్దిష్ అనుకూల అనుమానితులను టర్కీ అదుపులోకి తీసుకుంది. విదేశాల్లో వున్న టర్కీ జాతీయుల్లో అత్యధికంగా జర్మనీలో 15లక్షల మంది వున్నారు. గత ఎన్నికల్లో జర్మనీలోని మెజారిటీ టర్కిష్ ఓటర్లు ఎర్డోగన్‌కు మద్దతిచ్చారు. ఈసారి ఎన్నికల్లో కూడా అదే రీతిలో మద్దతు లభిస్తుందా లేదా అనేది చూడాలి. కాగా, ఎర్డోగన్ ప్రధాన ప్రత్యర్థి, సెంటర్ లెఫ్ట్ ప్రతిపక్ష పార్టీ నేత కెమల్ ప్రస్తుతం స్వల్ప ఆధిక్యతలో వున్నట్లు ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది. ఇటీవలి కాలంలో ఎర్డోగన్ నిరంకుశ వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టర్కీలో కుటుంబ మూలాలు వున్న జర్మనీ వ్యవసాయ మంత్రి సెమ్ ఒజ్‌డెమిర్ మాట్లాడుతూ, ఈసారి ఎన్నికల్లో కెమల్ గెలుపొందితే టర్కీలో తిరిగి ప్రజాస్వామ్యం నెలకొంటుందని ఆశిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.

నకిలీ ధ్రువపత్రాల తయారీ ముఠా అరెస్ట్

- బీమా పత్రాలు, ఆర్సీలు, కంపెనీల లోగోలు స్వాధీనం
- 17 మంది అరెస్ట్ : ఎస్పీ




నవతెలంగాణ -ధరూర్

నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలు, చలాన్లు తయారు చేస్తున్న 17 మందిని జోగులాంబ గద్వాల జిల్లా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సృజన వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన మీసాల రామస్వామి ఆర్టీఏ ఏజెంట్. తనకున్న సాంకేతిక పరిజ్ఞానం, రోడ్డు రవాణా కార్యాలయాల్లో ఉన్న లొసుగులు, పరిచయాలను అనుగుణంగా మలచుకొని లారీలు, పాఠశాలల బస్సులు, ఇతర ప్రయివేటు వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్ తదితరాలకు సంబంధించి చలాన్లు, ఇన్సూరెన్స్ ప్రభుత్వానికి చెల్లించకుండా.. నకిలీ పత్రాలు సృష్టించి పనులు కానిస్తున్నాడు. తన పనిని నంద్యాల, వనపర్తి, జోగులాంగ గద్వాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాలకు విస్తరించాడు. కొంతమంది ఆర్టీఏ ఏజెంట్లు, ఆటో ఫైనాన్స్ నిర్వాహకులు, డ్రైవర్లను తన ఏజెంట్లుగా నియమించుకున్నాడు. వచ్చిన డబ్బుల్లో తాను సగం తీసుకుని మిగతాది ఏజెంట్లకు ఇచ్చేవాడు. దీనిపై గద్వాల జిల్లాలకు చెందిన కొందరు బాధితులు, ఇన్సూరెన్స్ కంపెనీల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు రామస్వామిని అదుపులోకి తీసుకొని విచారణ జరపడంతో మొత్తం 17 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. మిగతావారిని గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి కారు, రెండు కలర్ ప్రింటర్స్, రెండు ల్యాప్‌టాప్స్, నకిలీ ఆర్సీలు, ఇన్సూరెన్స్ పత్రాలు, కంపెనీల లోగోలతో కూడిన డాక్యుమెంట్స్, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేస్తున్నారు. ఈ ముఠాను అరెస్టు చేయడంలో ప్రధాన భూమిక పోషించిన గద్వాల డీఎస్పీ రంగస్వామి, అలంపూర్ సీఐ సూర్యనాయక్, ఎస్ఐలను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదం.. నలుగురు కూలీల దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులోని అర్సపల్లి బైపాస్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం సాయంత్రం నిజామాబాద్ నుంచి బోధన్ మండలం ఊటిపల్లికి డ్రైవర్ సహా తొమ్మిది మంది భవన నిర్మాణ కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన బొలెరోపికప్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మహిళ పరిస్థితి విషమంగా ఉండగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరు స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో ప్రశాంత్ (డ్రైవర్)(35), చరణ్ నాయక్ (25), డి.శ్యాం(48) అక్కడికక్కడే చనిపోయారు. రేఖ(32) ఆస్పత్రిలో మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన శేఖర్, కృష్ణ, ఆర్.కృష్ణను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నిజామాబాద్‌లో కొత్తగా ప్రభుత్వం నిర్మిస్తున్న ఐటి హబ్ నిర్మాణంలో పనులు చేసి కూలీలు ఇంటికి తిరిగి పోతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలిసింది. ఘటనా స్థలంలో ఆరో టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, రూరల్ నార్త్ సీఐ నరహరి, ఎస్ఐ సాయికుమార్ సందర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

బిజినెస్

యాక్సిస్ బ్యాంక్‌కు రూ.5,728 కోట్ల నష్టాలు

• సిటీ బ్యాంక్ స్వాధీనంతో ప్రభావం



న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.5,728.42 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. సిటీ బ్యాంక్ ఇండియా కన్స్యూమర్ బిజినెస్‌ను స్వాధీనం చేసుకున్నట్టు మార్చి1న యాక్సిస్ బ్యాంక్ ప్రకటించింది. ఇందుకోసం రూ.11,603 కోట్లు చెల్లించింది. ఆ సంస్థ స్వాధీనానికి చెల్లింపులు చేయడంతో నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం 2021-22 క్యూ4లో రూ.6,625 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ4లో యాక్సిస్ బ్యాంక్ నికర వడ్డీపై ఆదాయం 33 శాతం పెరిగి రూ.11,742 కోట్లకు చేరింది. డిపాజిట్లు 15 శాతం పెరిగినట్టు తెలిపింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.38 శాతం నుంచి 2.02 శాతానికి తగ్గాయని వెల్లడించింది. గడిచిన క్యూ4లో ఏడాదికేడాదితో పోల్చితే రుణాల జారీలో 19 శాతం వృద్ధిని కనబర్చింది. దేశీయ రుణాల విభాగంలో 23 శాతం పెరుగుదల నమోదయ్యింది. రిటైల్ రుణాల్లో 22 శాతం వృద్ధి సాధించింది. బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ 12 శాతం పెరిగి రూ.13,17,326 కోట్లకు చేరింది. 2022-23కు గాను బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.1 డివిడెండ్‌ను ప్రకటించారు. గురువారం బీఎస్ఈలో యాక్సిస్ బ్యాంక్ షేర్ 0.76 శాతం తగ్గి రూ.881.05 వద్ద ముగిసింది.

మూడు వేల నగరాలకు ఎయిర్‌టెల్ 5జీ

న్యూఢిల్లీ : ప్రయివేటు టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ దేశంలో 3000 పైగా నగరాలు, పట్టణాల్లో 5జీ సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు గురువారం ప్రకటించింది. ఇక జమ్మూలోని కత్రా నుంచి కేరళలోని కన్నూర్ వరకు, బీహార్‌లోని పాట్నా నుంచి తమిళనాడులోని కన్యాకుమారి, ఇటా నగర్ నంచి డామన్ డయ్యూ వరకు అనేక నగరాల్లో తమ అపరిమిత 5జీ సేవలను పొందవచ్చని పేర్కొంది. '2023 సెప్టెంబర్ నాటికి ప్రతీ పట్టణం, కీలక గ్రామాలకు తమ 5జీ సేవలను విస్తరించనున్నాము. ప్రతీ రోజు 30-40 నగరాల్లో కొత్తగా 5జి సేవలను ప్రారంభిస్తున్నాం' అని భారతీ ఎయిర్‌టెల్ సీటీఓ రందీప్ సెఖోన్ తెలిపారు.

టాటా ప్లే బింగేలోకి ఆహా

ఆహా

హైదరాబాద్ : ప్రముఖ ఓటీటీ అగ్రిగేషన్ వేదిక టాటా ప్లే బింగేలోకి ఆహా యాప్ చేరింది. మైహోమ్ గ్రూప్, అల్లు అరవింద్ సహ యాజమాన్యంలోని ఆహా తమ వేదికలో చేరడంతో టాటా ప్లే బింగేలోని ఓటీటీ యాప్‌లు 24కు చేరినట్లయ్యిందని ఆ సంస్థ తెలిపింది. ఆహా ప్రస్తుతం 750 పైగా సినిమాలు, 40 పైగా ఒరిజినల్ షోలు సహా థియేటరికల్ రిలీజ్‌లు, టాక్ షోలు, రియాలిటీ షోలతో సహా పలు రకాల ఒరిజినల్ సీరిస్‌లు కలిగి ఉంది.

విప్రో 26.9 కోట్ల షేర్ల బైబ్యాక్

బెంగళూరు : దిగ్గజ ఐటి కంపెనీ విప్రో 2022-23 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 0.4 శాతం తగ్గుదలతో రూ.3,074 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.3,087 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ4లో కంపెనీ రెవెన్యూ 11శాతం పెరిగి రూ.23,190 కోట్లుగా చోటు చేసుకుంది. కాగా.. వాటాదారుల నుంచి 26.9 కోట్ల షేర్ల బైబ్యాక్‌కు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇది మొత్తం షేర్లలో 4.91 శాతానికి సమానం. ప్రతీ షేర్‌కు రూ.445 చెల్లించడానికి ముందుకు వచ్చింది. ఇందుకోసం దాదాపు రూ.12,000 కోట్ల మేర వ్యయం చేయనుంది.

హైదరాబాద్ మార్కెట్లోకి ఎంజి మోటార్ కోమెట్

• సింగిల్ చార్జ్‌తో 230 కిలోమీటర్లు



హైదరాబాద్ : ఎంజి మోటర్ ఇండియా ఆవిష్కరించిన సరికొత్త విద్యుత్ వాహనం (ఇవి) కోమెట్‌ను హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. గురువారం దీన్ని బంజారాహిల్స్ షోరూంలో ఎంజి ఇండియా రీజినల్ సేల్స్ మేనేజర్ పవర్ కుమార్, రామ్ గ్రూప్ సిఇఒ అనురాగ్ సిన్హా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. కోమెట్ ఎక్స్ షోరూం ధరను రూ.7.98 లక్షలుగా నిర్ణయించామన్నారు. సింగిల్ చార్జ్‌పై దాదాపు 230 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని తెలిపారు. రూ.519 వ్యయంతో 1000 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. గురువారం నుంచి టెస్ట్ డ్రైవ్‌లు మే 15 నుంచి బుకింగ్స్, ఆ తర్వాత డెలివరీలు ఉంటాయని ఆ కంపెనీ ఇది వరకే తెలిపింది. 17.3 కెడబ్ల్యుహెచ్ లిథియం-ఇయాన్ బ్యాటరీ కలిగిన ఈ వాహనం ఏడు గంటల్లో పూర్తిగా ఛార్జింగ్ అవుతుందన్నారు.

అమెజాన్ ప్రైమ్ 67 శాతం భారం

న్యూఢిల్లీ : అమెజాన్ ప్రైమ్ భారీగా ధరలు పెంచుతూ తమ వినియోగదారులకు పెద్ద షాక్ ఇచ్చింది. నెలవారీ చందాను ఏకంగా 67 శాతం పెంచి రూ.299కు చేర్చింది. పెంచిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని గురువారం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఇది రూ.179గా ఉంది. మూడు నెలల చందా ధరను రూ.459 నుంచి 599కి చేర్చింది. ఏడాది చందా ధరను యథాతథంగా రూ.1499గా కొనసాగించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి 2024 జనవరి వరకు పాత ధరలనే అమలు చేయనున్నట్లు వెల్లడించింది.

ఉడాన్‌లోకి రిలయన్స్ బ్రాండ్ 'క్యాంపా'

బెంగళూరు: రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కొత్తగా బి2బి వేదిక ఉడాన్‌తో జట్టు కట్టడం ద్వారా తన పానీయాల బ్రాండ్ 'క్యాంపా' శ్రేణీని రిటైలర్లు, చిన్న కిరాణ స్టోర్లకు మరింత అందుబాటులోకి తెచ్చింది. ఉడాన్‌తో భాగస్వామ్యం వల్ల క్యాంపా ఉత్పత్తులు 50,000 కంటే ఎక్కువ రిటైలర్లు, కిరాణ స్టోర్‌లకు అందుబాటులోకి రానుందని పేర్కొంది. ఈ పంపిణీ కవరేజ్ వచ్చే రెండు నెలల్లో లక్షకు పైగా స్టోర్‌లకు క్రమంగా విస్తరించనుదని ఆశాభావం వ్యక్తం చేసింది.

రూ.6500 కోట్ల సమీకరణలో అదానీ గ్రూపు..!

న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ తన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం 800 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.6,500 కోట్లు) సమీకరించనుందని సమాచారం. ఈ ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ రిపోర్ట్ ఆరోపణల తర్వాత తీవ్ర ప్రభావితం అయిన అదానీ గ్రూపు తొలిసారి నిధుల సేకరణకు వెళ్లనుంది. కొత్త అప్పుల కోసం మిట్సూయి బ్యాంకింగ్ కార్ప్, డిబిఎస్ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ తదితర గ్లోబల్ బ్యాంక్‌లతో చర్చలు జరుగుతున్నాయని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు పేర్కొన్నట్లు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. 700 మిలియన్ డాలర్ల నుంచి 800 మిలియన్ డాలర్లు సమీకరించాలని నిర్దేశించుకున్నట్లు సమాచారం.

మత్స్యకారులపై హామీల వర్షం

ఉడుపి: కర్ణాటకలో ఓటర్లను తమ వైపు ఆకర్షించేందుకు వివిధ పార్టీలు అనేక హామీలు గుప్పిస్తున్నాయి. తాజాగా ఉడుపి జిల్లాలోని కాపు ప్రాంతంలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ వారిపై హామీల వర్షం కురిపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మత్స్యకారులకు రూ.10లక్షల బీమా సౌకర్యంతో పాటు వడ్డీ లేకుండా రూ.లక్ష రుణం, రోజుకు 500 లీటర్ల వరకు ఒక్కో లీటరు డీజిల్‌పై రూ.25ల చొప్పున రాయితీ అందించనున్నట్టు హామీ ఇచ్చారు.

బిజెపి పాలనలోని అవినీతి, ధరల పెరుగుదల మత్స్యకారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయన్నారు. బ్యాంకు రుణాలు పొందడం కూడా వీరికి కష్టంగా మారిందని ఆరోపించారు. చేపల సంఖ్య తగ్గిపోతుండటం, ఖర్చులు పెరిగిపోవడంతో వేట కష్టంగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ఇప్పుడు ఇచ్చిన హామీలన్నీ తొలి కేబినెట్ సమావేశంలోనే అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మరో సమాచార చౌర్యం!

కర్నాటక అభ్యర్థులకు ఓటర్ల వివరాల విక్రయం

• బెంగళూరు సంస్థ నిర్వాకం

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన అధికారిక పోర్టల్ 'ఎరోనెట్' నుంచి విలువైన సమాచారం చౌర్యానికి గురైంది. ఓటర్ల వివరాలన్నీ ఈ పోర్టల్‌లోనే నిక్షిప్తమై ఉంటాయి. వాస్తవానికి ఈ పోర్టల్‌లోని సమాచారం కేవలం ఎన్నికల అధికారులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. కానీ బెంగళూరుకు చెందిన ఓ ప్రయివేటు సంస్థ ఈ సమాచారాన్ని దొంగిలించి, కర్నాటక ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు అమ్ముకుంటోంది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతోందన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓటర్ల వివరాలు సేకరించి, వారిని ప్రలోభపెట్టేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

దీనిని అవకాశంగా తీసుకొని బెంగళూరు సంస్థ ఆ సమాచారాన్ని ఆయా పార్టీలకు బేరం పెట్టింది. లక్షలాది ఓటర్ల పేర్లు, వారి చిరునామాలు, ఫోన్ నెంబర్లు వంటి వివరాల న్నింటినీ ఈ సంస్థ సేకరించింది. కర్నాటకలోని పార్టీలు, అభ్యర్థులు కేవలం పాతిక వేల రూపాయలకే తమకు కావాల్సిన ఓటర్ల సమాచారాన్ని కొనుగోలు చేస్తు న్నారని 'ది న్యూస్ మినిట్' అనే పత్రిక తెలిపింది. బెంగళూరు సంస్థ యజమాని ఎవరో తెలుసుకునేందుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోంది. ఈ సంస్థ కేవలం ఓటర్ల సమాచారాన్ని మాత్రమే విక్రయించిందా లేక యూపీఐ ద్వారా వారి ఖాతాలలో సొమ్ము జమ చేసి వారి ఓట్లను కొనుగోలు చేసేందుకు కూడా ప్రయత్నించిందా అనే విషయాన్ని కూపీ లాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

దేశంలో ఇలాంటి ఉదంతం చోటుచేసుకోవడం ఇది మొదటిసారి కాదు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఓటర్ల సమాచారాన్ని విక్రయించిన ఘటనలు గతంలో అనేకం జరిగాయి. ఈ వ్యవహారమంతా ఓటర్లకు తెలియకుండానే, వారి అనుమతి తీసుకోకుండానే జరిగిపోతోంది. దేశంలో సమాచార భద్రత, గోప్యతకు సంబంధించి ఇలాంటి ఉదంతాలు అనేక తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. గతంలో ఒక కేసుకు సంబంధించి ఎన్నికల కమిషన్ తరపున బెంగళూరు డివిజన్ ప్రాంతీయ కమిషనర్ అమల్ ఆదిత్య బిశ్వాస్ విచారణ జరిపారు. బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) తరపున పనిచేసిన పలువురు అధికారులు చిల్యూమ్ అనే ప్రైవేటు ట్రస్ట్‌కు అవాంఛనీయ, అక్రమ లబ్ది చేకూర్చారని ఆయన తేల్చారు. ఓటర్ల సమాచారాన్ని సేకరించేందుకు వారు ఆ ట్రస్ట్‌కు అనుమతి ఇచ్చారని నిర్ధారించారు.

రాజు అనే స్వతంత్ర అభ్యర్థి ఫిర్యాదు చేయడంతో తాజా చౌర్యం వెలుగులోకి వచ్చింది. ఓటర్ల సమాచారాన్ని అమ్మే వ్యక్తి ఫోన్ ద్వారా రాజును సంప్రదించాడు. ఆ వెంటనే ఆయన ఈ విషయాన్ని ఎన్నికల అధికారి శ్రీనివాస్ దృష్టికి తీసికెళ్లారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 24న కేసు నమోదు చేశారు. రాజుకు ప్రైవేటు సంస్థ ఇచ్చిన లాగిన్ వివరాలతో 'ది న్యూస్ మినిట్' పత్రిక ఆ పోర్టల్‌లో ప్రవేశించింది. అందులో ఆరున్నర లక్షల మంది ఓటర్ల సమాచారం ఉంది. ఎన్నికల కమిషన్‌లో పనిచేస్తున్న వారు ఈ చౌర్యానికి పాల్పడి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. హ్యాకింగ్ జరిగే అవకాశం కూడా లేకపోలేదని వారు తెలిపారు. చౌర్యానికి పాల్పడిన కంపెనీని ఈ నెలలో ఢిల్లీలో రిజిస్టర్ చేసినట్లు మాత్రమే సమాచారం అందుబాటులో ఉంది. కంపెనీ పోర్టల్‌లోకి వెళితే 'ఇరవై ఐదు వేలు చెల్లించి ఓటర్ల వివరాలు పొందండి. ఎన్నికలలో విజయం సాధించండి' అనే సందేశం కన్పిస్తోంది. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలన్నీ ఇందులో లభిస్తున్నాయి.

దేశంలోని సమాచార రక్షణ చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ ఉదంతం నొక్కి చెబుతోంది. పౌరుల సమాచార గోప్యతను కాపాడేందుకు, సమాచారం దుర్వినియోగం కాకుండా చూసేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని నిపుణులు కోరుతున్నారు.

పని గంటలపై త్వరలో ఐఎల్ఓ నివేదిక

• వీటిని పెంచాలంటున్న రాష్ట్రాలు

• 8 గంటలు చాలంటున్న ఐఎల్ఓ

న్యూఢిల్లీ : దేశంలో పని గంటలను ఎనిమిది నుండి పన్నెండుకు పెంచాలని అనేక రాష్ట్రాలు భావిస్తున్న నేపథ్యంలో దీనిపై అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) త్వరలోనే ఒక నివేదికను రూపొందించబోతోంది. దేశంలో ప్రస్తుతం అమలవుతున్న పని గంటలను ఈ నివేదిక సమీక్షిస్తుంది. పని గంటలు పెంచితే ప్రజలు పనిని, జీవనాన్ని ఎలా సమతూకం చేసుకోగలరన్న విషయాన్ని కూడా అధ్యయనం చేస్తుంది.జూలై-ఆగస్ట్ నాటికి ఐఎల్ఓ తన నివేదికను రూపొందిస్తుందని ఎకనమిక్ టైమ్స్ తెలిపింది.

పని గంటలు, పని-జీవనం సమతూకం... ఈ రెండు అంశాలు కార్మిక విధానాల రూప కల్పనలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే విధానాలను నిర్ణయించేటప్పుడు ఈ విషయాలను పాలకులు విస్మరిస్తున్నారు. నిర్ణీత సమయం కంటే ఎక్కువ సమ యం పని చేయడం లేదా తక్కువ సమయం పని చేయడం వంటి అంశాలను కూడా ఐఎల్ఓ పరిశీలిస్తుంది. అయితే నివేదికపై ఐఎల్ఓ ఇప్పటివరకూ అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల చేయ లేదు.

పని గంటలను 8 నుండి 12కు పెంచి, కార్మికులు వారానికి 48 గంటలు పని చేసేలా చూడాలని పలు రాష్ట్రాలు ప్రతిపాదిస్తు న్నాయి. అంటే వారానికి నాలుగు రోజుల పని దినాలు ఉంటాయి. భారత్‌లో నెలకొన్న పని పరిస్థితులను ఇతర ఆగ్నేయాసియా దేశాలతో ఐఎల్ఓ పోల్చుతుంది. దేశంలో పని వాతావరణాన్ని మెరుగుపరచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సిఫార్సులు చేస్తుంది. వారానికి 48 పని గంటలు ఉండాలని ఐఎల్ఓ సూచిస్తూనే రోజుకు 8 గంటల చొప్పున వారానికి 6 రోజుల పని దినాలు ఉండాలని అభిప్రాయపడుతోంది. వాస్తవిక పని గంటలు, కార్మికులు కోరుకునే కాల వ్యవధిని కూడా ఐఎల్ఓ బేరీజు వేస్తుంది. పని గంటలపై ఐఎల్ఓ రూపొందించిన అంతర్జాతీయ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో మూడో వంతు ప్రజలు వారానికి 48 గంటలకు పైనే పని చేస్తున్నారు. ఐదో వంతు ప్రజలు మాత్రం వారానికి 35 గంటల కంటే తక్కువ సమయం పని చేస్తున్నారు.

పని గంటలు ఎక్కువ ఉండడం వల్ల ఎదురయ్యే సమస్యలను ఐఎల్ఓ అంతర్జాతీయ నివేదిక ప్రస్తావించింది. పని గంటలు పెరిగితే ప్రజల ఆరోగ్యంపై, వ్యక్తిగత జీవితంపై ప్రభావం పడుతుందని తెలిపింది. అంతేకాక వారి సామర్థ్యం కూడా తగ్గిపోతుంది. ప్రజలకు వెసులు బాటుగా ఉండే పని గంటలను నిర్ణయించాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడింది. పనిని, జీవ నాన్ని మరింత మెరుగ్గా సమతూకం చేసుకునేందుకు పని గంటలను తగ్గించాలని కూడా సూచించింది.

సూసైడ్ నోట్‌పై ప్రధాని జోక్

• ప్రియాంకగాంధీ ఆగ్రహం



న్యూఢిల్లీ : 'సూసైడ్‌నోట్' నోట్‌పై ప్రధాని జోక్ వేయటంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది సున్నితమైన మానసిక ఆరోగ్య సమస్యలను అనారోగ్యకరమైన రీతిలో ఆపహాస్యం చేయటమేనని విమర్శించారు. ఓ మీడియా ఛానెల్ నిర్వహించిన సదస్సులో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఆ ఛానెల్ ఎడిటర్ ఇన్ చీఫ్ హిందీలో స్పష్టంగా మాట్లాడుతున్నారనీ, ముంబయిలో ఉండటంతో హిందీ బాగా మాట్లాడగలు గుతున్నారని అన్నారు. అనంతరం ఓ జోక్‌ను చెప్పారు. 'ఒక ప్రొఫెసర్ తన కుమార్తె రాసిన సూసైడ్ నోట్‌ను చదువుతున్నప్పుడు, అతను చాలా ఏండ్లపాటు ప్రయత్నించినప్పటికీ ఆమె స్పెల్లింగ్స్ తప్పుగా రాయడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు' అని ప్రధాని అన్నారు. దీంతో అక్కడున్న వారంతా నవ్వుతూ ఆ జోక్‌ను ఎంజాయ్ చేయడం గమనార్హం. దీనిపై ప్రియాంక స్పందించారు. మానసిక ఒత్తిడి, ఆత్మహత్యలు ముఖ్యంగా యువతలో నవ్వుకునే అంశాలు కావని పేర్కొన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) సమాచారం ప్రకారం... 2021లో 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారనీ, వీరిలో అధిక శాతం 30 ఏండ్లలోపు వారేనని అన్నారు. ఇది హృదయవిదారకమైన అంశమని తెలిపారు.

గురుకుల డీఎల్‌కు వారికీ అవకాశమివ్వాలి

• మంత్రి సబితకు ఏఐఎస్ఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకుల డిగ్రీ లెక్చరర్ (డీఎల్) పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో నూతనంగా సెట్, నెట్ అర్హత సాధించిన వారికి కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని గురువారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శివ నాయకులు కళ్యాణ్, వీరస్వామి కలిసి వినతిపత్రం సమర్పించారు. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థులు సెట్, నెట్ పరీక్షలు రాసి ఉన్నారని తెలిపారు. వాటి ఫలితాలు రావడంలో ఆలస్యమైందని పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. గురుకుల అధికారులకు ఫోన్ చేసి నూతనంగా అర్హత పొందిన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని, నిరుద్యోగులెవరూ నష్టపోవద్దని మంత్రి సూచించారని పేర్కొన్నారు.

యుఏఈ, మలేషియాలో ఉద్యోగాలు

ఆకర్షణీయమైన జీతం, ప్యాకేజీ

• అర్హులు పేర్లను నమోదు చేసుకోవాలి: టామ్‌కామ్ సీఈవో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యుఏఈ, మలేషియాలో ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను సంస్థ వెబ్‌సైట్ లేదా యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) సీఈవో ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆయా దేశాల్లో ఉద్యోగాలకు ఆకర్షణీయమైన జీతం, ప్యాకేజీ ఇస్తున్నారనీ, రిక్రూటింగ్ కంపెనీయే ఆహారం, వసతి, విమాన టికెట్లను అందిస్తుందని తెలిపారు. యుఏఈలో బ్లాస్టర్ పెయింటర్, జనరల్ హెల్పర్, ఫోర్‌మాన్-బ్లాస్టింగ్ అండ్ పెయింటింగ్ తదితర ఖాళీలున్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం టామ్కామ్ వెబ్‌సైట్ లేదా 78935 66493, 99519 09863, 83286 02231 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హెూంమంత్రి అమిత్ షాపై కేసు..

• నమోదు చేసిన కాంగ్రెస్



బెంగళూరు : కేంద్ర హెూం మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ గురువారం కేసు నమోదు చేసింది. అమిత్‌షా రెచ్చగొట్టే ప్రకటనలు చేశారంటూ కాంగ్రెస్ సీనియర్ నేతలు రణదీప్ సింగ్ సూర్జేవాలా, డాక్టర్ పరమేశ్వర్, డి.కె.శివకుమార్ బెంగళూరులోని హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ కోరారు. ఈ వ్యాఖ్యలు ఒక సామాన్యుడు చేసి ఉంటే అరెస్ట్ చేసి ఉండేవారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మతకల్లోలాలు జరుగుతాయని కేంద్ర హెూం మంత్రి చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు. భారత జాతీయ కాంగ్రెస్ ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందన్నారు. అమిత్ షా దేశానికి హెూంమంత్రి అనీ, బీజేపీ స్టార్ క్యాంపెయినర్ కాదని విమర్శించారు. సీనియర్ కాంగ్రెస్ నేత రణదీప్ సింగ్ సూర్జేవాలా మాట్లాడుతూ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షాపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశామని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత కల్లోలాలు పెరుగుతాయని కర్నాటకలోని బెల్గావి జిల్లా తెర్దాల్‌లో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో అమిత్‌షా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీని ఎన్నుకోకపోతే అభివృద్ధి రివర్స్ గేర్ లోకి వెళ్తుందని హెచ్చరించారు. కర్నాటకలో మే 10న ఓటింగ్ జరగనుంది. మే 13న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ప్రధాని మోడీ..విషపూరితమైన పాము !

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యలు

• అభ్యంతరం వ్యక్తం చేసిన బీజేపీ నేతలు

అంకారా : వచ్చే నెల 10న జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచారం ఊపందుకుంటోంది. గురువారం కల్బుర్గిలో ఎన్నికల సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, విషపూరితమైన పాముతో ప్రధాని మోడీని పోల్చారు. "మీరు ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోండి, మోడీ విషపూరితమైన పాము వంటివారు, అది విషమా కాదా అని పరీక్షించాలని చూడకండి, మీరు పరీక్షిస్తే, వెంటనే చావడం ఖాయం. మోడీ వంటి మంచి వ్యక్తి మీకు ఇస్తున్నందున అది విషం కాదని మీరు అనుకోవచ్చు, కానీ మీరు పరీక్షించారో వెంటనే చనిపోవడం ఖాయం." అని ఖర్గే వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై బిజెపి నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో ఖర్గే గడగ్ జిల్లాలోని రాన్‌లో మరో ఎన్నికల సభలో మాట్లాడుతూ, తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలు మోడీని ఉద్దేశించినవి కావని, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధాంతానివని అన్నారు. ప్రధాని మోడీతో తన పోరాటం వ్యక్తిగత పోరాటం కాదని అన్నారు. ఇది సైద్ధాంతిక పోరు అని స్పష్టం చేశారు. ఎవరి మనోభావాలను దెబ్బతీయాలన్నది తన అభిమతం కాదని చెప్పారు. తెలుసో, తెలియకో ఎవరి భావాలైనా దెబ్బతింటే అది అస్సలు తన ఉద్దేశ్యమే కాదని ట్వీట్‌చేశారు. బిజెపి విషపూరితమైన పాము వంటివదన్నది తన ఉద్దేశ్యమని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరిపైనా తనకు ఎలాంటి ద్వేషభావం లేదని అన్నారు. మోడీని ఉద్దేశించి తాను మాట్లాడలేదన్నారు. "బిజెపి అవినీతిలో కూరుకుపోయింది. ఎవరైనా దాన్ని ప్రశ్నిస్తే, వెంటనే ఐటి. ఇడి దాడులతో బెదిరిస్తారు. అందుకే మోడీ ప్రభుత్వాన్ని విషపూరితమైన పాముతో పోల్చాను." అని ఖర్గే వివరించారు. నారేగల్ ర్యాలీలో కూడా మోడీ ప్రభుత్వంపై ఖర్గే విసుర్లు ఆపలేదు. అవినీతిపై మోడీ వైఖరిని విమర్శిస్తూ, "నేను తినను, తిననివ్వను అని మోడీ చెబుతుంటారు. కానీ 40శాతం కమిషన్లు తీసుకునే వారిని తన పక్కనే కూర్చోబెట్టుకోవడానికి అనుమతించడం ద్వారా రాజకీయాలు చేస్తుంటారు. తన సిద్ధాంతంలో ఆయన దేశాన్ని నాశనం చేస్తున్నారు." అని వ్యాఖ్యానించారు. "ప్రతిపక్షం ప్రభుత్వాన్ని విమర్శిస్తే, వెంటనే ఆయన తన 56 అంగుళాల ఛాతీ గురించి మాట్లాడతారు. మేమేమీ ఆయన బాహ్య రూపాన్ని పరీక్షించడం లేదు. ఆయన చేసిన పనులను లెక్కవేస్తున్నాం." అని అన్నారు. మిత్రుల, ప్రత్యర్థులైనా వారి రాజకీయ దిద్దుబాటుకు అవసరమైన చర్యలు సూచిస్తూ వుంటాను, వ్యక్తులతో వారి సమస్యలతో ఆడుకోవడం నానైజం కాదు, పేదల,అట్టడుగు వర్గాల బాధలు వారి ఇబ్బందులు తనకు తెలుసునని అన్నారు. ఐదు దశాబ్దాలుగా బిజెపి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నానని చెప్పారు. మోడీరాజకీయాలపైనే తన పోరు అని స్పష్టం చేశారు.

అంతకుముందు సిమ్లాలో మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ, మోడీకి దేశ ప్రజలు రెండుసార్లు అధికారం కట్టబెట్టారన్న విషయాన్ని రాజకీయ నేతలు గుర్తుంచుకోవాలి. ఇటువంటి ప్రకటనలు చేయడం దేశానికి అవమానమని అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్‌పార్టీ దేశానికి క్షమాపణ చెప్పాలన్నారు. సీనియర్ బిజెపి నేత శోభా కరాండ్లజే మాట్లాడుతూ, సీనియర్ నేతగా ఖర్గే దేశానికి ఏం చెప్పాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రధానికి వ్యతిరేకంగా ఇటువంటి భాష ఉపయోగించడం అవమానకరమని అన్నారు. కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

భద్రతా మండలిని విస్తరించాలి : రష్యా విజ్ఞప్తి



ఐక్యరాజ్య సమితి ప్రధానాంగమైన భద్రతా మండలిలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు తగినంత ప్రాతినిధ్యంలేదనీ రష్యా విదేశాంగ మంత్రి సర్గీ లవరోవ్ అన్నారు. అంతర్జాతీయ ఘర్షణలను పరిష్కరించే సంస్థగా ఆధునిక భౌగోళిక రాజకీయ అవసరాలను తీర్చటానికి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలని విజ్ఞప్తిచేశారు. అంతర్జాతీయ సంబంధాల్లోని బహుళపక్ష వాదం(మల్టీలేటరలిజం) ఐక్యరాజ్య సమితిని బహుళ ధ్రువ నిర్మాణ లక్ష్యాలకు అనుగుణంగా మారాలని డిమాండ్ చేస్తుందని ఆయన న్యూయార్క్ నగరంలోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో చేసిన ఒక ఉపన్యాసంలో చెప్పాడు. అంటే ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలిలో జరగవలసిన సంస్కరణలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల సభ్యత్వాన్ని పెంచటం ద్వారా జరగాలి. ఐక్యరాజ్య సమితికి చెందిన ఈ ప్రధానమైన విభాగంలో పాశ్చాత్య దేశాలకున్న అతి ప్రాతినిధ్యం బహుళ ధ్రువ నియమాన్ని నీరుగార్చేదిగా ఉందన్నారు. 'పటిష్టమైన బహుళ ధ్రువత్వం" అనే అంశంపైన జరిగిన చర్చలో లవ్ రోవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రొటేషన్ పద్ధతిలో రష్యా భద్రతా మండలి అధ్యక్ష స్థానంలో ఉంది. భద్రతా మండలిలో వీటో అధికారంవున్న సభ్యదేశాల సంఖ్య ఐదు- అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా. ఇవి కాకుండా ప్రతి రెండు సంవత్సరాల కొకసారి ఐక్యరాజ్య సమితిలోని సాధారణ అసెంబ్లీ భద్రతా మండలి కోసం 10 దేశాలను ఎన్నుకుంటుంది. ఈ దేశాలు శాశ్వత సభ్యదేశాలు కావు.

ప్రస్తుత నియమనిబంధనల ప్రకారం ఈ 10 అశాశ్వత సభ్య దేశాల్లో ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి 5, తూర్పు ఐరోపా దేశం 1, పశ్చిమ ఐరోపా దేశాలు 2, లాటిన్ అమెరికా దేశాలు 2 ఉంటాయి.ప్రస్తుతం స్విట్జర్లాండ్, మాల్టా భద్రతా మండలికి ఎన్నికయ్యాయి. ఆ విధంగా 5 పాశ్చాత్య దేశాలకు భద్రతా మండలిలో సభ్యత్వం వచ్చింది. వీటికి తోడు అమెరికా కూటమిలో భాగమైన జపాన్ కూడా భద్రతా మండలికి ఎన్నికైంది. ఈ విధంగా భద్రతా మండలిలో పాశ్చాత్య దేశాలకు అతిగా సభ్యత్వం ఉండటంతోను, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు తగినంత ప్రాతినిధ్యం లేకపోవటంతోను ఐక్యరాజ్య సమితి నిర్వహణలో సమతౌల్యం లోపించింది.

పెట్టుబడిదారులకు మోడీ దోచిపెడుతున్నారు

భారత్ సత్యాగ్రహ దీక్షలో మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశ సంపదను పెట్టుబడిదారులకు మోడీ దోచిపెడుతున్నారని రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ అధ్యక్షులు మీనాక్షి నటరాజన్ విమర్శించారు. ముఖ్యంగా తన స్నేహితులైన అదానీ, అంబానీలకు అప్పనంగా కట్టబెడుతున్నారని చెప్పారు. ప్రజా ఆస్తులను కార్పొరేట్లకు దోచి పెడుతుంటే ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో మోడీని ప్రశ్నించారని గుర్తు చేశారు. దీంతో ఆయనపై మోడీ కక్ష కట్టారని విమర్శించారు.

ఏఐసీసీ పిలుపుమేరకు గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ఆవరణలో పంచాయతీరాజ్ సంఘటన్ నిర్వహించిన భారత్ సత్యాగ్రహ దీక్షలో ఆమె మాట్లాడారు. రోజురోజుకు ఆవిరౌతున్న దేశ సంపద రక్షణ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారని తెలిపారు. ఈవిషయంలో పార్ల మెంట్‌లో చర్చకు కూడా సిద్ధంగా లేని మోడీ రాహుల్‌ను పార్లమెంట్ నుంచి బయటకు పంపేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ఎంపీ పదవిని రద్దు చేయించి, చివరకు ఇంటిని కూడా ఖాళీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేసే నాయకున్ని ఇంత కక్షపూరితంగా వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు.

బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది : ఉత్తమ్

బీజేపీ అప్రజాస్వామికంగా రాహుల్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఎంపీ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పార్టీ పోరాడుతుందని చెప్పారు. పోర్టులు, విమానాశ్రయాలు, పోర్టులు, విద్యుత్ లైన్లు, ప్రభుత్వరంగ సంస్థలను అదానీకి మోడీ కట్టబెడుతున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్న మోడీ తీరుపై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావించారనీ, దాన్ని మోడీ తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. నీరవ్ మోడీ రూ. 14 వేల కోట్లు దోచుకున్నారనీ, లలిత్ మోడీ క్రికెట్ సంఘాన్ని మోసం చేసి లండన్‌పారిపోయారని ఆరోపించారు.

బీజేపీ రాజకీయ కక్ష పరాకాష్టకు చేరింది : చిన్నారెడ్డి.

రాహుల్ గాంధీపై బీజేపీ సర్కారు రాజకీయ కక్ష పరాకాష్టకు చేరిందని ఏఐసీసీ కార్యదర్శి జి.చిన్నారెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీపై సూరత్ కోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే ఆ కాపీ రాకముందే ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీకి వస్తున్న మద్దతు చూసి బీజేపీ భయ పడుతోందని చెప్పారు. భవిష్యత్తులో ఆయన్ను దేశ బహిష్కరణ చేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారు. ఇలాంటి సమయంలో దేశమంతా ఆయనకు మద్దతుగా నిలబడాల్సిన అవసరముందని చెప్పారు.

దేశంలో ప్రజాస్వామ్యం హత్య : నదీమ్ జావీద్

రాహుల్ గాంధీ విషయంలో మోడీ, అమిత్‌షా చేస్తున్న రాజకీయ కుట్రల విషయంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ శాంతి యుత పోరాటం చేస్తున్నదని ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావీద్ చెప్పారు. దేశంలో జరుగుతున్న ప్రజాస్వామ్య హత్యపై ప్రజలు కాంగ్రెస్‌కు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజలు శాంతి, న్యాయం వైపు ఉండాలని కోరారు.

రాహుల్ గాంధీకి సంపూర్ణ మద్దతిస్తూ పోస్ట్ కార్డ్ చేయా లని కోరారు. దీక్షలో టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ హను మంతరావు, నాయకులు గడ్డం ప్రసాద్ కుమార్, కోదండరెడ్డి, రోహిన్ రెడ్డి, నూతి శ్రీకాంత్, సంగిశెట్టి జగదీష్, సునీతా రావు, శ్రీనివాస్, సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు సిద్దేశ్వర్ తదితరులు మాట్లాడారు.

ఉచితాలకు ముగింపు: ప్రధాని మోడీ

బెంగళూరు : 'ఉచిత పథకాలు' సాంప్రదాయానికి ముగింపు పలకనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం పేర్కొన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి కార్యకర్తలనుద్దేశించి వర్చువల్ విధానంలో ప్రసంగించారు. కాంగ్రెస్‌కు వారంటీ ముగిసిందని వ్యాఖ్యానించారు. 'కార్యకర్తల కృషి వల్ల కర్ణాటకలో బిజెపి రికార్డు సీట్లు సొంతం చేసుకుంటుంది. అయితే అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మాత్రమే వస్తే సరిపోదు. అది పూర్తి మెజార్టీతో ఉండాలి. దేశంలో మొదటి ఎయిమ్స్ 1956లో ప్రారంభమైంది.

కానీ, ఆ తర్వాతది ఎప్పుడు వచ్చింది..? దాని గురించి కాంగ్రెస్ ఏమీ మాట్లాడదు. మేం అధికారంలోకి వచ్చాం. ఎయిమ్స్ సంఖ్యను మూడు రెట్లు పెంచాం. ఇప్పుడు చెప్పండి డబుల్ ఇంజిన్ వల్ల లాభమా..? నష్టమా..? కాంగ్రెస్ అంటేనే ఒక అబద్ధపు గ్యారంటీ. కాంగ్రెస్ ఉంటే అవినీతికి గ్యారంటీ. ఎలాంటి గ్యారంటీ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ఉంది. ఆ పార్టీ వారంటీ ముగిసింది' అంటూ మోడీ విమర్శించారు. పార్టీ వారెంటీ ముగిసిన తర్వాత ఎన్ని హామీలిచ్చినా అర్థం లేదని పరోక్షంగా కాంగ్రెస్ గురించి వ్యాఖ్యానించారు. ఉచిత పథకాల కారణంగా ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని, ఇలా అయితే దేశాన్ని, ప్రభుత్వాన్ని నడపలేమని అన్నారు.